ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 3 సంచిక - 6 ఫిబ్రవరి - మార్చి 2022 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20




జొన్న చేను గట్టు మీద.. ఆకుపచ్చని మంచె ఒక్కటి...
ఫొటో : గేరా

# సాహిత్య ప్రస్థానం


## యుద్ధాలు .. ఎన్నికలు... సవాళ్లు

**సా**హిత్య జీవులు రచనలు, పుస్తకాల గురించి అమితాసక్తి కలిగివుండటం సహజమే. కానీ పనిపాటలూ కష్టసుఖాలు ఆర్థిక రాజకీయ పరిణామాలకు అతీతులేమీ కాదు. వారూ సమకాలీన ప్రపంచంలో భాగస్వాములే. వర్తమాన ప్రపంచమంతా ఉక్రెయిన్‌పై రష్యా దాడి గురించి చర్చిస్తున్నది. రష్యా దురాక్రమణ చేసింది గనక పాఠం నేర్పాలనే వాదనలు ఒకవైపు; అమెరికా నడిపించే నాటో సైనిక కూటమి జోక్యం వుండదనే హామీ కోరుతున్న రష్యా వాదనలోనూ న్యాయం వుందనే అభిప్రాయం మరోవైపు వినిపిస్తున్నాయి. కొన్ని తేడాలున్నా భారతదేశం, చైనా వంటివి ఐక్య రాజ్య సమితిలో ఈ విషయమై తటస్థ వైఖరి తీసుకున్నాయి. ఇప్పటికే ఈ యుద్ధంలో దాడుల వల్ల ఎందరో మరణించగా మనదేశంతో సహా ప్రపంచమంతటా పెట్రోలు ధరలు పెరిగిపోతున్నాయి. స్టాక్‌మార్కెట్లు తలకిందులవుతున్నాయి. రష్యా వాదన ఏమైనప్పటికీ దాడి విస్తరించరాదని, అందరికీ ఆమోదయోగ్యమైన శాంతియుత ముగింపు వుండాలని శాంతికాముక ప్రపంచం కోరుకుంటున్నది.

♦ ♦ ♦

దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్‌పరం చేసే ప్రైవేటీకరణ విధానాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఇటీవలనే ఎయిరిండియా టాటాల పరం కాగా, దేశంలోనే పెద్దదైన ఎల్ఐసిలో వాటాల విక్రయానికి రంగం సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లోనూ చాలా సంస్థలు ఈ విధంగా బేరానికి వచ్చాయి. విచక్షణారహితమైన ప్రైవేటీకరణ కొనసాగింపుగా కార్మికులు, ఉద్యోగుల హక్కులు కోతపడుతున్నాయి. నిరుద్యోగం మండిపోతున్నది. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా మరోసారి సమ్మె సన్నాహాలు జరుగుతున్నాయి. శ్రమజీవులు, మధ్య తరగతి మానవుల మనుగడ పోరాటమిది. రైతాంగ వ్యతిరేక శాసనాలపై పోరాటం వాటిని వెనక్కు కొట్టినా ఇంకా వ్యవసాయరంగంలో సవాళ్లు పెరుగుతున్నాయి. కరోనా నేపథ్యంలో అసలే ఆర్థిక పరిస్థితి దిగజారిన రాష్ట్రాలకు కేంద్రం నుంచి అదనపు సాయం అందకపోగా, ఉన్న హక్కులు వనరులకే గండిపడుతున్నది. వివిధ తరగతుల ప్రజలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, వాటిని నడిపే వివిధ రాజకీయ పక్షాలు కూడా కేంద్రం విధానాలపై పోరాటానికి సిద్ధపడుతున్నాయి. కొత్త రాజకీయ పొందికల కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. 2024లో పార్లమెంటు ఎన్నికలు వచ్చేలోగా దశలవారీగా పూర్తయ్యే వివిధ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఈ పరిణామ క్రమాన్ని ప్రభావితం చేస్తాయని భావిస్తున్నారు. ప్రజాస్వామ్య లౌకిక విధానాలు రాష్ట్రాల హక్కులు, దేశసమైక్యత, సార్వభౌమత్వం, భావప్రకటనా స్వేచ్ఛ కాపాడుకోవడానికి ఆలోచనాపరులంతా కృషి చేయవలసిన తరుణమిది.

♦ ♦ ♦

మిగిలిన అనేక పత్రికలతో పోలిస్తే సాహిత్య ప్రస్థానం క్రమబద్ధంగా వెలువడుతున్న తీరు అందరికీ తెలుసు. కరోనా కారణంగానే కలిగిన కొద్దిపాటి ఇబ్బంది మినహా మరెప్పుడూ అంతరాయం రాకుండా జాగ్రత్త పడ్డాము. గతసారి మాలపల్లి ప్రత్యేక సంచిక కారణంగా ఫిబ్రవరి – మార్చి కలిపి ఈసారి అందిస్తున్నాం. ఇక మీదట యథాతథంగా ఏ నెలకు ఆ నెలే ప్రచురితమవుతుందని తెలియజేస్తున్నాం.

■


ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్** ◆ **కెంగార మోహన్** ◆ **వొరప్రసాద్**
◆ **చీకటి దివాకర్** ◆ **గనారా** ◆ **కుమార స్వామి**
*మేనేజర్ :* **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**



Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు

చారలపిల్లి : వేంపల్లి షరీఫ్ .............. 5
పుల్లేటిపల్లి : యక్కలూరి శ్రీరాములు ... 21
వాన మెతుకులు : కెంగార మోహన్ .......... 34
ఇష్టం : పద్మావతి రాంభక్త ......... 48
ఇంజెక్షను : డా. దార్ల విజయకుమారి 55

## కవితలు

చిక్కుపడిన దారం : మంచు శ్రీవల్లి ............. 8
మాలిమి వంతెన : అను : కిల్లాడ సత్యనారాయణ 9
కవిత్వమే నినాదం : అవనిశ్రీ .................... 13
గెలవడం ఒక కళ : డా.కటుకోర్ఝ్వల రమేష్... 14
కళావతి : రవి నన్నపనేని ............. 19
పరుసవేది : మూని వెంకట చలపతి ... 19
మాటను గెలిపిస్తూనే ఉంది : చందలూరి నారాయణరావు .. 20
అల్లుకునే ఆలోచనలు : బి.గోవర్ధనరావు ............ 24
వాళ్లే లేకపోతే ... : అనిల్ డ్యానీ ................ 25
పాప మట్టి తింటుంది : జి.శైలమ్మ ................. 28
పాలస్తీనా జ్ఞాపకాలు : డా.ఎన్.గోపి ................ 29
ఓట్ల కొలిమిలో ... : డా.గన్నోజు శ్రీనివాసాచారి 32
తడి : అఖిలాశ ................... 33
నువ్వు కూర్చున్న కొమ్మ : దీపికా జేమ్స్ ................ 33
శాంతి : లక్ష్మీ కందిమళ్ల .............. 37
సమీకరణం : తండ హరీష్ గౌడ్ ......... 41
కాలనీ : డా. ఉదారి నారాయణ .. 51
విజేత : చొక్కర తాతారావు ....... 61

## వ్యాసాలు

సాహిత్య ప్రస్థానం నవంబరు 2021 పురస్కారాలు .... 24
మన తెలుగు : నాడు - నేడు
- ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న .. 10
నీడల మాటున కదిలే కవన దృశ్యాలు
- ఎమ్వీ రామిరెడ్డి ................ 15
ఆలోచన మూలాల్ని స్పర్శించిన ఐదో గోడ కథలు
- కె.వి.కృష్ణ ........................ 26
మనోఫలకంపై దృశ్యావిష్కరణ
- బొల్లోజు బాబా .................. 30
బలివాడ కాంతారావు : జీవితం - సాహిత్యం
- బొడ్డపాటి చంద్రశేఖర్ .......... 38
సాహితీ ఆతిథ్యం - ఎస్ హనుమంతరావు .......... 42
బహుజన బతుకుల చిత్రికలు సిక్కెంటిక కథలు
- డా. వి.ఆర్.రాసాని ............ 44
వర్తమానం : హైకోర్టు తీర్పు .. కానరాని మార్పు
- తెలకపల్లి రవి ................... 52
కోట్ల సామాజిక సరళ శతకం - పుట్టి గిరిధర్ ...... 57
ఆధునిక స్త్రీ దృక్కోణంలో సీతజోస్యం
- భమిడిపాటి గౌరీశంకర్ ...... 59
చింతామణిపై నిషేధం .. - వి.సుమతి .................. 62
జ్ఞాపకం : ఆయనే ఒక కథాక్షేత్రం ....................... 64
డైరీ ....................................................... 66



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# చారలపిల్లి

- వేంపల్లె షరీఫ్

96034 29366

**మై**దానంలో నిలబడి తోక పైకెత్తి నింపాదిగా వొళ్లు విరుచుకుంటోంది పిల్లి. ఆ అవకాశం కోసమే చూస్తున్నాడు ఆ పిల్లవాడు. పెద్ద రాయి ఒకటి చేతిలోకి తీసుకుని గురి చూసి దాని మీదికి కసితీరా విసిరాడు. సర్రుమని గాలి వేగంతో వెళ్లిన రాయి 'దబ్' అంటూ పిల్లి పక్కనే పడి గురి తప్పింది.

అంతే! క్షణాల్లో పిల్లి అక్కడ్నుంచి పరారైంది. దాని ముఖంలో భయం లేకపోగా దర్జాగా తిరుగుతుండటం ఆ పిల్లాడికి నచ్చడం లేదు. మరింత కోపం తెప్పిస్తోంది.

'ఛ త్తెరికి..' అని చేతి వేళ్లను గాల్లోనే విదిలించి వెనక్కి తిరిగాడు కదా.. ఎదురుగా పుల్లగాడు. వాడి అసలు పేరు ఎవరికి తెలియదు కానీ అందరూ వాణ్ని పుల్లగాడు అనే అంటారు. తోటిపిల్లలు ఏం చేస్తున్నారో ఎప్పుడూ గమనిస్తూ ఏమాత్రం తేడా వచ్చినా వాళ్ల తల్లి దండ్రులకు చెప్పేసి మార్కులు కొట్టేస్తుంటాడు. ఇప్పుడు ఆ పిల్లవాడి అమ్మక్కూడా ఆ పుల్లగాడు అంటే గురి.

'వెళ్లి ఈ విషయం వాడు తప్పకుండా అమ్మకు చెబుతాడు. వాణ్ని ఎంత బతిమాలినా వేస్ట్' అని మనసులో అనుకుని చేసేదిలేక 'ఏం చేసుకుంటావో చేసుకోపో..' అన్నట్టు నిర్లక్ష్యంగానే నిలబడ్డాడు.

పుల్లగాడికి మరింత మండింది.

'పిల్లిని చంపడానికి ప్రయత్నిస్తూ పెద్ద ఘాతుకానికి పాల్పడు తోందే కాక మళ్లీ నా ముందే ఫోజు కొడుతూ నిలబడతాడా?' అని మనసులో కుతకుతలాడుతూ వేగంగా వెళ్లి వాళ్లమ్మకు అంటించేశాడు.

ఎక్కడలేని ఆక్రోశం పుట్టుకొచ్చేసింది వాళ్లమ్మకు.

'పిల్లిని చంపితే పాపం రా... ఇప్పుడే అష్టాదశ దరిద్రాలు ఉన్నాయి కొంపలో. నువ్వు ఆ పిల్లిని చంపాక ఇంట్లో ఎవరికన్నా ఏదన్నా అయితే నేనెక్కడ చావాలా..' అని కోపంతో ఊగిపోతూ జుట్టు పట్టుకుని ఆ పక్కకు, ఈ పక్కకు ఈడ్చి తన్నింది. అంతటితో ఆగక ఇంట్లో ఉన్న పాత విసనకర్రను తిరగేసి మరిన్ని వడ్డించింది.

వాడు ఎక్కిళ్ల మీద వలవలా ఏడుస్తూ మంచమెక్కి దుప్పటి కప్పుకున్నాడు. వొంటిమీద పడ్డ ఒక్కో దెబ్బకీ పిల్లి మీద కోపం రెట్టింపవుతూ ఉంది. ఒకవైపు ఏడుస్తూనే మరోవైపు పిల్లిని తల్చుకుని పళ్లు పటా పటా కొరుకుతున్నాడు.

తనకు మొత్తం నాలుగు పావురాలున్నాయి.

ఒక ఆదివారం నిమ్మతోటకెళ్లిన తండ్రికి అన్నం క్యారీని సైకిల్‌పై తీసుకెళ్తూ దారిలో ఆ పావురాల ఇంటిని చూశాడు. కాసేపు అక్కడే నిలబడి 'గుడు గుడు గుడు' అంటూ విచిత్రంగా శబ్దాలు చేస్తున్న పావురాలను చూసి మురిసిపోయాడు. అవి నీళ్లు తాగి మూతిని విదిలించుకుని రెక్కలను టపటప లాడిస్తుంటే ముచ్చటపడ్డాడు. గుప్పిట నిండా జొన్నలు నింపుకుని 'బ్బా..బ్బా..బ్బా..' అని అరుస్తూ పావురాలకు వేసే ఆ ఇంటి మనిషిని దేవతా పురుషుడిలాగ భావించాడు.

తనక్కూడా అలాంటి పావురాలు కావాలనుకున్నాడు. వెంటనే వాళ్ల నాన్న దగ్గర నసుగుతూ విషయం చెప్పాడు. వాళ్ల నాన్న చిరాగ్గా ముఖం పెట్టి 'వొద్దు రా.. పావురాలు అందరికీ అచ్చిరావు..' అన్నాడు.

'నీవి మూఢ నమ్మకాలు నాన్న. మూగజీవులను పెంచితే జరిగితే మేలే జరుగుతుంది కానీ కీడు జరగదని మా టీచరమ్మ

చెప్పింది' అంటూ అలిగాడు.

వాళ్ల నాన్న వినలేదు. ఇతనూ తగ్గలేదు. మరుసటి ఆదివారం తోట దగ్గరికి అన్నంక్యారీ తీసుకొచ్చేది లేదని ముందుగానే చెప్పి స్ట్రయిక్‌కి దిగాడు. తప్పేలా లేదు తండ్రికి. పిల్లల ముందు తండ్రులెప్పుడూ తగ్గాల్సిందే కదా. తగ్గాడు. అతన్ని తీసుకెళ్లి ఆ పావురాల ఇంటి ముందు నిలబెట్టాడు.

'ఏ రంగు పావురాలు కావాలో చూసుకో రా..' అన్నాడు.

ఆ పిల్లవాడు తనకు 'నాలుగు తెల్ల పావురాలు కావాలి' అన్నాడు.

పావురాల మనిషి 'ఒకప్పుడు తెల్లపావురాలు దండిగా ఉండేవి బాబు. ఇప్పుడు తగ్గిపోయాయి. నా దగ్గర ఒకటే తెల్ల పావురం ఉంది. దాని జతలో నల్లమచ్చల తెల్ల పావురం ఉంది. మరో జత కావాలంటే నల్ల పావురాలు తీసుకోవాల్సిందే' అన్నాడు.

సర్లే అనుకుని జత రెండున్నర వందల చొప్పున బేరంచేసి రెండు జతల్ని తండ్రితో కొనిపించుకున్నాడు. రెక్కలున్న పావురాలు కొత్త గూడుకు అలవాటు కావు అంటూ నాలుగు పావురాల రెక్కలు కత్తిరించి ఇచ్చాడు ఆ మనిషి. కొత్త రెక్కలు వచ్చేలోపు పావురాలు కొత్తగూడుకు అలవాటు అవుతాయి అని చెప్పాడు.

ఆ పిల్లవాడు పావురాలను జాగ్రత్తగా పట్టుకుని ఇంటి కొచ్చాడు. అతని ఆనందానికి అవధుల్లేవు. పావురాల కోసం ఇటుకలు, బంక మన్ను తెచ్చి మిద్దె మీద గూడు కట్టాడు. గూటి ముందు పావురాలు నీళ్లు తాగడానికి చిన్న తొట్టి కట్టాడు.

ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం స్కూలుకు వెళ్లే ముందు, స్కూలు నుంచి తిరిగొచ్చాక పావురాలను గూటి నుండి బయటికి వదిలి గింజలు చల్లి, నీళ్లు పోసి తర్వాత తిరిగి వాటిని గూట్లోకి పంపి గూటి తలుపుకి వెడల్పాటి రాయి అడ్డం పెట్టేవాడు.

కొత్త రెక్కలు వచ్చేసరికి పావురాలు కొత్త గూటికి అలవాట య్యాయి. అవి అలా అనంతంలోకి ఎగిరి కాసేపటికి తిరిగొచ్చి కరెక్టుగా గూటి దగ్గర వాలడం ఆ పిల్లవాడికి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించే విషయం.

'పక్షులు ఎంత మంచివి? వాటికెంత విశ్వాసం! రెక్కలతో అలా వదిలేసినా పారిపోకుండా వచ్చి పెంచిన మనిషినే అంటిపెట్టుకుని ఉంటున్నాయి' అని మనసులో అనుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి.

తెల్లపావురం తొక్కిళ్లు పడుతోంది.

'పక్షులు అలా తొక్కిళ్లకు వచ్చినప్పుడు వాటిని ఏకాంతంగా వదిలేయాలి. వాటి వైపు చూడకూడదు, ముట్టుకోవడానికి ప్రయత్నించకూడదు' తల్లి చెప్పిన మాటలు అతని చెవుల్లో కూర్చుండిపోయాయి.

అయినా అప్పుడప్పుడు తనకు తెలియకుండానే వాటివైపు చూస్తున్నాడు. తిరిగి పశ్చాత్తాపపడుతున్నాడు. మరోవైపు తెల్ల పావురం ఎండిన వేపపుల్లలను ఎక్కడి నుంచో ఏరుకొచ్చి గూటిలో స్థలం చేసుకుంటోంది. అది చూశాక అతని ఆనందం మరింత రెట్టింపైంది.

ఆ విషయం వాళ్లమ్మకు చెప్పాడు. స్నేహితులకు, ఇరుగు పొరుగు వారికి చెప్పాడు. కళ్లారా చూస్తే కానీ నమ్మని స్నేహితులను అదే పనిగా ఇంటికి తీసుకొచ్చి చూపించాడు. చూసినవాళ్లు అబ్బురపడి పావురాలను సాకుతూ మంచి పని చేస్తున్నావంటూ ఆ పిల్లవాడిని మెచ్చుకున్నారు.

అతనికి కాలం తెలియడం లేదు. గంటలు జెడ్ స్పీడ్‌తో పరిగెడుతుంటే ఒకరోజు పొద్దున్నే అతని గుండెల్లో రాయి పడింది.

నల్ల పావురాల జతలో ఒక పావురం మాయమైంది. ఎలా మాయమైందో అర్థం లేదు. మిద్దెంతా కలియతిరిగాడు. తల్లితో చెప్పుకుని దిగులు పడ్డాడు. ఆమెక్కూడా ఆ పావురం ఏమైందో అర్థం కాలేదు. తండ్రికి చెప్పాడు. అసలే – వద్దంటే పావురాలు పెంచుతున్నందుకు కోపంగా ఉన్న తండ్రి 'బాగైంది' అన్నట్టు చూశాడు కానీ సానుభూతి చూపలేదు.

ఇక తండ్రికి చెప్పి ఉపయోగం లేదని కిందా మీదా అవుతుంటే సరిగ్గా అప్పుడు వినపడింది పిల్లి అరుపు.

'మ్యావ్..'

వణికిపోయాడు ఆ పిల్లవాడు.

అంతకుముందు పిల్లి అరుపు చాలా సార్లు విన్నాడు కానీ ఇంతలా భయపడలేదు. నిజానికి ఈ పావురాలకు ముందు అతని జీవితంలో ఈ పిల్లే ఉంది. దాని మీదున్న నారింజ రంగు చారలంటే అతనికి ఇష్టం. అప్పుడప్పుడు ముక్కల కూర తింటున్నప్పుడు పిల్లి కనబడితే కంచంలోంచి రెండు బొమికలు తీసి పెట్టి దాన్ని ముద్దు చేసేవాడు. ఇప్పుడు ఆ పిల్లి బొమికల కోసం తన పావురాల మీదే దాడి చేస్తుందని అతను ఊహించనే లేదు. ఈ మధ్యకాలంలో తన కంటికి పిల్లి కనబడలేదా.. లేక కనబడినా తనే గుర్తించలేదో అతనికి అర్థం కాలేదు.

వెంటనే ఈ విషయం తల్లికి చెప్పాడు.

'మ్మా.. పిల్లి మ్మా.. చారల పిల్లి.. అదే తినేసి ఉంటుందమ్మా.. పావురాన్ని'

ఆమెక్కూడా విషయం నిర్ధారణ అయింది.

'ఔన్రా.. పిల్లి. అది పావురాల మాంసాన్ని రుచి చూసింది. జాగ్రత్తగా ఉండాలి. ఒక పని చెయ్యి. నీ జతలో తిరుగు తుంటాడు కదా.. ఆ వడ్రంగోళ్ల పిల్లోడు, వాణ్ని పిలుచుకురా..

చెప్తా' అని ఆర్డర్ వేసింది.

ఆ పిల్లవాడు ఇంకేమీ ఆలోచించకుండా మూడు నిమిషాల్లో సైకిల్ మీదెళ్లి అతణ్ని వెంటేసుకుని వచ్చాడు. ఇంట్లో అటక మీదున్న ఒక వెడల్పాటి పాత చెక్కని దులిపి ఆ వడ్రంగోళ్ల పిల్లోడి ముందు పడేసింది. ఆ చెక్కతో గూటికి 'గట్టి తలుపు' చేయమంది.

'ఓ.. అదెంత సేపు. పోయి సామాన్లు తెచ్చుకుంటాను' అని చెప్పి ఆ పిల్లోడు క్షణాల్లో సామాన్లతో తిరిగొచ్చి రెండు గంటలు కూడా తిరక్కుండానే గూటికి చక్కటి తలుపు ఒకటి అమర్చి ఇచ్చిందేదో జేబులో పెట్టుకుని వెళ్లిపోయాడు.

అది చూసి 'హమ్మయ్యా' అని ఊపిరి పీల్చుకున్నాడు ఈ పిల్లోడు.

ఒకరోజు ప్రశాంతంగా గడిచిందో లేదో మరుసటి రోజు తెల్లమచ్చల నల్ల పావురం లేదు.

ఇంకేం చేయాలో అర్థం కాలేదు ఆ పిల్లోడికి.

పిల్లి మీద పగబట్టాడు. దాన్నెలాగైనా చంపాలని నిర్ణయించు కున్నాడు.

'మ్మా.. ఆ పిల్లిని చంపేస్తాను మ్మా..' అన్నాడు ఏడుస్తూ.

తల్లి భయపడిపోయింది.

'నీకేమైనా మతి పోయిందా? పిల్లిని చంపుతారా ఎవరైనా? పిల్లిని చంపితే ఏడు జన్మల పాపం' అంది.

ఆ పిల్లవాడికి ఏం అర్థం కాలేదు.

'పిల్లి పావురాలను చంపితే పాపం కాదా..' అన్నాడు గట్టిగా అరుస్తూ.

'పాపమే. అలా అని పిల్లి చేసిన తప్పునే మనమూ చేయలేం కదా. మనం మనుషులం, నువ్వు కాసేపు ఎదురు ప్రశ్నలు వేయకుండా నోర్మోసుకుని కూర్చుంటే, ఏదో ఒకటి ఆలోచించి ఏం చేయాలో చెబుతాను' అంది.

అతనికేం పాలుపోలేదు.

స్నేహితులను అడిగాడు. వాళ్లు కూడా 'పిల్లిని చంపితే పాపం' అన్నారు. అసలు ఆ ఆలోచనకే వణికిపోయారు.

పచ్చి నెత్తురు తాగే పిల్లికి సమాజంలో ఇంత సానుభూతి ఎందుకో కూడా అతనికి అర్థం కాలేదు. ఇంటికొచ్చి మళ్లీ తల్లినే అడిగాడు 'పిల్లిని చంపితే ఎందుకు పాపం?' అని.

ఆమెకు చిరాకేసింది. ఇప్పటికిప్పుడు వాడికి పురాణాలన్నీ విడమర్చి చెప్పే ఓపిక ఆమెకు లేదు.

'ఎందుకైతే నీకెందుకురా.. అవన్నీ? పెద్దలు చెప్పారు.. ఏమీ లేనిదే ఎందుకు చెబుతారు.. పిల్లిని చంపకూడదంతే...' అంది.

అతనికి సంతృప్తిగా అనిపించలేదు. ఎంత ఆలోచించినా తన చిట్టి బుర్రకు పిల్లిని ఎందుకు చంపకూడదో ఒక్క కారణమూ సవ్యంగా తోచడంలేదు.

అది తన అమాయక పావురాలను తినేస్తోంది. ఏ హాని చేయని సున్నిత జాతిని పొట్టన పెట్టుకుంటోంది. ఎలాగైనా దాని అడ్డు తొలగించుకోవాలి అంతే!

అందుకే అతను మైదానంలో అదును చూసుకుని ఎవరికీ తెలియకుండా పిల్లిని రాయితో కొట్టి చంపబోయాడు. కానీ అది గురి తప్పి తనను వెక్కిరిస్తూ తప్పించుకుని వెళ్లిపోయింది. ఆలోచించేకొద్ది ఎంతకూ ఆగక ఏడుపు తన్నుకొస్తూనే ఉంది.

కోపం తగ్గిన తల్లికి అతని మీద జాలి కలిగింది.

పావురాల మీద అతనికున్న ప్రేమ పట్ల ఆరాధన కలిగింది.

పిల్లవాడు కప్పుకున్న దుప్పటిని మురిపెంగా పక్కకు లాగి పడేసింది.

'నా.. కన్న కదూ.. చెప్పినట్టు వింటావు కదూ..' అంటూ ఆమె అతని తల మీద చల్లగా చేయి వేసింది.

అతను విదిల్చికొట్టాడు.

'పో.. రాకు.. నా దగ్గరికి.. నువ్వు దెయ్యానివి, పావురాలను తిన్న పిల్లిని సపోర్టు చేస్తున్నావ్'

ఆమె శాంతంగా నవ్వుతూ 'అది కాదు నాయనా. దేనికైనా ఒక మార్గం ఉంటుంది. చంపడం పరిష్కారం కాదు. నీకో ఉపాయం చెప్పనా. రేపు పిల్లికి పెరుగన్నం పెట్టి ఇంట్లోకి పిలిచి తలుపు ఏసేస్తాను. నువ్వు దాన్ని పట్టుకుని సంచిలో వేసుకుని ఊరిబయట మర్రి మాను దగ్గర వొదిలేసి రా.. దాని పీడ విరగడ అవుతుంది, సరేనా?'

ఆ పిల్లవాడి ముఖం వెలిగిపోయింది.

ఆ ఐడియా బాగా నచ్చింది. వెంటనే లేచి కూర్చున్నాడు.

అన్నట్టుగానే సాయంత్రం పొద్దుగూకుతున్న వేళ ఇంటి ముందు తచ్చాడుతున్న పిల్లిని 'ష్..ష్..ష్...' అంటూ నోటితో అదోరకంగా శబ్దం చేస్తూ ఇంట్లోకి స్వాగతించింది తల్లి.

వెనక నుంచి వచ్చి తలుపేసి పెద్ద వేటగాడిలా నిలబడ్డాడు ఆ పిల్లవాడు.

పిల్లి ప్రమాదాన్ని గుర్తించింది. అటూ ఇటూ పరిగెత్తడానికి ప్రయత్నించింది కానీ దారిలేక దొరికిపోయింది.

'బ్యార్.. బ్యార్...' మంటూ అదో రకమైన భీతావాహ అరుపు అరుస్తుంటే దాన్ని కసితీరా గోనెసంచిలోకి విసిరేసి మూట గట్టాడు.

ఆ మూటను ఆనందంగా సైకిల్‌కి కట్టుకుని పూర్తిగా చీకటి కమ్ముతుండగా ఊరి బయట మర్రిమాను దగ్గరికి చేరాడు.

అది దారంతా సంచిలో గుర్రు గుర్రుమంటూనే ఉంది.

ఆ పిల్లవాడికి పిల్లిని మర్రిమాను దగ్గరే వదిలేయబుద్ధి కాలేదు. ఇంకా దూరం వెళ్లడం మంచిది అనిపించింది.

చీకట్లోనే మర్రి మాను దాటి శుద్ధ కొండ మలుపులు కూడా దాటి ఆ పక్కనున్న కుమ్మరాంపల్లికెళ్లి ఎవరూ చూడకుండా నడి ఊళ్లో పిల్లిని వదిలేసి వెనక్కి తిరిగి చూడకుండా వచ్చేశాడు.

తల్లి చెప్పిన దాని కన్నా ఇంకా దూరంగా పిల్లిని వదిలేసినందుకు మనసులోనే కొంత సంబరపడ్డాడు. పిల్లి పీడ విరగడైనందుకు సంతృప్తి చెందాడు.

ఇప్పుడు అతని దగ్గర రెండు ఒంటరి పావురాలు ఉన్నాయి. జత పావురాలు లేక అవి బిక్కముఖం వేసి ఉన్నాయి.

తెల్లపావురం ఇప్పుడు ఒట్టేప పుల్లలు ఏరుకురావడం మానేసింది. గుడ్ల కోసం స్థలం చేసుకోవడం లేదు. వాటిని చూస్తే ఆ పిల్లవాడికి కడుపులో దేవినట్టవుతోంది.

'ఎలాగైనా వాటికి జత పావురాలు తేవాలి. వాటిల్లో మళ్లీ పాత హుషారు చూడాలి' – మనసులోనే అనుకున్నాడు.

అంతకుముందులాగే స్కూలుకు ముందు తర్వాత పావురాలతో గడుపుతున్నాడు. ఈ ముచ్చట కూడా కచ్చితంగా నాలుగు రోజులుంది, అంతే! ఐదోరోజు ఉదయానే చూసేసరికి తెల్లపావురం ఒక్కటే బిక్కుబిక్కుమంటూ గూట్లో ఉంది.

ఇక ఆ పిల్లవాడు వశం తప్పాడు. గింజలు వేద్దామని తెచ్చిన ప్లాస్టిక్ సంచిని నేలకు విసిరికొట్టాడు.

'ఆ పిల్లి మళ్లీ వచ్చింది మ్మా. నల్ల పావురాన్ని పట్టుకెళ్లి పోయింది' అంటూ గట్టిగా అరుస్తూ తల్లి దగ్గరికి పరిగెత్తాడు.

తల్లి అమాంతం అతన్ని వాటేసుకుంది. అతని ముఖాన్ని కడుపుకు ఆనించుకుని నుదుట ముద్దుపెట్టి సముదాయించ డానికి ప్రయత్నిస్తోంది.

ఒకవైపు చిట్టచివరి తెల్ల పావురం మరోవైపు పావురం తెలుపులాంటి పిల్లవాడి మనసు ఎలా కాపాడుకోవాలో ఆమెకు తెలియడం లేదు. కళ్లముందే ఆ పిల్లి శరీరం ఇంతింతై వటుడింతై అన్నట్టు పెద్ద పెద్ద చారలతో ఆకాశమంత విస్తరిస్తోంది. కానీ ఆ పిల్లవాడు ఏడ్వడం లేదు, పట్టరాని కోపంతో గసపోతున్నాడు. వాడి ముక్కుల నుంచి వస్తున్న శ్వాస ఆమె పొట్టకు వేడిగా తగుల్తోంది.

అది ఆ పిల్లి కన్నా ఎత్తుకు పాకుతోంది. ■





## చిక్కుపడిన దారం

**చి**క్కు తీయడం తేలికేమి కాదు
నిర్మలమైన మనసుతో
ప్రశాంతంగా కొద్ది కొద్దిగా విప్పాలి
చికాకు, కోపం, విసుగు
సర్పాలు లాంటివి
వాటిని మెత్తగా పడుకోబెట్టాలి
నైపుణ్యమైన చేతులతో
ఒక్కో ముడిని విడతీయాలి

మరి చిక్కుపడిన జీవితాన్ని?
చిక్కుపడిన దారం
సమస్యల జీవితం
రెండూ ఒక తల్లి బిడ్డలే
ఏకాగ్రతగా దారాన్ని విడదీసినట్టు
జీవితంలోని సమస్యలను
ప్రేమగా, ఆలోచనగా పరిష్కరించుకోవాలి
మొన్న చిక్కుపడిన దారాన్ని
కోపంగా, ఆవేశంగా విప్పుకుంటున్న
మనిషిని చూశాను

నవ్వమన్నాను
నదిలా నవ్వాడు, ఆకులా పులకరించాడు
దీపంలా వెలిగాడు
చిక్కులు వీడిన దారం
కొత్త మార్గానికి మహోదయానికి
బాటలు వేసింది!

**- మంచు శ్రీవల్లి**

అనువాద కవిత

# మాలిమి వంతెన

మూలం : జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత కేదార్ నాథ్ సింగ్
అనువాదం : కిల్లాడ సత్యనారాయణ

**దా**ని ఎరుపెరుపు ఎత్తు కమానుల్ని
నేను స్కూలు నుండి
తిరిగి వస్తున్నప్పుడు తొలిసారి చూసాను
అవి చలికాలపు తొలి రోజులు
తూరుపు నీలాకాశంలో సారస్ పక్షుల గుంపులా వ్యాపించి
మాలిమి వంతెన మెలమెల్లగా ఎగురుతుంది

దాన్ని ఎప్పుడు కట్టారో ఎవరికీ తెలీదు
ఈ మాలిమి వంతెనను ఎవరు కట్టారన్న విషయం
ఇప్పటికీ మా ఊరివాళ్ళను ఇబ్బంది పెడుతుంది
'నువ్వు పుట్టక ముందే కట్టారని' అమ్మమ్మ చెప్పేది
'పగలు రాత్రవడానికి ముందు అది పుట్టింద'ని
గ్రామంలోని ముసలి చౌకీదారు అనేవాడు!

ఇలాగే ఒక ఉదయాన
ఇసుక తిన్నెపై మాలిమి వంతెన పడి ఉండడాన్ని
బన్నీ మల్ల కళ్లు అడగడం నిజం కాదా?
లాల్మోహర్ దున్నుతున్నాడు
ఆ సమయంలోనే అతనికి ఖైనీ కావాలనిపిస్తుంది
ఎద్దు కొమ్ముల మధ్యలో
మాలిమి వంతెన కనిపిస్తుంది

అతడు పన్నెండు ఝుప్పి గొర్రెల్ని చూసాడు
మేస్తూ మేస్తూ అలసిపోయినప్పుడు
అవి తల పైకెత్తి మాలిమి వంతెన ఎటువైపు ఉందో
అటువైపు చూస్తాయి

మాలిమి వంతెనలో ఎన్ని కాళ్ళున్నాయి
పందొమ్మిదంటాడు జగదీష్
ఇరవై అంటాడు రతన్ హజ్జామ్
చాలా సార్లు ఈ లెక్క
ఇరవై మూడు, ఇరవై నాలుక్కి కూడా చేరుతుంది
పగలు వున్న కాళ్ళు రాత్రుళ్లు తగ్గిపోతాయా?
మాలిమి వంతెన కాళ్ళు
పొద్దు పొడుస్తూనే పెరిగిపోతాయా?

మాలిమి వంతెనలో ఎన్ని ఇటుకలున్నాయి?
ఎన్ని కోట్ల ఇసుక రేణువులున్నాయి?
ఎన్ని కంచర గాడిదలు ఎన్ని ఎడ్ల బండ్లు
ఎన్ని కళ్ళు ఎన్ని చేతులు
ఈ మాలిమి వంతెన కోసం ఎంపికయ్యాయో
మా ఊరి జనం వద్ద దీనికి ఏ లెక్కా లేదు!

నిజం చెప్పాలంటే – మా ఊరోళ్లకు తెలిసిందొక్కటే!
మధ్యాహ్నపుటెండలో ఎవరికీ ఏ పనీ లేనప్పుడు
పండిన జొన్నపంట మాదిరిగా
మాలిమి వంతెన అనిపించడం.

కానీ వంతెన ఏంటి?
మనిషిని తన వైపు ఎందుకు లాక్కుంటుంది
ఈ వంతెన?
రాత్రి చివరి బండి
మాలిమి వంతెన మీద నడుస్తున్నప్పుడు
గాఢ నిద్రలో వున్న మా ఊరి జనం
ఎందుకు కదులుతున్నట్లు అనిపిస్తుంది?

ఒక సుదీర్ఘ వ్యాకులత తర్వాత
నేను చాలాసార్లు ఆలోచించాను
మాలిమి వంతెనలో మాలిమి ఎక్కడ?
అతని నావ ఎక్కడ?
ప్రతి వంతెనలో ఒక నావ దాగినట్లు
నువ్వు సరిగ్గా అలాగే వేలు ఉంచగలవా?


చేపలు తమ భాషలో వంతెన గురించి
ఏం మాట్లాడుకుంటాయి?
మొసలి ఏం ఆలోచిస్తుంది?
మధ్యాహ్నం తర్వాత ఇసుక తిన్నెపై
తమ వీపును పరచి
వంపును ఆరబెట్టుకుంటూన్న
తాబేళ్లకు ఎలా అనిపిస్తుంది ఈ వంతెన?

మా ఊరి ప్రజలకు ఇది ఎంత పెద్ద హామీయో
నాకు తెలుసు
ప్రతి ఒక్కరి బాల్యానికి ముందు
తూరుపు ఆకాశంలో అక్కడ
నిశ్శబ్దంగా మాలిమి వంతెన వేలాడింది

అక్కడ మాలిమి వంతెన లేదని
అకస్మాత్తుగా వాళ్లకు ఒకరోజు తెలిస్తే...
ఆలోచిస్తాను .. అలా ఆలోచించి కంపించిపోతాను

నన్ను నేను అడుగుతున్నాను
ఏది గొప్పది?
నది మీద నిలబడ్డ మాలిమి వంతెనా?
మనుషుల్లోపల వేలాడుతున్న అదా? ■

సందర్భం



# మన తెలుగు : నాడు - నేడు

- వెలమల సిమ్మన్న
94406 41617

ఏ భాషైనా ప్రజల సామూహిక అవసరాల కోసం మాత్రమే పుడుతుంది. మనజాతి జీవనాడులన్నీ జానపదుల్లో చక్కగా ఒదిగిపోయాయి. ఈ జానపద సాహిత్యం లిఖిత సాహిత్యం కంటే ముందే వుంది. జానపద సాహిత్యంలోని భాష నూటికి నూరుపాళ్ళు వ్యావహారిక భాష. అంటే మనిషి పుట్టినాదిగా మొట్టమొదటిగా మాటలాడిన భాష వ్యావహారికి భాష అన్నమాట. ఈ మాండలిక భాషే అసలు సిసలైన ప్రజల వాడుక భాష. సహజ సిద్ధమైన భాషకు మాండలికాలు ప్రథమ సోపానాలు. అదే నిజమైన తెలుగు భాష. అదే సజీవమైన తెలుగు భాష.

ప్రజల వాడుక భాషను అంటే వ్యవహారిక భాషను ప్రారంభం నుంచి పండితులు చిన్నచూపు చూశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆనాటి పండితులకు భాషా దృష్టి, భాషా అవగాహన, భాషానైపుణ్యాలు లేవు. అంచేత ప్రజల వాడుక భాషను గౌరవించలేకపోయారు. ఆ భాషా రుచిని ఆహ్వానించ లేకపోయారు. మీదు మిక్కిలి తిరస్కరించారు కూడా. సంస్కృతానికి పెద్దపీట వేశారు. భాష ప్రజలదే కాని పండితులది కాదు. ఈ విషయాన్ని పండితులు గుర్తించలేకపోయారు. సంస్కృత నాటకాల్లో పండితులు ఉన్నత పాత్రలకు 'సంస్కృతం', నీచ పాత్రలకు అప్పటి ప్రజల భాష అయిన 'ప్రాకృతం' వాడారు. ప్రాకృతాన్ని అనాగరిక భాషగా ముద్ర వేసి, అవమానించారు.

తరువాతి కాలంలో కూడా కోట్లాది ప్రజలు వాడుక భాషలో తెలుగులో మాట్లాడుతున్నా, జానపదుల్లో దేశీయ సాహిత్యం ఎంతగా అభివృద్ధి చెందినా, అది అంతా పండితుల దృష్టిలో అశాస్త్రీయం. సహజమైన ఆ పదజాలమంతా పండితుల దృష్టిలో చిల్లి గవ్వకు కూడా పనికిరాలేదు. వాళ్ళ దృష్టిలో సంస్కృత పదాలన్నీ శాస్త్రీయం. పరమ పవిత్రం కూడా. కాని ప్రజల భాషకు ఆ గౌరవం లేదు. దేశి పదాలను దేశీ సాహిత్యాన్ని గాసట బాసటగా భావించిన పండితులు ఆ పద సాహిత్యాన్ని, దేశి సాహిత్యాన్ని నామరూపాలు లేకుండా చేశారు.

భారతదేశంలో మొట్టమొదటి సారిగా బుద్ధుడు 'పాళీ' భాషలో బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేశాడు. 'పాళీ' భాష సంస్కృత భాషలో ఒక మాండలిక వ్యావహారిక భాష. బుద్ధుడు 2500 ఏళ్ల క్రితమే తన బోధనలను ఆనాటి ప్రజల వాడుక భాష అయిన పాళీ, ప్రాకృత, భాషల్లో సాగించాడు. 'భిక్షువు లారా! మీరు వెళ్ళిన ప్రాంతంలోని ప్రజల భాష ఏదైతే వుందో ఆ భాషలోనే నా ధర్మాన్ని ప్రబోధించండి. తమ తమ భాషల్లోనే ప్రజలు ధర్మాన్ని వినాలి. ప్రజల భాషే ధర్మ భాష. ప్రజల భాషే ప్రామాణిక భాష' అని బుద్ధుడు తన అనుచరులకు విడమర్చి చెప్పాడు. ఎప్పుడైతే ప్రజల వాడుక భాషలో అన్నీ సజావుగా జరుగుతాయో, అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. ప్రజలకు న్యాయం జరుగుతుంది. ఇదే విషయాన్ని బుద్ధుడు ఎన్నోసార్లు జనాలకు అర్థమయ్యే భాషలో చెప్పాడు. ప్రజలందరూ బుద్ధుడి బోధనలను ఆదరించారు. అటువంటి నాయకుడే ప్రజలకు కావాలి. బౌద్ధం భారతదేశం నుంచి కొన్ని కారణాల వల్ల దూరమైంది. క్రమక్రమంగా సంస్కృతానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు పెద్దలు. బుద్ధుడు మనిషిని ప్రేమించాడు. ప్రజల భాషను ప్రేమించాడు. అందుకే బుద్ధుడు ప్రజల అభిమానాన్ని పొందగలిగాడు. అందుకే గురజాడ 'ఈ దేశంలోంచి బౌద్ధమతం మటుమాయమై పోయినప్పుడే ఈ దేశం మతవిషయకంగా ఆత్మహత్య చేసుకుంది' అని నొక్కి వక్కాణించారు.

తెలుగు భాషకు సంబంధించినంతవరకు ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే 11వ శతాబ్దానికి ముందున్న భాషా సాహిత్యాలకు రాతలో సాక్ష్యం లభించకపోవడం. దీనినిబట్టి మనం పరిశోధనలో ఎంత వెనకబడి ఉన్నామో తేటతెల్ల మవుతుంది.

తెలుగు సాహిత్యంలో నన్నయకు ముందు ఎంతోమంది కవులు ఉన్నారు. కాబట్టి నన్నయ ఆదికవి కాదు. ఎన్నో పరిశోధనలు చేసి అసలు విషయాన్ని విమర్శకులు బయట పెట్టారు. నన్నయ తొలి తెలుగు అనువాద కవి మాత్రమే. ఆయన రాసిన 'మహాభారతం' స్వతంత్ర కావ్యం కాదు. వ్యాసుడు సంస్కృతంలో రాసిన భారతాన్ని నన్నయ స్వేచ్ఛగా అనువాదం చేశాడు. పాలకుల మెప్పు పొందాడు.

నన్నయ, నాటి ప్రజల భాషలో అంటే వాడుక భాషలో భారతాన్ని అనువదించలేదు. ప్రజల భాషలో రాయలేక పోవడానికి మనం కారణాలు ఊహించవొచ్చు. ఇప్పటి రోజుల్లో ఆంగ్లమే తప్ప తెలుగు వాడకపోవటానికి ఏ ప్రభావ వ్యామోహాలు కారణాలు అవుతున్నాయో, అవే ఆనాడూ ఆటంకం కలిగించాయి. నన్నయ తన గ్రంథంలో ఉపయోగించిన భాష ఎక్కువగా సంస్కృతం లేదా సంస్కృత సమాన తెలుగు భాష. సామాన్య జనాలకు, భారతం అర్థం కాదు. కేవలం పండితుల కోసమే భారతాన్ని నన్నయ అనువదించాడు. ఒక్క మాటలో చెప్పాలంటే నన్నయ భారతం తెలుగు లిపిలో వుంది కానీ, అచ్చమైన ప్రజల భాషలో లేదు. ఈ విషయాన్ని పరిశోధకులు, విమర్శకులు ఎప్పుడో తేల్చి చెప్పారు. ఆ కాలంలో సంస్కృత భాషలో కానీ లేదా సంస్కృత సమానమైన భాషలో రాసిన వారికే కవిగా గుర్తింపు ఉండేది. అలాంటి వారికే రాజాశ్రయాలు, సన్మానాలు, బిరుదులు, అగ్రహారాలు వగైరాలు లభించేవి. ఇలా ప్రజల భాష అయిన తెలుగుకు వేల సంవత్సరాల నుంచీ అన్యాయం జరుగుతోంది.

ఒక గొప్ప కావ్యం అనువదించడానికి సంబంధించినంత భాష, నన్నయకు లభ్యమైందంటే అంతకు ముందు ఎన్నో వందల సంవత్సరాల నుంచి ఆ భాష ఉండాలి కదా! ఈ విషయాల్ని చాలా లోతుగా పరిశోధించాలి. రాజ రాజ నరేంద్రుడు తన ఆస్థానంలో అప్పటికే గొప్ప రచనా విశారదులైన కవులు ఉన్నారని చెప్పుకున్నాడు. అంటే నన్నయకు ముందు కవులు ఉన్నారు. అయితే ఆ కవుల గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోయాయి. అందుబాటులో లేకుండా పోయాయి. నన్నయ రాసిన 'మహాభారతం' ఒక్కటే దొరికింది. అందుకే నన్నయే మొదటి అనువాద కవి అని విమర్శకులు అన్నారు. నన్నయను 'ఆదికవి' అంటే ఆయనకు కొన్ని వందల సంవత్సరాల ముందున్న కవుల చరిత్రకు మనం తెరవేసినవారం అవుతాం. సంస్కృతంలో అలంకార శాస్త్ర గ్రంథాలు 'గిలక' కలిగిన 50 మంది తెలుగు పండితులను నన్నయ ప్రస్తావించాడు. నన్నయ కాలంలో విద్యా గోష్ఠులు జరిగే పండిత సభలున్నాయి. ఆ సభల్లో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైనవారు ఎంతోమంది పాల్గొనేవారని నన్నయ చెప్పాడు. నన్నయ సంస్కృత కవులైన వాల్మీకిని, వ్యాసుడిని భారత రచనలో తలచుకున్నాడు. తెలుగు కవుల పేర్లను ప్రస్తావించలేదు. 'బహు భాషల బహు విధముల భారత కథను వినగలిగారని' మాత్రం నొక్కి వక్కాణించాడు. నన్నయకు పూర్వం, నన్నయ కాలంలోనూ తెలుగు కవులు లేరనీ, తెలుగు కవిత్వం లేదనీ, నన్నయతోనే తెలుగు కవిత్వం పుట్టిందని కొందరు పండితులు భావించారు. వాళ్ళ స్వార్థం కోసం, ప్రయోజనాల కోసం వారు కల్లబొల్లి కథలు చెప్పి జనాలను నమ్మించారు. నన్నయ కాలంలోని కవుల పేర్లను, వాళ్ళ కవిత్వాన్ని ఎవరికీ కనబడకుండా చేశారు.

12వ శతాబ్దంలో పాల్కురికి సోమనాథుడు సంస్కృత సంప్రదాయానికి ఎదురొడ్డి దేశీయ ఛందస్సులో 'అచ్చ తెలుగు' కావ్యాలు రాశాడు. వాడుక భాషకు ప్రజల్లో విలువ లేకపోవడాన్ని శివ కవులు ఎలుగెత్తి చాటారు. ప్రజల వాడుక భాష కోసం ప్రశ్నల వర్షం కురిపించారు. అచ్చంగా 'జాను తెలుగు'లో అద్భుతమైన ఎన్నో సాహిత్య ప్రక్రియల్ని సృష్టించారు. ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. తెలుగు సాహిత్య చరిత్రలో మొట్టమొదటి సారిగా ప్రజల భాషకు పట్టం కట్టిన కవులు శివకవులు. తమ భక్తి ఉద్యమాన్ని వాడుక భాషలో ప్రజల దగ్గరకు తీసుకెళ్ళిన ఘనత వారికే దక్కుతుంది.

పాల్కురికి సోమనాథుడు ప్రజలు పాటించే ధర్మాలు ప్రజల భాషలో లేకపోవడాన్ని చాలా తీవ్రంగా ఖండించాడు. ఆయన లేవనెత్తిన ప్రజా ప్రశ్నలకు వెయ్యేళ్ళయినా ఇప్పటికీ సమాధానం చెప్పలేక పోతున్నాం. అంటే ప్రజల వాడుక భాష విషయంలో మనం చాలా వెనకబడి ఉన్నామని అర్థం. సోమనాథుడు చేసిన వాడుక భాషోద్యమం అనేక కారణాల వల్ల కాలక్రమంలో నీరుకారిపోయింది. సాహిత్యమే భాష అనుకున్న మహాపండితులు ఎందరో ఉన్నారు. సాహిత్యం వేరు. భాష వేరు. రెండింటికీ తేడా వుందన్న విషయం కూడా వాళ్ళకు తెలియదు. ఇలాంటి పండితుల వల్లే వాడుక భాషకు తీరని అన్యాయం జరిగింది, జరుగుతోంది. ఇదే విషయాన్ని గిడుగు రామమూర్తి ఎన్నోసార్లు చెప్పారు.

13వ శతాబ్దంలో తిక్కన రాసిన భారతంలో తెలుగుదనం

కన్పిస్తుంది. అయితే తిక్కన కూడా పూర్తిగా వాడుక భాషలో భారతాన్ని అనువదించలేదు. 14వ శతాబ్దానికి చెందిన ఎర్రన, 15వ శతాబ్దానికి చెందిన శ్రీనాథుడు, పోతన రచనల్లో పండితుల భాష కన్పిస్తుంది. ఆ కాలంలోనే అన్నమయ్య ప్రజల భాషలో కీర్తనలు రాసి ప్రజలకు చేరువయ్యాడు. 16వ శతాబ్దంలో ప్రబంధ యుగంలో ముఖ్యంగా భాష విషయంలో పెద్దగా మార్పులు చోటు చేసుకోలేదు. శ్రీకృష్ణదేవరాయలు తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించాడు. తిక్కన ఎంత 'తెలుగు దనం' చూపించినా, రాయలు 'దేశభాషలందు తెలుగు లెస్స' అని ఎలుగెత్తి చాటినా, ప్రజల వాడుక భాషకు ఎక్కడా పట్టం కట్టలేకపోయారు. వాడుక భాషలో రచనలు ఎవ్వరూ చేయలేదు.

17వ శతాబ్దంలో వేమన ప్రజల వాడుక భాషలో ప్రజల మనిషిగా, మానవతా వాదిగా, బలంగా సామాజిక వస్తువును తీసుకొని అద్భుతమైన కవిత్వాన్ని సృష్టించాడు. ప్రజలకు దగ్గరయ్యాడు. అయితే, వేమన లాంటి ప్రజాకవిని అప్పటి పండితులు గుర్తించలేకపోయారు. 18 శతాబ్దంలో కూడా పండిత భాషే రాజ్యమేలింది. వీధి నాటకాలు, యక్షనాగాలు అంతగా సాహిత్య గౌరవం పొందలేదు. 19వ శతాబ్దం ప్రారంభంలో వ్యావహారిక భాషలో అక్కడక్కడ 'కాశీ రాజు పూర్వ దేశయాత్రలు' లాంటి రచనలు వచ్చాయి. చిన్నయసూరి ఎప్పుడైతే తెలుగు సాహిత్య రంగంలోకి ప్రవేశించాడో అప్పుడే మళ్లీ పండిత భాష విజృంభించింది. 'నీతి చంద్రిక' లాంటి గ్రంథాలతో గ్రాంథిక భాష వీర విహారం చేసింది. ఆ దెబ్బకు అక్కడక్కడ వున్న వాడుక భాషలో వున్న రచనలు పూర్తిగా కనుమరుగయ్యాయి. పాఠ్యపుస్తకాల్లో, గ్రంథరచనలో వాడుక భాషను ఉపయోగించకూడదనే పరిస్థితి వచ్చింది. ఇలా వేయి సంవత్సరాల్లో ఎప్పుడూ వ్యావహారిక భాష సాహిత్య భాషగా, కావ్య భాషగా స్థానం పొందలేదు.

సాహిత్యం సజీవంగా వుండాలంటే రచనా భాష ఆయా ప్రాంతాల స్వభావాలకు అనుగుణంగా వుండాలి. రచయిత సృష్టించిన పాత్రలు నిత్యమూ దైనందిన జీవితంలో మనకు తారసపడే విధంగా వుండాలి. కొన్ని సంవత్సరాల కిందట భాష వాడినా, తాతముత్తాతల నాటి భాష వాడినా, అది సహజం అన్పించుకోదు. సమాజంలో లేని పాత్రల్ని సృష్టించి రచనలు చేస్తే ఆ రచనలు సమాజానికి పనికిరావు. చాలా ఏళ్ల పాటు మన కవులు తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారే కాని ప్రజల భాషలో రచనలు చేయలేకపోయారు. వాళ్ళ దృష్టిలో పాఠకులంటే రాజాస్థానాల్లో బతుకుతున్న ఆ నలుగురు పండితులు మాత్రమే! అందుకే తెలుగు కవులు, కావాలని సంస్కృత నాటకాలను కూడా ప్రబంధీకరించారు. తెలుగులో సృజనాత్మకమైన నాటక సాహిత్యాన్ని సృష్టించలేకపోయారు. తమ రచనలు తమ కోసం, తమలాంటి వారి ఆనందం కోసం అనుకున్నారు కానీ జాతి మొత్తానికి అవి ఉపయోగపడాలనీ, విజ్ఞానాన్ని వినోదాన్ని అందరికీ కలుగజేయాలనీ అనుకోలేదు. ప్రజల అభిమానం వల్లే కవికి కీర్తి ప్రతిష్ఠలు వస్తాయని వారు గమనించలేకపోయారు.

ఆయా కాలాల్లో ఎక్కువమంది కవులకు డబ్బు, హోదా ప్రధానం. డబ్బు రాజు ఇస్తే ఆ రాజుకు అడుగులకు మడుగులు ఒత్తుతూ వారికి అనుగుణంగా నడుచుకున్నారు. ఆ కారణంగా కవులు రాజుకు బాగా దగ్గరయ్యారు. ప్రజలకు దూరమయ్యారు. కావ్యాల్లో విపరీతమైన వర్ణనలను, అలంకారాలను చొప్పించారు. ఫలితంగా సాహిత్యం నిర్వీర్యమైపోయింది. కవులు సమాజంలో చులకనయ్యారు. క్షీణ యుగంలో ఈ పరిస్థితి మరీ ఎక్కువైంది. వందల ఏళ్ళ నుంచి సామాన్య జనాలకు తెలుగు భాష కేవలం మాట్లాడుకోవడానికీ, విని ఆనందించడానికే తప్ప మరెందుకూ పనికి రాకుండా పోయింది. పాలకుల భాష వేరు, పాలితుల భాష వేరుగా రూపుదిద్దుకున్నాయి. దేశీయ పాలకులు ఆయా కాలాల్లో సంస్కృతాన్నో, ప్రాకృతాన్నో ఆశ్రయించారు. విదేశీ పాలకులు అరబిక్, ఇంగ్లీషు భాషల్ని పాలనా భాషలుగా వాడారు. తెలుగు ప్రాంతాల్ని పాలించిన పాలకులు ఎప్పుడూ తెలుగును నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఆ పరిస్థితే ఏదో ఒక రూపంలో ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ పరిణామం చాలా విచారించదగ్గది.

సంస్కృతం తెలుగు వారి సాహిత్య రూపంలో, మంత్ర తంత్రాల రూపంలో చొచ్చుకుపోయింది. చివరకు సంస్కృతం లేకపోతే తెలుగు భాషకు మనుగడ లేదనే స్థితికి వచ్చింది. సంస్కృతం నుండే తెలుగు పుట్టిందనే వాదన బలంగా బయలుదేరింది. పాశ్చాత్యుల పరిశోధనల వల్ల నిజాలు బయటపడ్డాయి. పండితుల వాదనకు తెరపడింది. సంస్కృతాధిపత్యాన్ని ఎదురించడం ఎన్నో ఏళ్ళ సంవత్సరాల నుంచి జరుగుతూనే వుంది. అచ్చ తెలుగు, జాను తెలుగు రచనలు ఎన్నో వచ్చాయి. తెలుగు భాష తన ఉనికిని తాను కాపాడుకుంది. ప్రజలకు చేరువైంది.


ఇలాంటి పరిస్థితుల్లో తెలుగు సాహిత్య రంగంలోకి అడుగుపెట్టారు 'నవయుగ వైతాళికుడు' కందుకూరి. తనదైన శైలిలో నిబద్ధతతో సామాజిక సేవ చేశారు. ప్రజలందరికీ అర్థమైన

**వాడుక భాషకు వేడుక**

**తెచ్చిన మహనీయులు**

**గిడుగు, గురజాడ**





విధంగా చెప్పడానికి ప్రయత్నించారు. కొంత వరకు విజయం సాధించారు. కందుకూరి ఎక్కువగా సాహితీ ప్రక్రియలను విస్తరించడంలో ముందుకు వెళ్ళారు. 19వ శతాబ్దం చివరలో ప్రజల వాడుక భాషకు సాహిత్య గౌరవం తెచ్చిన ఘనత 'యుగకర్త' గురజాడకు చెందుతుంది. ప్రజల భాషలో రచనలు చేసి, వాడుక భాషకు ఎనలేని కృషి చేశాడు. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఏ రచయితా చేయలేని ధైర్యం, సాహసం చేసిన వాడుక భాషా యోధుడు గురజాడ. చివరకు విజయం సాధించాడు. ప్రముఖుల మన్నలను పొందాడు. 20వ శతాబ్దంలో వాడుక భాషోద్యమానికి తన జీవితాన్ని త్యాగం చేసిన 'భాషా తపస్వి' గిడుగు రామమూర్తి. వాడుక భాషోద్యమ పితామహుడు ఆయన. వాడుక భాషలోనే ప్రజల వ్యవహారాలన్నీ జరగాలనేది గిడుగు వారి అభిప్రాయం. గురజాడ, గిడుగు ఇద్దరూ వాడుక భాష కోసం చేసిన కృషి అంతా ఇంతా కాదు. గిడుగు 'లక్షణం' అయితే, గురజాడ 'లక్ష్యం' అయ్యాడు.

నన్నయ మొదలు నేటి వరకు తెలుగు భాష క్రమ పరిణామ వికాసాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే మనకు ఒక విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది. ప్రజలు నిత్యమూ వ్యవహారంలో మాట్లాడుకొనే భాషకు భిన్నంగా తెలుగులో 'కావ్య భాష' ప్రారంభమైంది. క్రమ క్రమంగా ప్రజలు నిత్యమూ మాటలాడుతున్న 'వాడుక భాష' చోటుచేసుకుంది. భాష ఎప్పుడూ పరిణామం చెందుతుంది అనడానికి ఇది మంచి ఉదాహరణ.

**'గ్రాంథిక భాష పరిమిత ప్రయోజనము కలది.**
**వ్యావహారిక భాష అపరిమిత ప్రయోజనము కలది'**

**– గిడుగు రామమూర్తి**

■

# కవిత్వమే నినాదం

**- అవనిశ్రీ**

**99854 19424**

కవిత్వం రాయి
అరికాలికి ముల్లు నాటినంత
తలలో వెంట్రుక సుడి తిరిగినంత
నొప్పి బరాయింపుతో కవిత్వం రాయి
ప్రజల కవిత్వమే రాయి
లేదా అస్సలు రాయకు
ఊరినుంచి వెలివేసినవారికి
నీ కవిత్వం ఊపిరవ్వాలి
అట్టడుగు జాతుల చైతన్యానికి
నీ పదాలు పునాదులవ్వాలి



నీ కవిత్వం గొంతు మీద కాలుపెట్టి తొక్కిన
బాధితుడి వైపు నిలబడాలి
చేయని నేరానికి చెట్టుకు కట్టేసి ఈతబర్రెలతో కొట్టిన
అమాయకుడికి అండవ్వాలి
ఉద్యమంలో ముందు నడిచేటోడు
పిడికిలెత్తి పలికితే నీ కవిత్వమే నినాదమై కదం తొక్కాలి

వీరుడు ఉరికంబం ఎక్కే ముందు
చివరి సారి నీ పదాలే పలికేటంతటి గట్టిగ రాయి
ప్రజల కోసమే రాయి
ప్రజలే నీ కవిత్వాన్ని మోసే భుజాలని మరిచిపోకు
నోట్ల నాలుక లేని వారికి నీ కవిత్వం నాలుకవ్వాలి
నీ కవిత్వం
ఏ ప్రజల కోసమైతే రాసావో
అక్కడిదాకా పయనించి ఆ గుడిసె కొనలపై
పోరాట జెండాలెగరేయాలి!

పాలిపోయే కవిత్వం రాయకు
నలుగిట్లో తేలిపోయే వాక్యాల జోలికెళ్లకు
కవిత్వం
మనిషిని పదునెక్కించాలి
కవిత్వం
సమాజాన్ని పరిగెత్తించాలి
అలాంటిదే కవిత్వమని నమ్ము!

## కవిత

# గెలవడం ఒకకళ

- డా.కటుకోఝ్వల రమేష్
99490 83327



తెలివితేటలున్న ప్రతివాడూ
గెలుస్తూ పోడు
గెలవటం ఓ కళ
గెలిచే సామర్థ్యం నీకుండొచ్చు
గెలవలేక నిలుచున్న చోటే చతికిల పడొచ్చు
ఎందుకు గెలవలేదో
నీకు తెలియకనూ పోవొచ్చు
కొన్ని సందర్భాలు అంతే!

గెలిచిన ప్రతివాడూ
నీకంటె తెలివైనవాడు కాకపోవొచ్చు
మరెందుకు గెలిచాడో
నీకు అంతు చిక్కనూ పోవచ్చు
గెలుపు లౌక్యం ఒకటుంటుంది
అది నీ ఆలోచనల్ని అల్లుకుంటూ వస్తోంది
అదృష్టాలు దురదృష్టాలూ
అన్నీ ఒఠి మాటలే
గెలుపును గెలుచుకోలేనివి
దురదృష్ట మూసలోకి ఒలికిపోతాయి
కొన్ని అసంకల్పిత విజయాలు
అదృష్ట ఖాతాలోకి జారిపోతాయి
అయితే గెలుపు ఓ కళ అని
మన ఈగో వీడి ఒప్పుకోవాలి!


బలానికి అహం తోడైనప్పుడు
నిర్లక్ష్యం చాపకింద నీరై నిలుస్తుంది
విజయపు రేఖకు ఇవతల
నిన్ను పడుకోబెడుతుంది
బలహీనతకు పట్టుదల తోడైనప్పుడు
అంతర్గత శక్తులన్నీ ఐక్యమై
గెలుపు గుర్రం దౌడు తీస్తుంది
విజయ పతాకాన్ని వేగంగా మోసుకుంటూ ...

గెలుస్తున్నవాడు ఒక్కో మెట్టూ ఎక్కటానికి
ఎంత శక్తిని కూడగట్టుకుంటాడో
ఎంతపోరును ప్రోది చేసుకుంటాడో
గెలిచినవాడికే తెలుస్తుంది
వాడు గెలుపుకు వేసుకున్న మార్గం
మంచిదో కాదో కానీ
వాడు గెలవటం ఓ కళే
అయితే.. ఓడిన ప్రతిసారీ
ఓ కొత్తపాఠం నువ్వు నేర్చుకుంటావు
ప్రతి పాఠమూ ఓ కళై నిన్ను అల్లుకుంటుంది

ప్రతి గెలుపు కిందా
ఎన్నో వివరించలేని విప్పుకోలేని
బాధల మూలుగులుంటాయి
మొఖాలు చిరునవ్వును చిమ్మినా
గుండెకంటిన కన్నీటి తడి ఆరదు
అందుకే..
గెలుపు ఓ కళ అని ఒప్పుకోవాలి
గెలుపు మన చేయిజారినప్పుడు
వేలవేల నిట్టూర్పులు విడవొచ్చు
తప్పులేదు
ప్రయత్నపు ద్వారాలు మూయటమే తప్పు
ఏదో ఒకరోజు గెలుపు నిన్ను తడుతుంది

సామాన్యంగానో అసామాన్యంగానో
నిన్ను తూకం వేసే తరాజు
ఒకరోజు విస్తుపోనూ వచ్చు
గెలిచినవాణ్ని నఖశిఖం చూడు
ఏదో ఓ కళ వైఫైలా వాణ్ని చుట్టుకొని ఉంటుంది
నిన్ను నువ్వు గాఢంగా తట్టుకొని
ఓ గెలుపుకోసం తపించి చూడు
ఏదో ఓ శక్తి ఆయుధంలా
నిన్ను అంటిపెట్టుకుని ఉంటుంది
ఓ వైబ్రేషన్‌ను సృష్టించుకొని తనువెల్లా తరించు
ఓ కొత్త ఉత్సాహాన్ని నీలోకి స్వాగతించు
గెలుపు గాలులు నిన్ను తాకటం గమనిస్తావు
అయితే ...
నువ్వు ఓడిపోయినప్పుడే తెలుస్తోంది
గెలవటం ఓ కళ అని..! ■

## సమీక్ష






# నీడల మాటున కదిలే కవన దృశ్యాలు

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

**సా**ధనతో మూడో కంటిని మచ్చిక చేసుకున్న కవి ఏనుగు నరసింహారెడ్డి. అందుకే...

'మూడో కన్ను లోలోపల
తెరుచుకున్నప్పుడు
ఒక్క వాక్యమన్నా రాయకుంటే ఎట్లా' అంటారు.

అధ్యయనంతో వాక్యాల ఒడుపును గ్రహించిన నిత్య సత్యాన్వేషి ఆయన. కాబట్టే... 'తప్పించుకు తిరిగే తన్మయపుటూహను/ గండమోర్లు పెట్టించుకుంటే ఎట్లా' అనగలిగారు.

ఈ 'అదనపు కలెక్టరు' గారు ఇష్టంగా స్వీకరించిన అదనపు బాధ్యత– సాహిత్య సృజన. నిరంతరం తలమునకలయ్యే పనిలోంచే వస్తువుల్ని స్వీకరించి, వాటిని గాఢమైన అభివ్యక్తులతో అలంకరిస్తున్నారు. విధి నిర్వహణతో పాటు సాహిత్యాన్నీ సామాజిక బాధ్యతగా భావించి సారవంతమైన కవిత్వాన్ని పాఠక లోకానికి అందిస్తున్నారు. కవిత్వంతో పాటు విమర్శ, అనువాద రంగాల్లోనూ విలువైన కృషి చేస్తున్నారు. *హైదరాబాదు విషాదం, తెలుగు – హిందీ జాతీయోద్యమ గీతాలు* వంటి చారిత్రకాంశాలను పుస్తకాలకెక్కించారు. తెలంగాణ రుబాయిలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

ఏనుగు నరసింహారెడ్డి ఇటీవల ప్రచురించిన కవితాసంపుటి *'నీడల దృశ్యం'*. 48 కమనీయ కవితా దృశ్యాల సమాహారం ఈ సంపుటం. ప్రతి మూల మలుపులోనూ ఆయన ఆగి, వెనుదిరిగి చూస్తారు. నడిచివచ్చిన దారి ఆనవాళ్లు గ్రహిస్తారు. ఎగుడు దిగుళ్ల వెనక కారణాలను అన్వేషిస్తారు. దారంట ఎదురైన ప్రతి మనిషినీ స్కానింగ్ తీస్తారు. ఆ మనిషి జీవన మూలాల్లోకి తొంగి చూస్తారు.

తన చుట్టూ ఉండే మనుషులు, తన గమనంలోకి ప్రవేశించని మనుషులు, తనను తప్పించుకు తిరిగే మనుషులు... అందరినీ అధ్యయనం చేస్తారు. ఒళ్లంతా కళ్లు జేసుకుని సమాజాన్ని పరిశీలిస్తారు. కాబట్టే పేదవాడి ఆకలి, పల్లెజీవి నిస్పృహ, మట్టిమనిషి నిరాశ, మధ్యతరగతి అసహాయత... ఇవన్నీ ఆయన కవితా వస్తువులయ్యాయి. తల్లి, తండ్రి, బిడ్డ, దోస్తు, ఆధారం కోల్పోయిన మహిళ, తోటి అధికారి, అరాజకీయ నేతలు... వీళ్లంతా పాత్రధారులయ్యారు.

కవి పల్లెలో పుట్టి, పల్లెల్లో పని చేసిన అనుభవం కారణంగా అక్కడి ప్రాకృతిక వనరులన్నీ ఈ సంపుటిలో వివిధ దృశ్యాల రూపంలో మనకు సాక్షాత్కరిస్తాయి. నగరంలో విస్తరిస్తున్న కాంక్రీటు వనాలు పచ్చి గాయాల్లా దర్శనమిస్తాయి. 'దిష్టిబొమ్మ' నుంచి 'వర్చువల్ పెయింటింగ్' దాకా, 'దిగుడుబాయి' నుంచి 'న్యూ డొమైన్' దాకా వినూత్నాంశాలు పలకరిస్తాయి. కాలాను గుణంగా సంభవించిన, సంభవిస్తున్న పరిణామాలను పట్టు కోవటంలో కవి సునిశిత దృష్టి కనిపిస్తుంది.

నరసింహారెడ్డి కవిత్వంలో నినాదాలుండవు. వ్యాఖ్యానా లుండవు. అరిగిపోయిన వ్యక్తీకరణలుండవు. నలిగిపోయిన పద బంధాలుండవు. తెలంగాణ నుడికారాన్ని ధరించిన ప్రతి అక్షరమూ విలువైన వాక్యాల మాలలల్లుతుంది. ప్రతి కవితా సరళంగా, హాయిగా మొదలవుతుంది. అంతే హుందాగా ముందుకు నడుస్తుంది. అంతే! వేగంతో లోతుల్ని తడిమి చూస్తుంది. నిర్దిష్ట కొలమానాలతో ముందుకీ వెనక్కీ కదుల్తుంది. చివరికి మనలో ఆలోచనల్ను ముట్టించి, అది మాత్రం అమాయకంగా ముగుస్తుంది.

ఆర్ద్రత కురిపించే అక్షర చిత్రాలు
"అన్నిసార్లూ కష్టాలే/ మనల్ని కరగదీస్తాయని చెప్పలేం
దేవతలు గూడా సమయానుసారంగా
మనల్ని ఏడిపించగలుగుతారు"

పరమ రొటీన్ జీవన వలయంలో చక్కర్లు కొడుతున్న మనకు పై వాక్యాలు చిత్రంగానే అనిపిస్తాయి. కానీ, కవి అలా ఎందుకన్నారో తెలుసుకుంటే మన మనసులు ఆర్ద్రమవుతాయి. తల్లి, భార్య, పిల్లలు స్వయంగా లక్ష్మణ రేఖలు గీసుకుని తనకు భారం కాకూడదని తీర్మానించుకున్నారన్న విషయం అర్థమైనప్పుడు ఆ ఇంటిపెద్ద మనసు ఎలా ఆక్రోశిస్తుంది?

'ఊరికి దూరం కాటికి దగ్గర
నా వైద్యానికి అంత ఖర్చొద్దురా' అని
అమ్మ గోల పెట్టినప్పుడు/ మనం ఏ దిక్కున తలపెట్టి
గాంభీర్యాన్ని నటించాలి'.
'రోజూ కీచులాడే సగపుటావిడ
ఆసుపత్రి పడక మీద ఆలోచనల్లో పడి
'వంట అసలే రానివాడివి
హోటల్లోనైనా సరిగ్గా తిను' అన్నప్పుడు
ఉబికివచ్చే నీళ్లను కన్నీళ్లనే అంటారా'

ఆటబొమ్మలు కళ్లెదుటే ఊరిస్తున్నా 'ఇప్పుడొద్దులే నాన్నా' అని చిన్నపిల్ల సరిపెట్టుకున్నప్పుడు కళ్లల్లో జలపాతం పొంగదా! ఆడపిల్ల 'నాన్నా, మా ఇంటికెళ్తా'నన్నప్పుడు లోలోపల అంతరంగపు జల కరగదా! దేవతలు గూడా ఏడిపిస్తారనటానికి ఇంతకంటే నిదర్శనాలు అవసరమా? ఇలాంటి అపురూపమైన అంశాన్ని కవితగా అల్లి, దానికి 'దేవతలు గూడా' అనే శీర్షికతో పట్టం గట్టిన కవిని అభినందనలతో సత్కరించుకోవాల్సిందే.

వర్తమాన సమాజం అస్తవ్యస్తంగా తయారైంది. జనం నిబంధనలు పాటించరు. గీతల్ని గౌరవించరు. 'లెక్క లెక్క తీర్గ లేదు'. అంతా 'తొండి' జరుగుతోంది.

'లేగల్లేగలు కొట్లాడి/ దూడెల కాళ్లిరుగ్గొట్టినట్లు
రెండు గుంపుల నడుమ/ బక్కెడ్లు దస్కుతై
రోజూ మంత్రం ఒర్లే బదులు
అయ్యవార్ని కొనుక్కొనుడే మేలు' అంటూ వక్రరేఖల మిట్టపల్లాలను కవిత్వీకరించారు.

ఆమె... కనిపించని జ్వాల. పరిణత పాదచారి. రహస్య వేగు. మహా నేర్పరి. మహాతల్లి. 'ఇన్ని సుడిగుండాలను/ ఓటిపడవ మీద/ ఎట్లా ఈదుకొచ్చింది/ హైజాక్ చేయబడ్డ/ విమానంలాంటి బతుకుతో/ ఇంత సురక్షితంగా ఎట్లా లాండయింది/ ఇన్ని క్రూరమృగాల మధ్య తిరిగి/ కవచమేదీ లేకుండానే/ ఎలా బతికి బట్టకట్టిందో' శిల్పంలా చెక్కారు. ఆమె జీవన శిఖరాన్ని కళ్ల ముందు నిలిపారు. ఈ కవితకు 'గుడ్డికొంగ' అనే శీర్షిక పెట్టడంలో కవి నైపుణ్యం కనిపిస్తుంది.

'కాలానికీ/ వ్యాకరణముంటుంది' అంటూ కొండల నడుమ ప్రతిధ్వనించే పొలికేకలా ప్రారంభమవుతుంది 'లావా విలాపం'. నిజానికి కొండ మనిషికి కొండంత అండ. మనిషే ఆ అండను బాంబులు పెట్టి పేల్చేస్తున్నాడు. నేలమట్టం చేస్తున్నాడు. నగరాల్ని నలుమూలలా విస్తరించే కసరత్తులో భాగంగా గుట్టల్ని చదును చేస్తున్నాడు. 'శిలల జున్నుముక్కల్ని పేర్చుకొని/ కంకర పుట్నాల్ని నంజుకొని/ రాతిపొడి తూకాల్ని లేపుతున్న' బాధాకర దృశ్యాల్ని ఈ కవితలో కళ్లకు కట్టారు.

అత్యాధునిక చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చినా క్యాన్సర్ మహమ్మారి మనిషిని పీల్చి పిప్పి చేస్తూనే ఉంది. 'అది గుట్టుచప్పుడు కాకుండా/ గూట్లోకి వెళ్లి/ వెలుగుతున్న దీపాన్ని/ జ్వాలగా మండిస్తది'. 'పసిపిల్లల నడకలా దూరి/ కొరివిదయ్యంలా ఎగబడ్తది'. శస్త్రచికిత్స వంటి భయంకర వైద్యం తర్వాత కూడా ఆ కొరివిదయ్యం వదిలిపోదు. 'కీమో' రూపంలో పట్టి పీడిస్తుంది. అల్లోపతిపై అపనమ్మకంతో ఆయుర్వేదాన్నీ, హోమియోపతినీ, ఆక్యుపంక్చర్‌నీ మార్గాంతరంలో అన్వేషిస్తాం. ఆ స్థితి చిత్రంగా ఉంటుంది. 'నవ్వితే బతుకుతావని/ ఎవరో పెదవుల్ని/ సాగగుంజుతారు/ నడిస్తే నిలుస్తావని/ ఎముకలతో సర్కస్ ఆడిస్తారు' అంటూ ఆ దుర్భర అనుభవాలకు చిక్కటి కవిత్వంతో చికిత్స చేశారు. ఇంతాజేసి, ముగింపులో ఏమంటారో చూడండి...

'మహానదితో తూచమని
నీటిబొట్టు గేలి చేసినట్లు
అతని వేదనలో
మనది కేవలం సానుభూతి' (కొరివి దయ్యం).

**రూపశిల్పాలపై కవి కసరత్తు**

సంపుటానికి మకుటంగా నిలిచిన 'నీడల దృశ్యం' రూపశిల్పాల రీత్యా అద్భుతమైన కవిత. ఎన్నుకున్న అంశాన్ని డైరెక్టుగా ప్రస్తావించినప్పుడు, ఇక ఆ తర్వాత కవిత కుంటినడక నడుస్తుంది. రంగు, రుచి, వాసన కోల్పోతుంది. పాఠకుడికి ఆసక్తి సన్నగిల్లిపోతుంది. ఉదాహరణకు ఇటీవలి కాలంలో కరోనాపై వందల కవితలు వచ్చాయి. అసలా పేరు ప్రస్తావించకుండా, కేవలం వైరస్ విధ్వంసాన్ని మాత్రమే దృశ్యమానం చేస్తూ అతికొద్ది కవితలు మాత్రమే వెలువడ్డాయి. అన్యాపదేశ భావవ్యక్తీకరణలో గాఢత ఉంటుంది. 'నీడల దృశ్యం' కూడా అంతే. వర్ధమాన కవులకు ఓ పాఠంలాంటి కవిత. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన కవి తన గ్రామం కల్లోనికుంట వెళ్లిన ప్రతిసారీ తండ్రిని ఎలా దృశ్యమానం చేసుకుంటారన్నదే ఈ కవిత. చివరిదాకా ఎక్కడా తండ్రి అనే పదం ఉపయోగించరు. సహజ సౌందర్య ప్రతీకల్ని స్వీకరించి, కవితకు రక్తమాంసాలు ఎక్కించారు.

'నా గొడుగునెప్పుడో/ కాలం గాలి/ తిరగేసుకుపోయింది/

నా కవచకుండలాల నెవరో/ నాకు తెలియకుండానే/ దానం తీసుకున్నారు' అంటూ గొప్ప ఇమేజరీలతో మొదలవుతుంది కవిత. 'దుబ్బచెల్కల్లో దుమ్ము రేగుతున్నప్పుడు నాగలి నడక చాలు తప్పిన' విషయాన్ని పాఠకుడి మనసులో మెల్లగా ఇంకిపోయేలా కవితను ముందుకు తీసుకెళ్తారు. అక్కణ్నుంచి పిట్టలు, పిచ్చుకలు, రెక్కలు, గూళ్లు, రుతువులు, వెన్నెముకలు... ఈ కవితను తమ భుజాలపై మోస్తాయి.

నిరంతరం ఉద్యోగ బాధ్యతల్లో తలమునకలై ఉండే నరసింహారెడ్డి గారిని చాలామంది తరచూ అడిగే ప్రశ్నకు సమాధానంగా తనే ఓ కవిత రాసుకున్నారు. సభలకు, సాహిత్యానికి అంత సమయం ఎలా కేటాయిస్తారు, ఎందుకు వెచ్చిస్తారనే విషయాన్ని 'వాడిపోని పూల కోసం' అనే మంచి కవితగా మలిచారు. 'సాక్షాత్తూ మాతృభాషలో సరళ వ్యవహారపు సద్గ్రంథం చదువుతున్నా'నంటూ మరెందరికో మార్గదర్శక మయ్యేలా జవాబిచ్చారు. 'కొత్త కవుల అంతరంగపు చేదబావిలో/ మలినం కాని మంచినీళ్లను/ చేదుకుంటూ' తన అధ్యయన దాహాన్ని వెల్లడించారు. ఎందరో కొత్త కవుల్ని ప్రోత్సహిస్తూ, కవితా సంపుటాలకు ముందుమాటలు రాస్తూ తన సింప్లిసిటీని చాటుకుంటున్న ఈ కవి సీనియర్ కవులనూ అంతే గౌరవిస్తారు. 'లాటిన్ అమెరికా మీద/ అక్షరాల రెక్కల్తో ఎగిరి/ జనాకాంక్షల్నే మైనా/ దోచుకొని వచ్చాడా ఏం' (ఊట) అంటూ ప్రముఖ కవి శివారెడ్డిపై రాసిన పద్యమే అందుకు నిదర్శనం.

కాలం ఇప్పుడు కరాళనృత్యం చేస్తోంది. మనుషుల్ని రకరకాల వైరస్ గొలుసుల్తో బంధించి, గాలిబుడగ తత్వాన్ని గాలివాటుగా గానం చేస్తోంది. ప్రాణం గాల్లో దీపమై వేలాడుతోంది. ప్రకృతిలో లభించే ప్రాణవాయువు అమాంతం ఖరీదైన వస్తువుగా మారి పోయింది. ఈ పరిస్థితుల్లో మనం దేనికైనా ఎదుర్కోటానికి 'సంసిద్ధం'గా ఉండాలని చెబుతున్నారు కవి. 'ఇప్పుడు/ జీవించటమంటే మరేమీ కాదు/ రేపటి ప్రమాదానికి/ సంసిద్ధం కావటమే' అన్న కఠిన సత్యాన్ని మంత్రంలా పఠించారు.

'అంతర్వాహిని'లో 'అంతరాంతరాల్లో/ కప్పబడ్డ దు:ఖం/ గుక్కపడుతూ ఉంటది/ మెట్లు దిగలేని మేకప్పు వేసారెవరో/ కాకిలా ఉండనీక/ పావురం రంగు పూసారెవరో' అంటూ దాచేస్తే దాగని సత్యాల గురించి నర్మగర్భంగా చెప్పారు. వ్యక్తిత్వ వికాసానికి పాఠాలంటూ ప్రత్యేకంగా ఉండవు. ఆ బీజాలు సృజనాత్మక కళలన్నింటా నాటు వేయబడి ఉంటాయి. కవిత్వంలోనూ ఉంటాయి. 'లాంగ్ జంప్' అందుకు ఉదాహరణ. 'ఎంత ఈదినా/ ఇక్కడే ఉంటున్నావేమిటి' అంటూ మౌలిక ప్రశ్నతో కవితను ప్రారంభించి, ఆటంకాల మలుపుల్లో ఆగిపోకూడదని కవి తాత్వికంగా చెబుతారు. కొండ అడ్డం వచ్చినప్పుడు పడవ అక్కడక్కడే దాని చుట్టూ తిరుగుతుంది. అలా ప్రదక్షిణలతో కాలం వెళ్లబుచ్చకుండా లాంగ్‌జంప్‌తో అవతలి ఒడ్డుకు చేరుకోవాలన్న సార్వజనీన సత్యాన్ని ఆవిష్కరించారు.

కార్మికులు, కర్షకులు, కూలీలు, విధి వంచితుల పట్ల కవికి అపారమైన సానుభూతి. వారి జీవనచ్ఛాయల్లోని నలుపును వక్రీభవనం చెందించి, ఆ ప్రతిఫలనాలను తన కవిత్వంలో ఆవిష్కరిస్తారు. పేదరికం వెనక కారణాలు అన్వేషిస్తారు. వారందరికీ కాస్త చేయూతనందిస్తే సామాజిక చలనం మరింత చైతన్యవంత మవుతుందని ప్రతిపాదిస్తారు. నిర్మాణంలో ఉన్న భవనాల ముందు ఓ వ్యక్తి కాపలా ఉండటం మనం నిత్యం చూసే దృశ్యం. ఈ అంశాన్ని కవిత్వంగా మొలకెత్తించటం నరసింహారెడ్డి గారి ప్రత్యేకత. అతగాడు 'జానెడు పొట్టను భుజాలు కందేలా/ మోసుకొచ్చి ఉంటడు' అని ఆయన మాత్రమే గుర్తించగలిగిన మౌలిక రహస్యం.

'దేశమంతా స్వచ్ఛభారతం జపిస్తుంటే
అతడు మసక చీకట్లోనే
మలిన రహితుడు కావడానికి
సగం నిద్రను సమాధి చేసి' (దిష్టిబొమ్మ) కమ్మల్లేకుండా వాసాల్లేకుండా ఎనుగ్రు లేకుండా ఒక స్వచ్ఛసౌధాన్ని నిర్మించే విశ్వకర్మ అతడు... అని ఈ కవి మాత్రమే ప్రకటించగలడు. భవన నిర్మాణం పూర్తయ్యాక, అతడు గుడిసెను తొలగించే దృశ్యాన్ని తడితడిగా మన గుండెలకు తగిలిస్తారు.

**తడబాటు లేని ఆగ్రహం**

సామాజికాంశాల్ని, మానవీయ స్పందనల్ని ఎంత గంభీరంగా కవిత్వంలో ఆవిష్కరిస్తారో అవసరమైన చోట అంతే ఆగ్రహం ప్రదర్శిస్తారు. తప్పును ఖండించటంలో తడబాటు స్వరం వినిపించదు. లోపాన్ని వివరించటంలో లోగొంతుక ఉ ండదు. నిక్కచ్చిగా, నిర్మొహ మాటంగా అక్షరాలను మండించి వదుల్తారు.

కులం కావచ్చు, మతం కావచ్చు, మరొక కరుడుగట్టిన నమ్మకం కావచ్చు. అది ఏదైనా మత్తుతో సమానం. అలాంటి 'ఒకే మత్తు' మందును మనసుల్నిండా దట్టించి, నిశ్శబ్ద విధ్వంసానికి లాకులెత్తే వాళ్లను ఏకిపారేస్తారు. 'సరయూ నదికి/ గోడ కట్టాలని/ వాళ్లు కాంక్రీటు నూరుతారు!' అంటూ మత్తు వెనక కుట్రలు వివరిస్తారు.

'నాది నా ఊరేనా అని వాళ్ల ప్రశ్న
నా ఊపిరిలో మత్తు ఉందా లేదా అని విచారణ
నా మూలాలనెలా చిత్రించి చూపను

నా డిఎన్ఏ నెలా/ వాళ్ల డాటాలోకి ఎంటర్ చేయను
నా మట్టిగింజనెలా నెత్తికెత్తుకోను' అంటూ బాధితుడి స్వరంలో భాస్వరం నింపుతారు.

తనో ప్రభుత్వాధికారిగా ఉన్నత హోదాలో ఉన్నప్పటికీ సామాన్యుడిని ఇక్కట్ల పాలు చేస్తున్న రాజకీయాంశాలను ఎత్తి చూపటంలో ఏమాత్రం తొట్రుపాటు కనిపించదు. అది అధికారుల నిర్లక్ష్యమైనా, ప్రభుత్వం తాలూకు తప్పిదమైనా నిర్ద్వంద్వంగా ఖండిస్తారు. కళ్లెదుటి అద్భుత లోకాలను గాలికొదిలి, గాలిమేడల్లో స్వర్గాల్ని వెతుక్కునే 'వెర్రి'ని వెక్కిరిస్తారు.

ఓ తహసిల్దారు జైలు మృతికి కదిలిపోయి రాసిన కవిత 'బోయడు కుట్టిన వల'లో ఈ విషయం స్పష్టమవుతుంది. మరో తహసిల్దార్ ఆత్మహత్య చేసుకున్నప్పుడు రాసిన 'ఇల్లు చేరేదెట్లా'లోనూ ఆ సానుభూతి కనిపిస్తుంది. బాల సాహితీవేత్త పెండెం జగదీశ్వర్ బలవన్మరణానికి చలించిపోతూ 'చిలక కొట్టిన/ జాంపండంతటి పిట్టకథల అందగాడా/ నువ్వు దోస్తులకు కూడా చెప్పని కథలు/ ఇప్పుడు కనిపెట్టాలె' (దోస్తులకు చెప్పని కథలు) అంటూ అక్షర నివాళి అర్పించారు.

ఈ సంపుటిలోని ప్రతి కవితలోనూ ఎన్నో వాక్య నిర్మాణాలు మనల్ని కట్టపడేస్తాయి.

"ఈది తీరాల్సిన వాడివి
ఈదకుండా మునిగిపోవడం ముమ్మాటికీ తప్పే" (పగటి రాత్రి)

"నిజమైన ఆకలేసిన వాళ్లకు/ ఈ నగరమొక అన్నపూర్ణ
అందుకే ఇక్కడికి వచ్చినవాళ్లెవరూ/ మళ్లీ వెనక్కి వెళ్లరు" (ఇక్కడికొస్తే)

"లేళ్లు పులులు కావాలని/ రాళ్లు నిప్పురవ్వలై లేవాలని
నలుపు నగిషీలకు/ శ్వేతవర్ణం వెలవెలబోవాలని
ఆయన ఆఖరి శ్వాస అసలైన తర్జుమా" (యూ మస్ట్ బ్రీత్ మై డియర్)

సృజనశీలి అయిన కవి తన పదసంపదను తనే సృష్టించు కుంటాడు. వాడీవాడీ అరిగిపోయిన పదాలకు దూరం జరిగి, భిన్నార్థ పదబంధాలకు రూపకల్పన చేస్తాడు. సహజ పరిమళాలు వెదజల్లే పాతపదాల్ని వెలికితీసి, కొత్తగా పరిచయం చేస్తారు. సగపుటావిడ, కటారు, మున్నూటరవై, వస్త్రగాలం, అధిరోహ ణాహ్లాదం, ఇయ్యరమయ్యర, పొసంగం, ఊహాదర్పణం, సోల్బూతు, యంత్రాంతరం, శీకటం, ఊరీకలు, గండమోర్లు... వంటి పదాలెన్నో ఈ సంపుటిని కాంతిమంతం చేశాయి. బ్రహ్మం డిజైన్ చేసిన ముఖపత్రం నీడల దృశ్యపు లోతుల్ని అర్థవంతంగా ప్రతిఫలించింది. సంపుటి మొత్తం చదివాక, ఈ కవిత్వం గురించి ఏనుగు నరసింహారెడ్డి మాటల్లోనే చెప్పాలంటే..

"మనసుల్ని మెలిపెట్టగలిగే
మృదువైన కావ్యమొకటి రాయగలిగితే
భూగోళంలో కొంతభాగం
జయించినట్లే ఉంటది".

నిజమే. ఏనుగు నరసింహారెడ్డి (8978869183) గారు భూగోళంలో చాలా భాగం జయించారు.

■

## సాహిత్య ప్రస్థానం

## పాఠకులకు గమనిక

**సాహిత్య ప్రస్థానం పోస్టల్ కాపీలు అందడంలో సమస్యలు తలెత్తుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. పత్రిక కొన్నిసార్లు అసలు అందడం లేదని, మరికొన్నిసార్లు ఆలస్యంగా అందుతుందని కొంతమంది పాఠకులు ఫోన్లు చేస్తున్నారు. మేము కొత్త చిరునామాలోకి మారిన తరువాత ఈ సమస్య ఎక్కువైనట్టు అర్థమవుతుంది. మీకు పత్రిక సకాలంలో అదేవిధంగా రాష్ట్ర కేంద్రం నుంచి మేము అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాం. మీరు కూడా మీ స్థానిక తపాలా కార్యాలయంలో ఏదైనా పంపిణీ సమస్య ఉందేమో వాకబు చేయండి. సాధారణంగా ప్రతి నెలా 2వ తేదీన పత్రికను పోస్టు చేస్తాం. మొదటి లేదా రెండో వారంలో పత్రిక మీ ఇంటికి అందాలి. అలా అందని పక్షం రెండోవారం చివరలో 94900 99057 మొబైల్ నెంబరుకు ఫోను చేయండి. అడ్రసు మెసేజీ చేయండి. మరొక కాపీని పంపిస్తాం.**

**ప్రస్థానం పత్రిక నిరంతరంగా, నిత్యనూతనంగా వెలువడటానికి మీవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అవసరం. ఎప్పటివలె మీ తోడ్పాటు కొనసాగిస్తారని ఆశిస్తున్నాం. – ప్రధాన సంపాదకుడు**

## కవితలు

## కళావతి

ఆమె సమక్షంలో నేనున్నప్పుడు
దేహమంతా మల్లె తీగలు అల్లుకునేవి
ఆమె సమీపంలో తిరుగుతున్నప్పుడు
శరీరమంతా సుగంధ పవనం తాకుతుండేది
ఆమె సంతోషంలో పాలుపంచుకున్నప్పుడు
మనస్సంతా ఉషోదయపు కాంతులు పరుచుకునేవి!

ఆమెనే చూస్తూ ఆమెతో మాట్లాడుతూ
ఆమే నా ప్రపంచమౌతూ
నేను – తేనెపువ్వు మీద వాలిన
తుమ్మెదనయ్యే వాణ్ణి!




ఆమె మందలించినప్పుడు
ఎంత బాగుంటుంది! ఎంత కళ!
ఆ కంఠ స్వరంలో ఎన్నెన్ని పిల్లనగ్రోవులు
ఆ కళ్లలో ఎన్నెన్ని శరత్కాలపు చంద్రికలు
కోపంలోనూ ఆమె పెదవుల కదలికలో
ఎన్నెన్ని తురాయి పూలు రాలి
నా తలమీద పడుతుండేవి!

ఆమె తన చేతులతో
ప్రతి రోజూ తూర్పు దీపాన్ని వెలిగిస్తుంది
ఇంటి ముంగిట్లో రంగు ముగ్గుల పండగౌతుంది
పూల కుండీల్లో
రకరకాల పచ్చదనం పెంచుకుంటుంది
ఆమె అందమంతా ఆమె పనిలో కనిపిస్తుంది
నక్షత్రం లాంటి ఆమె
నా జీవితంలోకి ప్రవేశించి
నన్నొక ఉపగ్రహంగా మార్చింది
ఆమె అసలు పేరు లత
ఆమెకి పెట్టుకున్న ముద్దుపేరు లలిత కళ!

**- రవి నన్నపనేని**
**91821 81390**

## పరుసవేది

అతడు
అక్షరాలను చదువుకుంటూ
పుస్తకాల మధ్యన ఒదిగాడు!
అభద్రత, ఆరుబయట నిలబడి
నిద్రలేని రాత్రులను బహూకరిస్తుంటే
ఎడారిలో ఒంటెలా నడవలేక అతడు
మంచులో తడిసిన గువ్వపిల్లలా
పుస్తకాల మధ్యలో ఒదిగాడు!



పుస్తకాలకు
మనుషులంటే ఎంత ప్రేమో!
కులాన్ని అడగలేదు
మతాన్ని తడమలేదు
జాతి భేదం చూపనూలేదు
అతన్ని ప్రేమ నుంచి త్యాగం వరకు
ఎక్కడ కావాలంటే అక్కడ కూర్చోమని
ఆహ్వానాన్నీ కవితతో అందించాయి!

పాతాన్ని ఒక పండులా అందించి
భయాన్ని ఎలా బంధించాలో
ధైర్యాన్ని గుండెలో ఎలా దాచాలో
సహాయానికి చేతులు ఎలా వికసిస్తాయో
వర్ణమయమై నాట్యం చేశాయి!

నలిగిపోయిన పేజీల మధ్యన
కవులు రచయితలు రుజుమార్గానికి
నడకలు నేర్పారు
అక్షరాలన్నీ చీకటిలో ప్రయాణించి
చరిత్రను మట్టి కుండలో అందించాయి!

గడిచిన కాలం చైత్రమాసమైంది
కొత్త భావాలతో పుస్తకాలు చిగుళ్లు వేశాయి!
భవిష్యత్తును ఇంద్రధనస్సుతో చుట్టి
వర్షపు నీటి మధ్యన అతడు ఇంటికి చేరాడు!

**- మూని వెంకటాచలపతి**
**73966 08221**

కవిత



# తన మాటను గెలిపిస్తూనే ఉంది!

- చందలూరి నారాయణ రావు
97044 37247

సృష్టిని
చిటికిన వ్రేలు పట్టుకుని
నడిపించే కాలం
సృష్టిలో ఓ అద్భుతాకృతి మనిషికి
కోట్ల సంవత్సరాలు నడిచినా
తీరని కోరిక
దొరకని జవాబు  కాలం చిరునామా!
ప్రశ్న రుచి మరిగిన మనిషి
తత్వం, శాస్త్రం, యోగం, జ్ఞానం, తపస్సు
పరిశోధన, ప్రయోగం, పరిశీలనలతో
ఎత్తిన రూపాలెన్నో..!

ఎంతో లోతుగా తవ్వుతూ
ఎంతో ఎత్తును గురి చూసాడు
ఎంతో బరువును మోస్తూ
ఎంతో తేలికగా మారాడు

ఎన్నో ప్రశ్నలను పుట్టించి
ఎన్నిటికో జవాబులు కనిపెట్టారు
ఎన్నిటికో జవాబుగా మారి
ఎన్ని ప్రశ్నలను చంపేశాడు

సముద్రానికి భయపడుతూనే
మార్గాన్ని కనిపెట్టాడు
ఆకాశాన్ని అమాయకంగా చూసినవాడే
అంతరిక్షానికి ఎగబాకాడు
చిన్న రాయితో మాట్లాడడం నేర్చుకుని
పర్వతాన్ని లొంగదీసుకున్నాడు
భూమిని ఆలోచిస్తూనే
మరో భూమిని ప్రేమిస్తున్నాడు!

తరం తరం నిరంతరం
మానవ మేధస్సు
ప్రశ్నతో హద్దులు చెరిపి
ప్రాణం ఎరగా వేసైనా సరే
రహస్యం వైపు విజయం నేర్చుకుంది

కాలం చుట్టూ తిరుగుతూ
కాల మహిమకు గురవుతూ
కాల పరీక్షలు ఎన్నో రాసి
కాల ప్రశ్నను ఢీ కొంటూ
కాలాన్ని శత్రువుగా పోరాడుతూ
మిత్రుడుగా అభిమానిస్తూ
బంధువుగా ప్రేమిస్తూ..
దైవంగా ఆరాధిస్తూ
భూతంగా భయపడుతూ
రహస్యంగా పరిశోధిస్తూ
విచిత్రంగా విస్తుపోతూ
తన అడుగును  వినిపిస్తూనే ఉంది
తన మాటను గెలిపిస్తూనే ఉంది! ■



# పుల్లేటిపల్లి

- యక్కలూరిశ్రీరాములు
99856 88922

**అమ్మ ఏమి చెప్పినా కథగా చెప్పేది.**

**ఎలా అంటే... ఇలా....**

**రా**మసామి గుడి ముందున్న అరుగుల మీద కూచుని ఒక్కొక్కరు ఒక్కో సలహాను గాల్లోకి విసిరేస్తున్నారే గానీ ఏ సలహాను ఎవరూ అంగీకరించే స్థితిలో ఏమాత్రం లేరు. ఆ పల్లె ముప్పై నలభై ఇళ్ళ కంటే పెద్దదేమీ కాదు. అరవై ఆరేళ్ళ క్రితం బస్సు జాడ లేదు సరికదా! మనిషి జాడ... బండిజాడ కూడా అంతంతమాత్రమే!

పురిటి నొప్పులతో విలవిల్లాడుతున్న రమణమ్మని పుల్లేటిపల్లి నుంచి నాగసముద్రం మీదుగా ధర్మవరం రోడ్డు వరకు ఎలా చేర్చాలన్నదే, ఆ పల్లె జనాలందరికి ముప్పిరి గొన్న సమస్య.

ఎవరి ఆలోచనా సరిపోక ఆచరణకి సరితూగడంలేదు. ఎన్ని ఎత్తులు వేసినా పరిష్కారానికి సరైన పొత్తు కుదరడంలేదు. చివరికి బాలయ్య ఆలోచనే ఆచరణ దిశగా రూపు దిద్దుకోవ డానికి అవకాశమిచ్చింది.

ఎందుకంటే ...

దుమ్ము లేపుకుంటూ అప్పుడే అందరి నడుమ ఆ పల్లె లోని రెడ్డి ఇంటికొచ్చిన నల్లని కారు తెల్లని ఆలోచన రేపింది. ఆలస్యం చేయకుండా... వెంటనే రెడ్డోరింటికెళ్లాడు బాలయ్య, అనుసరించింది తన మేనత్త గురమ్మత్త.

గుర్రం వీపు తీడుతూ.... అలికిడికి తలెత్తి చూసి

"ఏం బాలయ్యా... ఏమిటి... పనొదిలేసొచ్చినట్టున్నావ్" అడిగాడు నంజిరెడ్డి.

"రెడ్డి... నా పెళ్ళాం పురిటినొప్పులు పడుతోంది. కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని, కాన్పు కావడం చాలా కష్టమని మంతరసాని తులసమ్మక్క చెప్పింది. అందుకని మీ దగ్గరకొస్తి" బాలయ్య.

"అవునా... అయ్యయ్యో..." నంజిరెడ్డి.

"అవునయ్యా... పెళ్లయిన ఇరవై ఏళ్లకి ల్యాక ల్యాక కడుప్పండింది" గురమ్మత్త.

"అవును రెడ్డి... ఇప్పుడు అసలు విషయం ఏమిటంటే.. ధర్మవరం ధర్మాసుపత్రికి తీసకపోతే గానీ పురుడుపోసుకునేది కష్టమని చెప్పింది మంతరసాని తులసమ్మక్క" బాలయ్య.

"అవునా! మల్లెట్లా సెయ్యాలప్పా... ఎద్దుల బండయితే శానా లేటైతాదే" దీర్ఘాలోచనలో పడ్డాడు నంజిరెడ్డి.

"అందుకే... నాకోలాచన తట్టింది రెడ్డి" బాలయ్య.

"అయ్యో... నీ.... తొందరగా సెప్పప్పా" నంజిరెడ్డి.

"ఏమనుకోకపోతే...." బాలయ్య.

"సూడు బాలయ్యా... నీ మాటతీరు, మంచితనం నాకు శానా ఇట్టం. నువ్వేంజెప్పినా కాదన్ను... యాలంటే అంతో ఇంతో ఈ ఊళ్ళో సదువుకున్నోనివి... అచ్చరం ముక్క తెలిసినోనివి నువ్వే... నీ తరహానే వేర్లేప్పా! అది నచ్చే నీతోనే నేనెప్పుడూ మాటాడతానని తెల్సుగదా! బిరీన సెప్పప్పా..." నంజిరెడ్డి

"మీ ఇంటికి కార్లో సుట్టాలొచ్చినారని తెల్సి.." బాలయ్య.

"అవ్... మా బామ్మనార్ది పొద్దుటూరు నుంచి వచ్చి నాడులే.... మల్లయితే" నంజిరెడ్డి.

"ఏం ల్యా... ఆ కార్లో ధర్మవరానికి నా పెళ్ళాన్ని తీస్కబోతే... బిడ్డను కంటుంది... తను బతుకుతుంది..."

గుండెలోంచి గొంతులోకి పొర్లుకొస్తున్న దగ్ధ ప్రకంపనాల స్వరంతో కళ్ళ వెనకాలే కన్నీళ్లు నిలుపుకుని బాలయ్య..

"అద్దిర కద... బాలయ్యంటే! ఈ ఊళ్ళో ఎవరికి రాని ఆలోసన్లు నీకొత్తాయంటే... ఎందనుకున్నావ్... ఇదేనప్పా! ఎహె... బంగారంగా తీస్కెల్లు... కార్దేముంది భాగ్యం" తెల్లగా నవ్వుతూ చెప్పాడు నల్లని నంజిరెడ్డి. ఆ మాటతో అప్పటిదాకా బాధతో బాలయ్య, గురమ్మత్త కళ్ళలో దాక్కున్న కన్నీళ్లు ఆనందంతో పెల్లుబికి చెంపల మీదికి చిప్పిల్లాయ్.

"రే... బామ్మమర్ది... ఆ కారుడ్రైవర్ని రమ్మను" కేకేశాడు నంజిరెడ్డి.

"ఏం బావా..." ఇంట్లోంచి బయటికొస్తూ బామ్మర్ది.

"ఏం ల్యా... మన బాలయ్య భార్యకి పురిటి నొప్పులస్తాండా యంట... బిడ్డ కడుపులో అడ్డం తిరిగిందట. అర్జెంట్‌గా ధర్మారానికి దీసుకెళ్ళాలి అందుకని... కారు గావాల..." నంజిరెడ్డి.

"అవునా! సరే! బావా... గోపాలా... గోపాలా" డ్రైవర్ గోపాలకి కేకేశాడు నంజిరెడ్డి బామ్మర్ది.

"అయ్యా" అన్నం తిని కడుక్కున్న చేతులు తువ్వాలుతో తుడుచు కుంటూ వచ్చాడు గోపాల్. గోపాల్‌కి విషయం త్వరగా చెప్పి ధర్మవరం బయలు దేరమన్నాడు నంజిరెడ్డి బామ్మర్ది. చెప్పిందే తడవుగా కారుని స్టార్ట్ చేశాడు గోపాల్.

గోపాల్ పక్క సీట్లో బాలయ్య, వెనకాల సీట్లో గురమ్మత్త...

కారు రయ్యిన నంజిరెడ్డి ఇంటినుంచి రామసామి గుడి ముందుకు రాగానే... గుడి అరుగుల మీద కూచున్నోళ్లంతా లేచి నిలబడి ముందు సీట్లో కూచున్న బాలయ్యని చూసి ఏమేం అర్థం గాక ఒగరి మొగం ఒగరు చూసుకోసాగారు.

గుడినుంచి ఇరవై అడుగుల దూరానున్న బాలయ్య గుడిసె ముందు కారు ఆగింది.

నలుగురు అమ్మలక్కలు రమణమ్మని చేతుల్తో ఎత్తుకుని బిరబిరా కార్లో ఎనక సీట్లోకి చేర్చడం, రమణమ్మ పక్కన గురమ్మత్త, కారు ముందుసీట్లో బాలయ్య... కూర్చోవడం వెంటనే జరిగిపోయింది.

నాలుగడుగులేసిందో లేదో...

కారు టక్కున ఆగింది,

కారణం...

మంతరసాని తులసమ్మ కారుకెదురుగా నిలబడింది.

"అన్నా... బాలయ్యన్నా... నాగసముద్రం దాకా రాళ్లు గుంతలతో ఎగుడు దిగుడుగా దారేం బాగాలేదు... కుదుపులెక్కువైతే కడుపులో బిడ్డకి, రమణమ్మొదినకి ఇద్దరికీ శానా కట్టం... ఎట్లా తీస్కపోతారో... ఏమో! ఏం సెప్పాలో... నాకు పాలుపోవడంల్యా... ఆ ఇసయం సెప్పేదానికొత్తి" దీనంగా మొగం పెట్టి చెప్పింది మంతరసాని తులసమ్మ.

కాన్పు చేసేవారిని మంత్రసాని అని పేరెట్టడం అద్భుతమని పిస్తుంది. ప్రతి చిన్నపల్లెలోనూ మంత్రసానులు ఆనాడు ఉ ండేవారు. డాక్టర్లు నర్సులు లేని ప్రతి పల్లెలో పురిటినొప్పుల నుంచి పుట్టే బిడ్డకి బొడ్డుకోసే వరకు అన్నీ తామై చూసుకునేవారు.

"ఏం చేద్దాం" అన్నట్టు డ్రైవర్ గోపాల్ వైపు చూశాడు బాలయ్య.

ఆలోచన చేస్తున్నాడే గాని ఏం చెయ్యాలో గోపాల్‌కి అర్థమవడం లేదు.

ఎవరూ ఏమీ మాటాడుకోవడాల్లేవ్...

రెండూ నిముషాలు గడిచినయ్...

అంతలో... బాలయ్య మేనమామ లింగమయ్య కారు దగ్గర కొచ్చి "బాలా.... నాకో ఆలోశనొచ్చిందిలేగానీ... సెప్తా ఇను... నేను మిద్ది కట్టడానికి ఇటిక పెల్లలు దెచ్చి రాసిపోసినాను గదా! ఆ ఇటికల్ని దారంటా పరుసుకుంటూపోతూ... ఆ ఇటిక పెల్లలు మీద కారుని నడిపించుకుంటూపోతే సరిపోతుంది గదా! ఏమంటావ్" అంటూ చెబుతూ బాలయ్య గోపాల్ల వంక మార్చి మార్చి చూస్తున్నాడు లింగమయ్య

పల్లెలోళ్ళకి తెలివి తక్కువంటారే గానీ... ఆ పల్లె నుంచి వచ్చే పాడిపంటలనుంచే పట్నం ఎదిగిందనీ, ఇప్పటికీ ఎదుగు తోందనీ చాలామంది ఆ ఆలోచనే చేయరు. చరిత్ర మొత్తం పల్లె జీవులు రాసిందేనని గమనించరు. పల్లెల వేర్లు లేకుంటే పట్నం, నగరాలు, మహానగరాలు వృక్షాలయ్యేవా...!

నేటికీ పల్లె మెతుకు తినిపిస్తేనే కదా! పట్నంకి బతుకు!

బాలయ్య రమణమ్మలను కన్నకొడుకు కూతుర్ల కంటే ఎక్కువగానే మేనమామ లింగమయ్య, మేనత్త చిన్నాగమ్మ చూసుకుంటున్నారని చెప్పాలి.

కారణం ...

కడప జిల్లా తాళ్ళ పొద్దుటూరు దగ్గరున్న దత్తాపురం నుంచి బాలయ్య, జమ్మలమడుగు నుంచి రమణమ్మ అనంతపురం జిల్లా పుల్లేటిపల్లికి కట్టుబట్టలతో వచ్చిన వీళ్లిద్దర్నీ కడుపులో పెట్టుకుని దాచుకున్నారని, దత్తాపురం జమ్మలమడుగు ప్రొద్దుటూరులో ఉన్నోళ్లెవరికీ వీరెక్కడున్నారనే విషయాన్ని గుంభనంగా దాచిపెట్ట ఉండడంతోనే వీళ్లిద్దరు ప్రాణాలతో ఉన్నారనే విషయం ఐదారుగురు కంటే ఎక్కువమందికి తెలియదు.

సరే! అదేమిటన్నది కొంచెం ఊహిస్తే ఎవరికైనా ప్రేమ కతనేది అర్థమవుతుందని తెలిసిందే!

లింగమయ్య ఆలోచనకి గోపాల్‌కి నోటమాట రాక అవునని తల మాత్రమే ఊపాడు.

ఇంకేముంది...!

క్షణాల్లో... పల్లెలోని మగాళ్ళ, పిలగాళ్ల చేతుల్లో ఇటుకలు చేరుకున్నాయ్. దారి పొడుగునా పేర్చుకుంటుపోతున్న ఇటుకల రహదారిపై కారు సునాయాసంగా కుదుపులు లేకుండా మెల్లగా కదలసాగింది. కారు కదిలిపోతుంటే కారు వెనకాల ఇటుక

పెల్లల్ని మళ్ళీ ముందుకు తెచ్చి కారు ముందు దారిగా పేర్చడం ఎలావుందంటే ఉత్సవ విగ్రహాల్ని ఊరేగించేప్పుడు తడిపిన చీరల్ని పంచల్ని పరుస్తున్నట్టు తలపింపచేస్తోంది ఆ దృశ్యం.

పల్లె ప్రజలు శారీరక, మానసిక శాస్త్రవేత్తలు గాక మరేమి టని తలపుకు తెస్తోంది ఆ సందర్భం.

పులేటిపల్లె నుంచి మొదలైన పురిటినొప్పుల ఊరేగింపు నాగసముద్రం ముందున్న ధర్మవరం తారు రోడ్డుదాకా కారు తేరులా కదిలింది. పండుగ సంబరమై కనిపించింది. కడుపులో వున్న బిడ్డని, బిడ్డ తల్లిని ప్రాణాలతో ఒడ్డుకి చేర్చి గడ్డనేయాలనే 'బిగ్రు'పల్లెలోని వాళ్లందరి కళ్ళలో, మెదిలే చూపుల్లో, కదిలే కాళ్ళల్లో, ఇటుకలు పేరుస్తున్న చేతుల్లో ఆగుపించింది.

నాగ సముద్రం ముందున్న ధర్మవరం రోడ్డుకి నల్లేరు మీద నడకలా కొలనునీటిలో తెప్పోత్సవంలా కుదుపులు లేకుండా కారును చేర్చారు. కారు ధర్మవరం వైపు వేగంగా పరుగులు తీసింది. కారు వెనక పల్లె ప్రజల పెదాలపై నవ్వులు.. ఆ మండుటెండలోనూ మల్లెపువ్వులై విరగ్గాసినయ్! పల్లె ప్రజలంతా పుల్లేటిపల్లికి వెనుదిరుగుతున్న దృశ్యం తృప్తితో నిండిన వేయి పండుగల సాయంకాలాల్ని గుర్తుకుతెస్తున్నాయ్...

¤ ¤ ¤

కారు ధర్మవరం చేరింది.

ఆసుపత్రి కాంపౌండ్‌లో ఆగింది.

బాలయ్య పరుగెత్తు కెళ్ళి నర్సమ్మని పిలుచుకొచ్చాడు.

కారు దగ్గర కొచ్చి రమణమ్మ స్థితి గమనించి డాక్టర్‌ని పిలుచుకొచ్చింది నరసమ్మ.

రమణమ్మ పరిస్థితికి ఏం చేయాలో నరసమ్మకి డాక్టర్ చెప్పగానే, స్ట్రెచర్ మీద రమణమ్మని ఆపరేషన్ గదికి ఆగ మేఘాల మీద చేర్చడం జరిగిపోయింది. పురిటినొప్పుల్తో తల్లడిల్లి పోతున్న రమణమ్మ ఆపరేషన్ గదిలోని బెంచీ మీదున్న కత్తుల్ని కత్తెరల్ని చూసి భయంతో వణికిపోయింది.

"ఏం గాదులేమ్మా... రవ్వంతసేపులో అయిపోతుంది. నేనున్నాను కదా!" అంటూ రమణమ్మ కడుపుమీద చేయివేసి అటుఇటు మెల్లిగా తడిమి తల నిమిరి మత్తింజక్షన్ ఇచ్చింది నరసమ్మ.

డాక్టర్ వస్తున్న అలికిడి... బిడ్డ అడ్డంగా తిరిగిందన్న నరసమ్మ మాటలు మత్తులో కెలుతున్న రమణమ్మకి లీలగా వినిపిస్తూ గాలిలో తేలి పోతున్నాయ్.

ఆపరేషన్ చేసి, ఆపరేషన్ గదిలోంచి కాన్పుల గదిలోకి రమణమ్మని శిశువుతో సహా చేర్చడానికి చాలా సమయం పట్టింది. బాలయ్య ముఖంలో సంతోషం, గురమ్మత్తలోని ఆనందం శిశువు చుట్టూ తాండవం చేశాయి.

ఓ గంట గడిచింది. రమణమ్మ కనురెప్పలు మెల్లిగా తెరుచు కున్నాయ్... క్యార్ క్యార్ మంటున్న శిశువు వైపు చూపులు తొంగిచూశాయ్.

పక్కనే వున్న ఇనుప ఉయ్యాలలో ఒళ్ళంతా బ్లేడుతో జివిరినట్టు కత్తులతో చెక్కినట్టు రక్తమోడుతూ నెత్తిటి ముద్దగా ఎర్రగా వున్న బిడ్డ క్యార్ క్యార్... మంటూ రక్తపుగాట్లతో విలవిలలాడుతూ విలపిస్తున్న ఓ జీవి. ఆనందంతో కళ్ళలో విచ్చిన మధురమైన దృశ్యం ఓ వైపు... బిడ్డ నెత్తిరోడుతున్న బాధ మరోవైపు... కమ్ముకొచ్చి దు:ఖంతో పెదాలు వణుకుతూ... రెప్పకి రెప్పకి నడుమ చీకటి వెలుగుల చర్యతో మూతబడుతున్న రమణమ్మ కళ్ళు...

శిశువుకు కావలసిన సబ్బు, నూనె తీసుకురావడానికి ఆసుపత్రి బయటికి బాలయ్య వెళ్ళాడు. కాన్పుల వార్డులో నర్సమ్మ, గురమ్మత్త ఒకరిద్దరు మినహా ఎవరూ లేరు.

ఇంతలో... హటాత్తుగా...

పుట్టగోసి మినహా వంటిపై ఏ ఆచ్ఛాదనా లేని వ్యక్తి పిచ్చోడో... వెర్రోడో... తిక్కోడో... బిగ్గరగా అరుచుకుంటూ పరిగెత్తికుంటూ రావడంతో ఆసుపత్రి ఆవరణలోని వాళ్లంతా దిక్కులకోరు పరుగులెత్తారు. ఆ వచ్చిన వ్యక్తి రావడం రావడం కాన్పుల వార్డులోకి దూరడంతో అంతవరకూ అక్కడేవున్న నరసమ్మ ... "డాక్టర్... డాక్టర్... తిక్క నారాయణ స్వామి వచ్చినాడు" అని అరుచుకుంటూ డాక్టర్‌తో చెప్పడానికి వెళ్లడంతో గదిలో వున్న గురమ్మత్తకి ఏం చేయాలో బోధపడలేదు. గదిలో వున్న మరొకామె ఓ మంచం కిందకి దూరి బిక్కు బిక్కు మంటూ చూస్తూ వణికిపోసాగింది.

ఈ గందరగోళం మాటలకి నిస్సత్తువతో వున్న రమణమ్మ కనురెప్పల్ని పూర్తిగా తెరవలేక చూపుల్ని బయటికి పంపలేక కళ్ళని బరువుగా మోస్తోంది.

తిక్క నారాయణస్వామి వచ్చినోడు వచ్చినట్టు బిగ్గరగా అరుచుకుంటూ గంతులేసుకుంటూ రావడం రావడంతోనే ఊయల్లో వున్న రమణమ్మ బిడ్డ నెత్తురు ముద్దగా ఉన్న పసికందును చేతుల్లో కెత్తుకుని గాల్లోకి ఎగురవేస్తూ నవ్వుతుంటే.... పారిపోయి దూరంగా నిలుచున్నవాళ్లంతా భయంతో నోటమాట రాక ఏం చేయాలో తోచక... వణికిపోతూ చూస్తూ నిలుచున్నారు.

"అయ్యో! పసికందును కింద పడేస్తాడేమో" అంటూ అరిచింది గురమ్మత్త.

"బిడ్డను నేలకేసి మోదుతాడేమో ఆ పిచ్చోడు" దూరంనుంచి ఓ గొంతు... ఇవేవీ పట్టించుకోక గాల్లోకి బిడ్డని విసిరేస్తూ... అరుస్తూ... విశాలమైన తన కళ్ళతో తదేకంగా బిడ్డని చూస్తూ

తెల్లని పళ్లతో మెరుపులా నవ్వుతూ ... కత్తుల గాయాలతో ఒళ్ళంతా నెత్తిరోడుతున్న పసికందును అటూ ఇటూ తిప్పుతూ... చుట్టూవున్న అందరినీ చూస్తూ గంభీరంగా మారిపోయాడు తిక్క నారాయణస్వామి. గుర్... గుర్ మనే శబ్దం గొంతులోంచి వస్తుండగా ఒక్కసారిగా మరీ బిగ్గరగా అరిచాడు. నోరు తెరిచాడు. బిడ్డను పళ్లతో కొరుకు తాడేమో... అందరిలోనూ సందేహ ప్రశ్నలు!

అంతే! పసికందుపై ఉన్న రక్తాన్నంతా చీకుతూ జుర్రుకో సాగాడు. తన నోటి లాలాజలం గంగాజలమై పసిగుడ్డు పైనున్న నెత్తుటినంతా నాలుకతోనే కడిగేసాడు.

పావుగంట గడిచింది. పసిబిడ్డ బంగారుగడ్డగా మినమినా మెరుస్తున్నాడు, తిక్క నారాయనస్వామి నల్లని చేతుల్లో!

అరగంట వరకూ తను ఆ బిడ్డతో తన నవ్వులతో తానే ఆడుకుంటూ పూలదండలా బిడ్డను ఎత్తి పట్టుకుని ఊయల్లో మెల్లిగా పడుకోబెట్టి... బిడ్డ తల నిమిరి నవ్వుకుంటూ గది బయటికివచ్చి ఆకాశం వైపు చూసుకుంటూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ చినుకులు రాలుతుండగా ఆసుపత్రి బయటికి వెళ్ళిపోయాడు.

ఆసుపత్రి అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుంది.

డాక్టర్, నర్సమ్మ వచ్చి బిడ్డను చూశారు

“మేము చేయాల్సిన పని తను పూర్తి చేసి వెళ్ళాడు” అనుకుంటూ డాక్టర్ వెళ్ళిపోయాడు.

“తలతో గాక కాళ్ళతో బయటికొచ్చే బిడ్డను ఎంత జాగ్రత్తగా తీసినా... గాట్లు పడక తప్పలేదు. ఎంతగా తుడిచినా నెత్తురు రావడం మానలేదు... కష్టకాన్పు కదమ్మా” అంటూ గురమ్మత్తతో చెబుతూ తను తెచ్చిన దూదితో బిడ్డ ఒళ్ళంతా మళ్ళీ తుడవ సాగింది నర్సమ్మ.

అప్పుడప్పుడే కళ్ళు పూర్తిగా తెరుస్తున్న రమణమ్మని చూసి అప్పుడే వచ్చిన బాలయ్య ముఖంలో ఆనందం తొంగిచూసింది. అంతవరకూ అక్కడ జరిగిన విషయాన్ని గురమ్మత్త చెబుతున్నప్పుడు బాలయ్య కళ్ళు పెద్దవి చేసి వింటూ సంతోషం తొణికిసలాడే చూపుల్తో బిడ్డను చూస్తుంటే... “పుల్లేటిపల్లి పులిరా! వీడు” అంటోంది ఎప్పుడూ ఎక్కువగా మాటాడని గురమ్మత్త.

**ఇంతకూ.... ఆ రమణమ్మ ఎవరో కాదు!**
**మా అమ్మ.**
**ఆ బాలయ్య మరెవరో కాదు!**
**మా నాన్న.**
**ఆ పసి గుడ్డు ఇంకెవరో కాదు...**
**నేనే ...**

■

# అల్లుకునే ఆలోచనలు

- బి.గోవర్ధనరావు
94419 68930

**మూ**డు ముల్లుల పరుగులాటలో
సమయం సరిగమలుగా కదులుతున్నపుడు –
అంతులేని ఆలోచనలు గాలిపటల్లా ఎగురుతూ ..
గాలిమేడల్లో ఊగుతుంటాయి!

అందరాని కోరికలను కొని తెచ్చుకుని
లేనిపోని తలపులను.. తగిలించుకొని
ఒత్తిడనే సాలిగూటికి చిక్కి చిత్తయిపోతుంటాయి!
అంతులేని అయోమయంలో.. పడుతుంటాయి!
కానరాని లోయల్లోకి దిగుతుంటాయి!
ఎగరలేని రెక్కలుగా విచ్చుకోని రేకులుగా
దేన్నో ఊహించుకొని నీళ్ళు నములుతూ
చేతులు ముడుచుకుంటాయి!

కాస్త కాలం.. చిక్కేసరికి
వెలిసిపోయే రంగుల్ని అద్దుకొని
ఆరిపోయే హంగుల్ని తొడుక్కొని
అంతరాల ఆవరణంలో
పచార్లు చేస్తూ వన్నెచిన్నెల మెట్లెక్కుతుంటాయి.!

అందొచ్చిన అవకాశాల్ని ఆనందించే సదాశయాల్ని
అక్కున చేర్చుకోలేవు ఆప్యాయంగా అల్లుకోలేవు
కావాలనుకుంటే.. వద్దంటాయి!
వద్దనుకుంటే.. కావాలంటాయి!!

గెలుపు పిలుపు దూరమవుతున్నపుడు
భావదాస్యపు సంకెళ్ళు వెనక్కి లాగుతున్నపుడు
కుదురుగా లేకుండా
కుచించుకుపోయే మనిషి తనంలో..
మనసు లేకుండా
మరుగున పడే.. మానవత్వంలో
సరితూగే ఆలోచనలే పదునెక్కుతాయి
గమ్యానికి గురిపెట్టే లక్ష్యాలవుతాయి
సమతావాదమై.. కదులుతాయి!
స్వేచ్ఛా భావనలై ఎగురుతాయి!

■

**కవిత**

# వాళ్లే లేకపోతే ... ?

- అనిల్ డ్యాని
97033 36688

**ప**ంట పొలాన్ని చంపేసి కట్టుకున్న మండపం
ఊపిరాడనితనం మధ్యలో ఉక్కపోత జనం
ఎంతమంది వస్తే అంత ఎక్కువ పరువు

ఏసీ గదుల అద్దాల మీద చెక్కిన
మెరుపుల వెనక
నల్లటి నగిషీల్లో కనబడని నీడలు
అంతా తెచ్చి పెట్టుకున్న హుందాతనం
అరువుకు తెచ్చుకున్న కుర్చీలు
శుభ్రమైన టేబుళ్ల ముందు
సెంటు పూసి మరీ పంచుకున్న
పెళ్లికార్డులన్నీ కొలువుదీరుతాయి

కడగని ఆకుల పక్కన
ప్లాస్టిక్ నీళ్ల సీసాలు
ఉప్పుతో సహా ఇరవై ఆరు రకాలు
విస్తట్లో విస్తరించిన పదార్థాల్లో
చెయ్యారా మెతుకుల్ని
ముద్ద చేయలేనంత ఇరుకు
ఎలా ఉన్నాయి... భోజనాలు...?
వృథా చేయడం మన జన్మహక్కు

తినడం ఎంత ముఖ్యమో
తిన్నవి ఎత్తేయడమూ అంతే
అందుకోసం కొందరుంటారు
వాళ్ళు పల్లెనుంచి వలసొచ్చిన వాళ్ళు
నడుమొంచి నాట్లేసే వేళల్లో
గొంతు ఒడిసెల నుంచి
పాటల్ని విసిరిన విలుకాళ్ళు
దేహాన్ని నారుమడి చేసి
దేశాన్ని పోషించిన అన్నదాతలు
నోటికాడ చేనుముద్దను
రాజ్యం లాగేసుకున్న అనాథలు
మన అహాన్ని శుభ్రం చేయడానికి



మసిగుడ్డలు పట్టుకున్న మనుషులు
బంతికి బంతికి మధ్యన
అరుపులు కేకలతో కట్టడి
చేయబడుతుంటారు

ఇంట్లో సైతం తిన్న పళ్లెం తీయడం
నామోషైన మనుషుల సమూహంలో
వాళ్ళు ఆకు చినగకుండా కళాత్మకంగా
బల్లమీద కాగితాలు మడత పెడతారు
బంధువుల ఉనికే సహించలేని మనం
పక్కవాడి ఎంగిలి మెతుకునెలా
అంటుకోగలం
అందుకే వాళ్ళు కావాలి..!
ఆ కడజాతి మనుషులు కావాలి
తినడానికి కాదు,
తిన్నవి ఎత్తేయడానికి...!

బంతికి బంతికి గౌరవాన్ని నిలిపేవాళ్ళు
వృథాగా పోతున్న వాటిని చూసి

సగం ఆకలిని చంపుకునే వాళ్ళు
చిట్ట చివరిగా మిగిలిపోయిన వాటిని
మూటగట్టుకునే వాళ్ళు
ఒక్క రూపాయి అదనంగా అడిగితే
అప్పటిదాకా తిన్న నోళ్లే
చికాకు పడతాయి
వాళ్లకెందుకు అదనంగా ఇవ్వాలి
వాళ్ళ సొమ్ము దోచుకున్నందుకు
ముందు వరస వాళ్ళని
ఆఖరి వాళ్ళని చేసినందుకు
వాళ్లెప్పుడో పండించిన దాన్ని మనం
పారబోసినందుకు ...

ఆకులెత్తే వాళ్లే లేకపోతే
మీ మీ వేడుకల్లో అందంగా
అమర్చుకున్న ఆనందమంతా
అత్తర్లో పడ్డ ఈగలాగ
కంపు కొడుతుంది!

■

**సమీక్ష**






# ఆలోచనల మూలాల్ని స్పర్శించిన 'అయిదో గోడ' కథలు


**- కె.వి.కృష్ణ**
79813 05779


'ప్రజలను డిస్టర్బ్ చేయడం నాకు ఇష్టం. ఎందుకంటే అలా చేయడం ద్వారా మాత్రమే నేను వారిని ఆలోచించేలా చేయగలను. వారు శతాబ్దాలుగా ఆలోచించడం మానేశారు. ఏ ఒక్కరూ డిస్టర్బ్ చేయడం లేదు. వారిని ఓదారుస్తున్నారు. నేను ఎవరినీ ఓదార్చడం లేదు. ఎందుకంటే మీరు వారిని ఎంతగా ఓదార్చితే అంతగా తిప్పికొడతారు. వారిని కలవర పరచండి. దిగ్భ్రాంతి పర్చండి. వారిని గట్టిగా 'కొట్టండి'. వారికి సవాలు ఇవ్వండి. ఆ సవాలు వారి సామర్థ్యాలను క్లైమాక్స్‌కు తీసుకువస్తుంది..' ఓ భారతీయ తత్వవేత్త చేసిన ఈ వ్యాఖ్యల్లోని ప్రాసంగికత పలు సందర్భాల్లో గుర్తుకొస్తుంటుంది. కల్పనా రెంటాల 'అయిదో గోడ' కథల సంకలనం చదువుతుంటే కూడా ఈ ఫీలింగ్ కలిగింది. తను సంచలనం కోసమో, ఏదో షాక్‌కు గురిచేయడం కోసమో రాయకపోయినా.. సమాజం ఆమోదించ లేని వాస్తవాలను వ్యక్తం చేస్తున్నపుడు ఇదో షాక్ ట్రీట్‌మెంట్ లా పని చేస్తుంది.

ఇక్కడ డిస్టర్బ్ చేయడమంటే.. స్త్రీల వేదనలకు, సంఘర్షణలకు కారణమైన పితృస్వామ్య భావజాలం పునాదుల్లో ప్రకంపనలు సృష్టించే ప్రయత్నాలు చేయడం. ఈ భావజాలం నిర్దేశించిన పరిధులు, పరిమితులను బద్దలు కొట్టడం. రచయిత్రి కల్పన బహుముఖ కోణాల్లో ఎంతో నిజాయితీగా, నిర్భయంగా ఈ ప్రయత్నం చేశారు. వైవిధ్యమైన అంశాలను స్పృశించారు.

ఏ రచయిత స్పందనలైనా నేపథ్యం (కులం, మతం, ప్రాంతం, కుటుంబం, చదివిన పుస్తకాలు, స్నేహాల) పరిధిలోనే వ్యక్తమవుతాయి. ఇండియన్ నేపథ్యం లేదా అమెరికన్ లేదా యురోపియన్ నేపథ్యం ఏదైనా కావొచ్చు. రచయిత తీసుకున్న అంశాలు సార్వజనీనమైనా.. వ్యక్తీకరణ ఆ పరిమితుల్లోనే ఉంటుంది. భావప్రసారం కూడా పరిమిత స్థాయిలోనే ఉంటుంది. అస్తిత్వవాద రచనలే కాదు, ఏ రచనలూ ఇందుకు మినహాయింపు కాదు. రచనలపై సమీక్షలు కూడా ఈ పరిమితుల్లోనే ఉంటాయి. ఒకరి అనుభూతులను మరొకరు వ్యక్తం చేయలేరు. అందువల్లే తమదైన అనుభూతులను, అనుభావాలను వ్యక్తీకరిస్తున్న అస్తిత్వ వాదం ప్రభావం ఎంతో తీవ్రంగా ఉంటుంది. సమాజాన్ని, సహానుభూతిపరులను ఎంతగానో మేలు కొలుపుతుంది. 'అయిదో గోడ' కుడా ఇదే అనుభూతిని కలిగించింది.

ఈ సంకలనంలో మొత్తం 15 కథలున్నాయి. వేటికవే ప్రత్యేకమైనవి. ప్రధానంగా మనుషులు విలువల చట్రంలో బందీ అయి తమను తాము ఎలా కోల్పోతున్నారో, ఆ చట్రాలను ఎలా బద్దలు కొట్టాలో చెప్పే ప్రయత్నం ప్రతి కథలో కనిపిస్తుంది. పెళ్లి, ప్రేమ, సహజీవనంలో చివరకు సమిధలయ్యేది స్త్రీలే. శారీరక ధర్మాలే కాదు, సమాజం నిర్దేశిస్తున్న విలువలు స్త్రీల వేదనలకు, సంఘర్షణకు ప్రధాన కారణమని 'ఎండమావులు', 'కోట్ హాంగర్' కథలు చెబుతాయి. 'ఎండమావులు'లో.. ప్రేమించిన వాడు మోసం చేస్తే అబార్షన్ చేయించుకోలేక, ఒంటరిగా బతకలేక దివ్య ఆత్మహత్య చేసుకుంటుంది. 'కోట్ హాంగర్'లో ప్రీతి పరిస్థితీ ఇదే. పుట్టబోయే బిడ్డను చంపుకోలేక ఎంతో వేదనతో గర్భ విచ్ఛిత్తికి పాల్పడుతుంది. అదీ, తనకు తెలిసిన నాటువైద్యంతో. అది వికటించడంతో అమెరికా చట్టాల ప్రకారం అరెస్టయి జైలుపాలవుతుంది. ప్రీతి వేదన హృదయాలను కదిలిస్తుంది. ఈ కథలో అపర్ణ పాత్ర ప్రత్యేకమైంది. ప్రీతి గురించి పేపర్‌లో చదివిన అపర్ణ సహానుభూతి చెందుతుంది. జైల్లో ఉన్న ప్రీతిని కలిసి 'నీ గురించి ఆలోచించే ఒక ఫ్రెండ్ ఉందని మరిచిపోకు' అని భరోసా ఇస్తుంది. పాఠకుల మనసులను సునిశితం చేసే గొప్ప పాత్ర అపర్ణది.

టైటిల్ కథ 'అయిదో గోడ'కు నేను బాగా కనెక్ట్ అయ్యాను. సమాజంలో భర్త చనిపోతే భార్య విషయంలో జరిగే తంతు ఎంతో అసహ్యకరంగా, జుగుప్సాకరంగా ఉంటుంది. కాలం

## పురస్కారాలు

### సాహిత్య ప్రస్థానం నవంబరు 2021 పురస్కారాలు

**మా ఊరు - పావురాళ్లు**
*కవితకు రూ.500*
కవి: **మహమూద్**

**భద్రత**
*కథకు రూ.500*
రచయిత: **నల్లపాటి సురేంద్ర**

■■■

***కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం***

***కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి***

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

***- ఎడిటర్***

చెల్లిన విశ్వాసాలుగా భావిస్తున్నప్పటికీ నేటి ఆధునిక సమాజంలో కూడా 90 శాతం మంది ఈ వికృత చర్యలను భిన్న రూపాల్లో కొనసాగిస్తున్నారు. ఎన్ని రూపాల్లో పోరాటాలు చేస్తున్నా అంతు లేని ఈ వివక్ష, అసమానతలు యధాతథంగానే సాగుతున్నాయి. సంప్రదాయం, సంస్కృతి పేరుతో ఈ చర్యలకు పవిత్రతను ఆపాదిస్తున్నారు. ఈ అసహజమైన, అమానుషమైన వార సత్వానికి పునాదులు కుటుంబ వ్యవస్థలో ఎంత బలంగా ఉన్నాయో, స్త్రీలు ఎలా బలి పశువులవుతున్నారో చర్చిస్తుంది 'అయిదో గోడ'. తల్లి, కూతురుతో పాటు రచయిత్రికి, రచయిత్రి భర్తకు మధ్య సంభాషణ తార్కికంగా, హేతుబద్ధంగా ఉంటుంది. కథలో చెప్పదలుచుకున్న మౌలిక భావనలకు ఈ నేపథ్యం ప్రధానమైంది. రచయిత్రి తన దృక్పథానికి ప్రతిబింబంగా శారద పాత్రను అద్భుతంగా మలిచారు. భర్త చనిపోయిన నెలరోజులకే మళ్లీ పెళ్లికి సిద్ధపడటమే కాకుండా వరుడి కోసం శారద పేపర్లో ప్రకటన ఇవ్వడంపై అప్పుడే అమెరికా నుంచి వచ్చిన కూతురు ఆర్తి భగ్గుమనడంతో కథ ప్రారంభమవుతుంది. అమెరికా నుంచి వచ్చేటప్పుడు అమ్మ నీరసంతో చిక్కిపోయి ఉంటుందని, మానసికంగా చాలా డిప్రెస్ అయి ఉంటుందని, ఇల్లంతా చిందర వందరగా ఉంటుందని ... అనుకుంటుంది ఆర్తి. అమ్మకు ధైర్యం చెప్పి అమెరికా తీసుకెళదామనుకుంటుంది. కానీ ఇక్కడ ఆ ఛాయలు ఏమీ కనిపించవు. అటు సమాజం, ఇటు కుటుంబం ఆమోదించలేని అమ్మ ప్రవర్తన ఆర్తికి ఏమాత్రం మింగుడు పడదు. శారద ఎంతో హుందాగానే ఉన్నా ఆర్తికి తల్లి పట్ల వ్యతిరేకభావం కలుగుతుంది. అయితే, చివరకు ఆర్తి మనసు మారుతుంది. తల్లి మరొకరితో జీవితం పంచుకోడానికి ఆర్తి మనస్ఫూర్తిగా అంగీకరిస్తుంది. కథను నడిపించిన తీరు చాలా బావుంది.

నేనూహించని రెండు మలుపులు 'అయిదో గోడ' కథతో నేను కనెక్ట్ కావడానికి ప్రధాన కారణం... శారద పేపర్ ప్రకటన చదివిన తర్వాత ఈ రచయిత్రి కూడా సమాజం నిర్దేశించిన విలువల పరిధిని బ్రేక్ చేయలేకపోయారే, మూస పాత్రనే సృష్టించారే అనిపించింది. కథ చివరిలో నాకనిపించిన భావననే శారద కూడా రచయిత్రి వద్ద వ్యక్తం చేయడంతో చాలా థ్రిల్ ఫీలయ్యాను. ఇక రెండో మలుపు.. శారద తన పెళ్లి గురించి కూతురు ఆర్తితో చెప్పిన మాటలు నేనూహించనివి. రవీంద్రనాథ్ ఠాగూర్ కవిత్వాన్ని ఈ మాటలు గుర్తుచేశాయి. ఈ కవిత్వంలో ప్రియుడు తన ప్రియురాలితో మాట్లాడుతూ 'నువ్వు లేకుండా బతకలేను' అంటాడు. అందుకు ప్రియురాలు 'చాలా కండీషన్స్ ఉన్నాయి' అంటుంది. 'నీవు ఏ కండీషన్స్ పెట్టినా నేను రెడీ' అంటాడు. 'సరే... నదికి నీవాదరినా, నేనీదరినా ఉందాం. మధ్యమధ్యలో నది మధ్యలో కలుసు కుందాం' అంటుందామె. 'ఒకే కప్పు కింద జీవించకుండా అది పెళ్ళెలా అవుతుంది' అంటాడు ప్రియుడు. 'మరి అదే నా కండీషన్. అప్పుడే 'టేక్ ఇట్ గ్రాంటెడ్' భావనకు అవకాశం ఉండదు. ఎవరి పరిధిలో వారుంటాం' అంటుంది ప్రియురాలు. అలాగే 'అయిదో గోడ' కథలో కూడా తన పెళ్లి గురించి

కూతురు ఆర్తితో శారద సంభాషణలోనూ ఇవే మాటలు వ్యక్తమవుతాయి. 'పెళ్లి కాదు, కలిసి బతుకుతాం. మా జీవితాన్ని కొత్తగా మొదలు పెట్టాలనుకుంటున్నాం. కొన్నాళ్లు మనింట్లో, కొన్నాళ్లు వాళ్లింట్లో ఎక్కడ ఉండాలనిపిస్తే అక్కడుంటాం' అంటుంది శారద. ప్రకృతి సహజమైన రుతుస్రావం గురించి ఇప్పటికీ మాట్లాడుకోలేని స్థితిపైనా, సమాజంలో, కుటుంబంలో ఎదురవుతున్న ఇబ్బందుల పైనా రాసిన కథ 'ఈస్ట్రోజెన్ పిల్'. మాట్లాడడానికే సంకోచించే నిషిద్ధ అంశంగా భావిస్తున్న స్వలింగ సంపర్కంపై ఎంతో కన్సర్న్‌తో, సంయమనంతో రాసినవి 'సంచయనం', 'కప్లెట్' కథలు. భిన్నమైన లైంగిక ఆసక్తులకు, వేదనలకు అద్దం పట్టిన కథలు ఇవి. మనిషి ప్రధాన సమస్య నైతిక సంశయం. మన చర్యలను ప్రశ్నించుకోవడం నైతిక సమస్య అయింది.

మరో నచ్చిన కథ 'ఆ ముగ్గురు'. మనుషుల్లోని మోరల్ పోలిసింగ్ భావనలపై రాసిన కథ. ఈ కథలో ట్రేసీ, విమల తమను తాము మరిచిపోయి మరీ సహోద్యోగి శాంచేజ్ నైతిక ప్రవర్తనపై చెవికోసుకుంటుంటారు. ఎక్కడ లేని ఉత్సుకతను, ఆసక్తిని ప్రదర్శిస్తుంటారు. రాత్రి సమయంలో కూడా నిద్రపట్టక అశాంతితో పక్కమీద దొర్లుతుంటారు. శాంచేజ్ మాత్రం పిల్లలతో హాయిగా ఆడుకొని ఆదమరిచి నిద్రపోతుంది. క్లుప్తంగా రెండు పేజీల్లోనే చాలా బాగా రాసిన కథ ఇది. 'క్రైమ్ సీన్' కథలో అత్యాచారం విషయంలో సమాజం నడకను, కుటుంబాల్లోని వేదనను, సంఘర్షణను చాలా సహజంగా కళ్లకు కట్టారు. రేప్ బాధితురాలైన శ్రేయ తల్లిదండ్రులతో సంభాషించిన తీరు గొప్ప ప్రేరణనిస్తుంది. ఇంకా 'టూ డాలర్స్ ప్లీజ్', అయిదు శాజరాక్‌ల తర్వాత, హోమ్ రన్, ఇట్స్ నాట్ ఓకే... ఈ కథలన్నింటిలో నాకు నచ్చిన అంశాలు అనేకం ఉన్నాయి.

'అయిదో గోడ' చదివిన తర్వాత అమెరికాలోని తెలుగు మహిళల ప్రవాస జీవితాలపై ఇంత నిశితంగా, నిస్సంకోచంగా, ఇప్పటికీ స్వేచ్ఛగా మట్లాడుకో లేకపోతున్న అనేక వాస్తవాలను కథల రూపంలో అందించిన మొదటి స్త్రీ వాద రచయిత్రి కల్పన గారేనేమో అనే అభిప్రాయం కలిగింది. మంచి కథల పుస్తకాన్ని అందించిన కల్పన గారికి, పుస్తకాన్ని అందంగా ప్రచురించిన ఛాయా మోహన్ గారికీ హృదయ పూర్వక అభినందనలు.

■



## పాప మట్టి తింటుంది!

**ఆ** కాలిగజ్జెలు ఘల్లు ఘల్లుమనడంలేదు
ఆ చేతిగాజులు
గలగలమనడం లేదు!
లేడిలా గంతులేసే
చిట్టితల్లి కదలడం లేదు!

మంకు పట్టినట్టు పడుకుందంటున్నారు
మారాం వదలి లేవమంటున్నారు
చిట్టితల్లి గాజులు చెరువులో పడున్నాయి
చెట్టు కింద చెల్లాచెదురుగా ఉన్నాయి
చిట్టితల్లి గజ్జెలు చిందులు మరచాయి

ఊరి మధ్యలో మువ్వలు విరిగిపడిపోయున్నాయి
పాప పరిగెత్తడానికి పాదాలు నడక మరిచాయి
అంతా చిత్రంగా ఉంది
అమ్మలు శోకసంద్రంలో
గుమ్మానికి కట్టిన తోరణాలై పోయారు!

పాముకాటుకైతే విషవిరుగుడుంది
పాపలను మాత్రమే కరిచే పాముకాటుకి
విరుగుడు ఇంకా కనుగొనలేదు
బాల్యంలో పాప మట్టి తింటే బాధపడిన వారు
పాపను రక్షించారు!

రక్షించే చేతులు శాశ్వతంగా మట్టినే తినమంటున్నాయి
మందుకనుగొనే లోపల
ఎంతమంది పాపలు మట్టికూడు తినాలో..!

**- జి. శైలమ్మ**

కవిత

# పాలస్తీనా జ్ఞాపకాలు

- డాక్టర్ ఎన్.గోపి



పేజీలు వెచ్చగా తగుల్తున్నాయి
అది తప్పకుండా
పాలస్తీనా కవితై వుంటుంది
దర్వీష్ కవీంద్రుడు
వెదజల్లిన అక్షరాలై వుంటాయి
ఢిల్లీలో అతణ్ని కలిసినప్పుడు
నడుస్తున్న అరబ్ ప్రపంచంలా కనిపించాడు

పుట్టక ముందు ఏమోగాని
కనులు తెరిచిన తర్వాత
పద్యాన్ని ఎవరూ చంపలేరు
ముడువక ముందు ఏమోగాని
పిడికిట్లో రగిలే కోపాగ్నిని
ఎవరూ ఆర్పలేరు

పాలస్తీనీయుల
పోరాట గాథలతోనే పెరిగాను నేను
చరిత్ర నేత్రాంచలాల్లో
కన్నీళ్లు ఇగిరి పొయ్యేవి కాదు
అమెరికాకు అశ్రువులంటే ఖాతరు లేదు


మా ఉస్మానియా యూనివర్సిటీ
యాసర్ అరాఫత్ గళసీమలో
డాక్టరేట్‌ను అలంకరించినప్పుడు
ఇండియా గాలి
ఆయనకు స్వాగతం పలికింది
గాలికి మాత్రమే తెలుసు
మనిషి అంటే ఏమిటో!

ఆయన ఎక్కుపెట్టిన వేళ్లు
తుపాకుల కన్న బలమైనవి
టాగూర్ ఆడిటోరియం ముందు
ఆయన నిలబడ్డ స్థలంలో
ఇప్పటికీ ఆ ప్రకంపనాలున్నాయి

నిశ్శబ్దమంటే
శబ్ద రాహిత్యం కాదు
నిశ్శబ్దంలోని అంతరాంతరాల్లో
విస్ఫోటనాల పొరలుంటాయి

ఎప్పటికీ పాలస్తీనా
ఒక అస్తిత్వ మహా గర్జనకు ప్రతీక
అవి స్మరణీయ చరిత్ర అది
మానవోజ్వల కావ్యానికి
నిత్య చైతన్య వ్యాఖ్యాన రేఖ !

## నచ్చిన పుస్తకం






# మనోఫలకంపై దృశ్యావిష్కరణ

- బొల్లోజు బాబా

**క**వి స్వీయ అనుభవాన్ని ఆధారంగా చేసుకొని రాసిన కవిత్వాన్ని అనుభూతి కవిత్వం అంటారు. క్షణక్షణం మనల్ని ప్రత్యక్షంగా తాకే అనుభవాలూ, వాటి స్పందనలూ, జీవితాన్ని జీవనపాత్రంగా మార్చే అనంతమైన అనుభూతులూ, ఇవి కాక కవిత్వానికేవీ అర్థం? అని ఇస్మాయిల్ ప్రశ్నిస్తారు. బాహ్య దృశ్యాలు అంతరంగ ప్రపంచంలో దృశ్యత్వాన్ని కోల్పోయి కేవల అనుభూతిగా మిగుల్తాయని శ్రీకాంత శర్మ అభిప్రాయపడ్డారు. ఆధునిక కవిత్వంలో అనుభూతి కవిగా గుర్తింపబడిన వాడు బాలగంగాధర తిలక్. ఆ తరువాత ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, శేషేంద్రశర్మ, వేగుంట మోహన ప్రసాద్, ఇస్మాయిల్, కొత్తపల్లి శ్రీమన్నారాయణ లాంటివారు ఈ అనుభూతి కవిత్వాన్ని వెలిగింపచేసారు. ఇదే క్రమంలో సమకాలీనంగా బి.వి.వి. ప్రసాద్, నామాడి శ్రీధర్, ఎమ్మెస్ సూర్యనారాయణ లాంటివారు జీవనానుభవాలను పరిగణనలోకి తీసుకొని కవిత్వాన్ని రచిస్తున్నారు.

తెలుగు సాహిత్యంలో అనుభూతి కవిత్వంపై దశాబ్దాలలో గొప్ప చర్చ జరిగింది. సాహిత్యమంతా మానవానుభవంలోంచి పుట్టుకొచ్చినదే కనుక అనుభూతి కవిత్వాన్ని ఒక సాహిత్య ధోరణిగా భావించవచ్చు తప్ప సిద్ధాంతంగా అంగీకరించలేం– అంటూ మార్క్సిస్టు విమర్శకులు చేసిన వాదన సహేతుకంగానే అనిపించినా.. అనుభూతి కవిత్వంలో సామాజిక స్పృహ ఉండదని, సామాజిక ప్రయోజనం లేని కవిత్వం ప్రగతి నిరోధమని అంటూ చేసిన విమర్శను అంగీకరించలేం. ప్రజలను గొప్ప గొప్ప కార్యాలకు ప్రేరేపించటం ఒక్కటే సామాజిక ప్రయోజనంగా భావిస్తారు కానీ, 'పతిత హృదయంలో దీపం వెలిగించటం' కూడా సామాజిక ప్రయోజనమే! సాటి మనిషిపట్ల కరుణను, ప్రకృతి పట్ల ప్రేమను, కలిగించటం నేటి యాంత్రిక ప్రపంచానికి ఎంతో అవసరం. ఎమ్మెస్ కవిత్వం ఆ పనిచేస్తుందని, ఇటీవల వెలువరించిన 'నేనొక అనుభూతి' కవిత్వ సంపుటిలోని అనేక కవితలు నిరూపిస్తాయి.

ఎంతైనా రైతు ప్రాణాలు పోసి/
పెంచిన వరి కంకుల కలలు
బతుకు కుప్పపోసి నూర్చి/ ఎగరబోసిన బంగారు క్షణాలు
జీవితం పణంగా పెట్టి పరిరక్షించిన ధాన్యపు రాశులు
కృషి పరిపూర్ణతకు ధన్యత చెందే జీవరాశులు
ఒక్క ఈవియమ్ బీప్ సౌండ్‌లో గల్లంతైపోవడం
ఈ శతాబ్దపు విషాదం"

ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధానిలో పెద్దఎత్తున ఉద్యమం సాగింది. చివరకు ప్రభుత్వం దిగొచ్చింది. తాము ఎన్నుకొన్న ప్రభుత్వాలు తమ గొంతుకలనే కోయటాన్ని ఎంతో పదునుగా చెబుతున్నాడు. వరికంకుల కలలు, బంగారు క్షణాలు, ధాన్యపురాశులు అంటూ రైతు జీవితాన్ని కళ్లముందు నిలిపి, అదంతా ఒక్క ఈవియం బీప్ సౌండ్‌లో గల్లంతైంది అనటం గొప్ప శక్తివంతమైన అభివ్యక్తి.

◆ ◆ ◆

"ఈ కాలం
పచ్చిగాయాలు రేగిన
క్షతగాత్ర యవనిక
దీనికి ఒక సరికొత్త పాత పేరు
వికారి" అనే వాక్యాల ద్వారా వగరు అనే కవితను ఒక ఉగాది కవితగా పోల్చుకోవచ్చు. ఈ కవితలో వగరును

రుచిరాజంగా ప్రకటిస్తాడు. ఆరింటిలో నాది వగరు దారి అంటాడు. వసంతపు గాలులన్నీ వగరుగా వీచాలి/ పొద్దుటే కోకిలను వగరుగా కూయమని అడగాలి.. (వగరు) అంటాడు. చాలా చిత్రమైన ప్రతిపాదన. ఇంతవరకూ మనం విన్న ఉగాది కవితలలోకెల్లా విలక్షణమైన ఊహతో కూడుకొని ఉన్న కవిత ఇది. ఇదే ఎమ్మెస్ కవితామార్గం.

చాన్నాళ్ళ క్రితం రాధేయ పురస్కారం కోసం అనంతపురం వెళ్ళాడు ఎమ్మెస్. సస్యశ్యామల కోనసీమ నుంచి కరువు ప్రాంతంగా చెప్పబడే రాయలసీమకు ఒక కవి ఎలా వెళతాడు? అసలు ఎలా వెళ్ళాలి? అనేదానికి 'మబ్బుల్లేని ఆకాశంలోకి ...' అనే కవితలో సమాధానం దొరుకుతుంది.

పక్షిలా వచ్చి వాలాను! రెక్కలు దులిపాను!
ఏమో! రెండు దుక్కుల వానౌదామనుకొన్నాను
ఈ శప్తభూమిపై తప్త హృదయంతో దొర్లాలనుకొన్నాను
గుండెలో గోదారి నింపుకొచ్చాను
కార్మోయిళ్ళని దుస్తులుగా కుట్టించుకొని
ధరించి వచ్చాను
ఈ మట్టిపొరల్లోకి దూకి
వరికంకునై నాట్యమాడాలని వచ్చాను

సంచిలో పట్టినన్ని మబ్బులేసుకొచ్చా' అంటాడు ఎమ్మెస్. ఇక్కడనుంచి నీటిని, నదులని పట్టుకెళ్ళాలని ఉంది అన్న ఊహే హృదయాన్ని కదిలింపచేస్తుంది.

◆ ◆ ◆

చిత్రకొండ గంగాధర్ కవి, రచయిత. చెరువుగట్టుపై చెప్పులు, రాసుకొన్న డైరీలు విడిచి చెరువులోకి నడుచుకొంటూ వెళ్ళి ఆత్మహత్య చేసుకొన్న ధీరచిత్తుడు. ఈ సంపుటిలో 'ఎచటికి పోగలవు' అనే కవిత చిత్రకొండ గంగాధర్‌పై రాసినది. ఈ కవితలోని శిల్పవిన్యాసం ఉత్కృష్టమైన స్థాయిలో కనిపిస్తుంది.

" నిద్రిస్తున్న తటాకపు
రహస్య నీటి పొరల అరలు తెరిచి

చిత్రంగా ఎక్కడకు మాయమయ్యావు? రాత్రిపూట, లోతైన చెరువు నీళ్ళలోకి అదృశ్యమైపోయిన చిత్రకొండను ఒక దృశ్యంగా కళ్ళముందు నిలుపుతాడు.

"చెరువు గట్టున ఆత్మదీపాన్ని వెలిగించి
ఎచటికి పోగలవు ఒకానొక రాత్రి" అంటూ కవిత ముగుస్తుంది. ఆత్మదీపం అంటే– అతను చెరువుగట్టున మిగిల్చిన డైరీలలోని సాహిత్యంగా భావించాలి. గంగాధర్ కవిత్వాన్ని పత్రశకలం పేరుతో ఒక సంపుటిగా, మృతనగరం అనే ఒక నవలను నామాడి శ్రీధర్ పుస్తకరూపంలోకి తీసుకొని వచ్చారు. అలా సాహిత్య రూపంలో ఆత్మదీపంగా వెలుగు తున్నప్పుడు గంగాధర్ ఎచటికి పోగలడు?

◆ ◆ ◆

వాచ్యంగా కాక శబ్దప్రధానంగా ఉండే కవిత్వాన్ని అందుకోలేని అరసికులతోను, రసజ్ఞత లోపించిన విమర్శకులతో ఎమ్మెస్ కవిత్వ యుద్ధం చేస్తున్నాడు చాన్నాళ్ళుగా. అలాంటి వారిని ఉద్దేశించి రాసిన 'అజ్ఞానులు' అనే కవితలో ...

"ఉంటారుంటారు! సర్వత్రా ఉంటారు
ఉండాలి కూడా
రోడ్డుపై వేలాది బాతులు
వయ్యారంగా నడుస్తున్న అపురూప దృశ్యంలో
ఒక మోటారు బైకు నిస్సిగ్గు అసహన చక్రాలకింద పడి
అదాటుగా – నువ్వొక బాతై మరణించి
తిరిగి అక్షరమై లేచిన క్షణాల్లో
పుట్టుకొస్తారు వాళ్ళు!
నీకస్సలు బోధపడని లెక్కలేవో పట్టుకొస్తారు
వాళ్ళుండాలి సుమా! ఉంటేనే నీ ఉనికి!" అంటాడు

ఈ కవితలో చెప్పిన "ఒక మోటారు బైకు నిస్సిగ్గు అసహన చక్రాలంటే" ఏమిటి? మోటరు బైకు చక్రాలు అనొచ్చు కదా. నిస్సిగ్గు, అసహనం విశేషణాలు మన యాంత్రిక జీవనాన్ని సూచిస్తాయి. మన యాంత్రిక జీవనం మనం జీవించే క్షణాలను నిస్సిగ్గుగా, అసహనంతో చిదిమేస్తున్నదనే సత్యాన్ని ఆవిష్కరిస్తున్నాడిక్కడ కవి.

ఒక అందమైన సంధ్య మనకు పట్టదు. చలం అన్నట్లు ఎవరా అమ్మాయి అని ప్రశ్నిస్తాం. మన యాంత్రిక జీవన రణగొణల మధ్య మనచుట్టూ ఉన్న అనేక అనుభవాలకు మనం అంధులమై పోతాం, మోటార్ బైకు కింద పడే బాతులమై పోతాం. వాటిని ఎమ్మెస్ లాంటి సున్నిత హృదయులు పట్టుకొని, గొప్ప పదాలతో నిర్వచించి దివ్యత్వాన్ని అద్ది కవిత్వంలోకి తీసుకొని వస్తారు. ఉదాహరణకు – సస్య రహస్యం నింపుకొన్న పంట కాలువ, పున్నమి పడవ – సరంగు కవి, తమ అందంతో మూర్ఛలు ప్రసాదించే సీతాకోక చిలుకలు, పడవ సరంగు గెడపై అదాటున దర్శనమిచ్చిన పాలపిట్ట, గోవా మోహిని, చంద్రకలశం, చిమ్మచీకట్లో స్కూటీకి అడ్డుపడే తాబేలు, వర్షరుతు రాయబారి, పుప్పొడి దుప్పటి, పుణ్యక్షేత్రం ఒక రెక్కల లోకం లాంటి అనేక వ్యక్తీకరణలు మనం అంధులమైపోయిన అలాంటి కొన్ని సందర్భాలను పునరుజ్జీవింపచేస్తాయి ఈ పుస్తకంలో.

అనువాదకులు వివిధ భాషలనుంచి సాహిత్యాన్ని అనువదించి పాఠకులకు అందిస్తారు. ఇతర భాషల్లోని సాహిత్యాన్ని చదువుకోవటానికి అనువాదకుల సహాయం

తప్పనిసరి. ఒక పాఠకుడు అనువాదకుల పట్ల చూపించాల్సిన ప్రేమ, కృతజ్ఞతలు లోపలి ఆకాశాలు అనే కవితలో ఇలా అంటాడు ఎమ్మెస్.

" ఈ నా హృదయాకాశంలోకి
ఎన్ని పక్షులు
తమ రెక్కల్ని అనువదించి
ఎన్ని ఆకాశాలను దులపరించాయో!
నా లోపలి మట్టిప్రమిదను తుడిచి
ఎన్నెన్ని తప్త దగ్ధ విశ్వగానాల ఘోషను
చమురుగా నింపాయో ".

ఒక అనువాదకుడు ఒక పాఠకుని హృదయాకాశంలోకి ఎన్ని ఆకాశాలను దులపరించాడో అన్న ఊహే ఎంతో గాఢమైనది. అపూర్వమైనది.

♦ ♦ ♦

జీవనగాథా కవిత్వం పేరుతో ప్రముఖుల జీవనరేఖలను కవితలుగా పోతపోయటం ఒక నూతన ప్రక్రియ కాకపోవచ్చు. అలా రాసిన కవితలు ఆయా వ్యక్తుల జీవితాల్లోని మంచి చెడులను అద్భుతంగా వ్యక్తీకరిస్తున్నాయి. ఎమ్మెస్ సుబ్బలక్ష్మిపై రాసిన కవిత శీర్షిక 'తపతి శుభలక్ష్మి. సుబ్బలక్ష్మిని శుభలక్ష్మిగా సంబోధించటం ద్వారా పెద్దబొట్టుతో ఆమె నిండైన విగ్రహాన్ని కళ్ళముందు నిలుపుతాడు. 'సదాశివమేనాడో చెక్కిన మరబొమ్మ' అనే వాక్యంలో ఆ సర్వేశ్వరుడు చెక్కిన బొమ్మ అనే అర్థం పైకి తెలుస్తున్నా- తరచిచూస్తే సుబ్బలక్ష్మి భర్త అయిన సదాశివం ఆమెను ఒక మరబొమ్మలా ఆడించేవాడనే గాసిప్ కూడా ఇమిడిపోవటం ఎమ్మెస్ ప్రతిభకు తార్కాణం. ఈ కవి భక్తి భావంతో రాసిన శివవచనాలను ఈ సంపుటి చివరలో చేర్చాడు.

"పాత్రంలో ఉంటావు/ బరువుగా!
పత్రంలో/ తేలికగా!
నువ్వు/ బరువా?/ తేలికా?

ఈ శివవచనం శివుడిని ఉద్దేశించినదైనా, అది ఎమ్మెస్ కవిత్వానికి కూడా అన్వయించుకోవచ్చు. ఎమ్మెస్ కవిత్వం ఎన్నడూ వాచ్యంగా ఉండదు. ఎమ్మెస్ ఏనాడూ ఎంగిలి ప్రయోగాలు చేయలేదు, డెడ్ మెటఫర్స్ వాడలేదు. ఏం చెప్పినా నవ్యంగానే చెప్పాడు, సొంత స్వరంలోనే రాసాడు. కవిత్వం అనేది ధ్వన్యాత్మకంగా, ప్రతీకాత్మకంగా మాత్రమే చెప్పాలని కంకణం కట్టుకొని మూడు దశాబ్దాలుగా కవిత్వాన్ని వెలువరిస్తున్నాడు. ఇతనిది జీవనానుభవాల కవిత్వం. కవిగా ఎమ్మెస్ నిజాయితీపరుడు. తాను చూచినది, తాను అనుభవించి నది మాత్రమే కవిత్వంలోకి తీసుకొని వచ్చాడు. తన అనుభవానికి వెలుపల ఉన్నదానిని ఏనాడూ స్పృశించలేదు.

ఇక చివరగా –
జీవితం
కిటికీపై/ వాలిన పిట్ట
ఎగిరిపోయేలోగా/ మిగిలిపోయే
నేనొక అనుభూతి

అనుభూతికి ఒక ఆకారాన్ని ఇస్తే ఎమ్మెస్ కవిత్వం అని అర్థం చెప్పుకోవచ్చు. అందుకనే జీవితం కిటికీపై వాలిన పిట్ట ఎగిరిపోయేలోపు నేనొక అనుభూతిగా మిగిలిపోతాను అని ప్రకటించుకొన్నాడు- మనకున్న గొప్ప కవి ఎమ్మెస్ సూర్య నారాయణ.

■

## ఓట్ల కొలిమిలో...

**చూ**సీ చూడనట్లుంటే
కళ్ళ ముందు కోటి కిరణాలు
వెదజల్లాల్సిందే!
వినీ వినట్లుంటే
చెవుల్లో ప్రజా శంఖమూదాల్సిందే!
మాటిచ్చి తప్పుతున్నాడంటే
మూతికి తాళం బిగించాల్సిందే!
రాజకీయ వాసనలకు లొంగాడంటే...
మాటల తూణీరంలోంచి
ఓట్ల బాణాలు సంధించాల్సిందే!



రైతుల సమస్యలను
పట్టించు కోకపోతే
రచ్చకెక్కి డప్పు కొట్టాల్సిందే!
విశాఖ ఉక్కు జోలికొస్తే
ఓట్ల వల పరచాల్సిందే!
దక్షిణ మధ్య రైల్వే నమ్మినవ్!
ఓట్ల కొలిమిలో
ఇనుముకు పట్టిన
'చిట్టెం' (మురికి) తొలగించాల్సిందే!

– డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
85558 99493



## తడి

పువ్వులపై ముల్లులు వాలినప్పుడు
మహాసముద్రాలు పొంగుతాయి
గుండెనదిలో రోదన ఉబుకుతుంది
అసాధారణమైన గీతం తప్పిపోయినప్పుడు
మౌనం నశిస్తుంది
కన్నీళ్లు శబ్దిస్తాయి

దేశపు జెండాను, గర్భాన్ని,
మృదువైన మనిషిని,
రెప్పలు ఊడిపడినప్పుడు
నాలో తడి సముద్రాలుగా
ఆకాశాలుగా, మహాశూన్యంగా ...

తడిలేని జీవితం
తడిని ప్రకటించలేని అవయవాలు
శూన్య నేత్రాలే!
మనుషుల్లో తడి పెరగాలి
తడి తడిగా శరీరం వర్షించాలి

మనిషిని ముట్టుకోగానే
పొరలు పొరలుగా తేమ తగలాలి
తేమలో కొట్టుకుపోవాలి
తేమలేని జీవితాలకు
పునరావాసం కల్పించాలి
మొక్కను పెంచినట్లే
మనిషిని తేమతో పెంచాలి!

**- అఖిలాశ**
72595 11956

## నువ్వు కూర్చున్న కొమ్మ

వరుస వర్షాభావాలను వంచి
చినుకులను పిండుకుని
చీడపీడల చిక్కుల్లోంచి గింజల్ని దులుపుకుని
మట్టికిందేసినా.. మళ్ళీ మొలిచే ప్రక్రియను
ఆవాహన చేసుకున్నోడికి.. యుద్ధం కొత్త కాదు!

అప్పుల ఎగుడు దిగుడుల్లోనే
ఎంతని ప్రయాణిస్తాడు
కరువుల పర్యవసానాలను ఎంతని తట్టుకుంటాడు
గిట్టుబాటు ధరలు, దళారీల దమన కాండల
పాతబడిన పాటలను ఇంకెన్నిసార్లని పాడతాడు!

అన్నాన్ని చూసినపుడంతా
అగుపించదా అలవికాని ఆ శ్రమ
ఆకలి కేకల్ని అణగబెట్టినపుడు అవగతం కాదా,
అన్నదాతల ఆవేదన!
సాళ్ళలో ఆశలను నాటుకుని
మొలిచిన మొక్కల బిడ్డల్ని రెక్కల కింద దాచుకుని
కార్పొరేట్ డేగలతో తలపడతాడు
మందుల నకిలీలపై గెలిచిన అగ్గితెగుళ్ళు
గింజల్లో పాలుపోసుకోనీవు
సబ్సిడీలన్నీ తాలు గింజలై గిట్టుబాటు కానీవు

మట్టి పైనే మనసు పెట్టుకుని
మట్టిలోనే పుణుక్కునే ఆ ఆరుగాలం కష్టానికి
అన్నమైనా అందమైన స్వప్నమే
పంటబెట్టడమూ.. ఒక సాహసమే..!

తరాలుగా తన కాలుదుతూనే.. తలాకింత తిండి పెట్టి
పేదరికపు పీడకలలతో నిద్ర కరువైన కళ్ళను
ఆకలిని వెలివేయలేక అణగారిన కడుపులను
నిర్దాక్షిణ్యమైన చట్టాల తీగలతో బంధిస్తే
తెంచుకోవడం ఓ లెక్కా..!

అతని పోరాటానికి మట్టే మద్దతు పలుకుతుంది
అడ్డగించేందుకు బ్యారికేడ్లు చాలవు
టియర్ గ్యాస్లు వాటర్ కెనాన్లు
ఆ నిరసనల సెగలను ఆపలేవు
మిత్రమా తెలుసుకో ..
రైతంటే నువ్వు కూర్చున్న కొమ్మ..
నరికేసుకోవద్దు..!

**- దీపికా జేమ్స్**



# వాన మెతుకులు

- కెంగార మోహన్
94933 75447

**చ**లి మనిషినే కాదు, మనసుని గాయం చేస్తున్నట్లుంది. జనవరి కావడంతో చలి తన ప్రతాపాన్ని చూపిస్తున్నది. పొగమంచు దుప్పటి భూమిని ఖైదు చేసినట్లుంది. తను పనిచేసే పాఠశాల రాయలసీమలోని కర్నూలు జిల్లాలో కర్నాటక సరిహద్దు గ్రామం. తుంగభద్రా తీరంలోని పల్లె. నీళ్ళుంటే నాగరికత ఉందంటారు. అక్కడ నీళ్ళుండేది.. ఆ నదీ నీళ్ళు ఆ ప్రాంతాన్ని తమ కబంధ హస్తాల్లో పెట్టుకున్న ఆ ప్రాంత పాలకుల కోసమే. వందల ఎకరాలు వాళ్ళ గుప్పిట్లోనే. నదికి మాటల్రావు గానీ, ఒకవేళ మాటలొస్తే నదిని కూడా బెదిరించే పరిస్థితి వాళ్ళది. అక్కడి పల్లెల్లోని ఇళ్ళకు ఎక్కువగా తాళాలు వేసుంటాయి. బిక్కుబిక్కుమని బతికే ముసలోళ్ళు.. అవిటోళ్ళు తప్ప ఎవ్వరూ ఆ ఊర్లో ఉండరు. ఉండాలంటే ఆత్మాభిమానం సంపుకుని ఉండాలి. ఊళ్ళో వాళ్ళ మాట మీదనే బతికేవొళ్ళే ఊర్లో ఉంటారు.

ఆరింటికంతా బయలుదేరితే తప్ప పాఠశాలకు చేరుకోలేని పరిస్థితి. పాఠశాలకు సమయానికి వెళ్ళకపోతే ఏదో పోగొట్టుకున్నవాడిలా ఉంటాడు మాధవ్. తాను హెడ్మాస్టర్ కాదు, పిల్లల్తో జాలీగా గడిపే తెలుగు టీచర్. పాఠశాల సమయానికంటే ముందే చేరుకుంటే వాళ్ళతో చాలా కబుర్లు చెప్పుకుంటూ ఆనందంగా గడపొచ్చనుకుంటాడు.

ఏడవ తరగతి పిల్లలు మాధవ్ వచ్చిన వెంటనే బైకు శబ్దం విని ఎదురొచ్చేవాళ్ళు. ఇవాళెందుకో రాలేదు. ఏమైందబ్బా.. అనుకుంటూ దూరంగా కూర్చున్న అమ్మాయిల్ని కేకేశాడు. చాలా నిదానంగా దగ్గరికొస్తున్నారు.

"ఏమైంది నందిని.. పిలిచేవరకు రారేం.."

అమ్మాయిల ముఖాల్లో విషాదం.

"ఏం లేదు సార్.. ఏం లేదు.."

"ఏదో బాధలో ఉన్నట్లున్నారు.. ఎవరన్నా ఏమన్నా అన్నారా..?"

"అదేం లేదు సా.."

"మరి.."

"హారిక ఇవాళ పనికి గుంటూరు వెళుతుందంట సార్.. వాళ్ళ నాయిన మీతో వచ్చి మాట్లాడతాడంట సార్."

"ఏం.. ఎందుకు..?"

"హారికను వాళ్ళ నాన్న గుంటూరు మిరప పంట కూలీకి తీసుకెళ్తాడంట."

బాగా చదివే అమ్మాయిని తీసుకెళ్ళడం మాధవ్‌క్కూడా నచ్చలేదు. తను జింకపిల్లలా పరుగులు తీస్తది. ఆటలో.. సదువులోనే కాదు.. అల్లరల్లరి చేయడంలోనూ ఫస్టే. తను బడికి రాలేదంటే టీచర్లక్కూడా బోరే.. వాళ్ల నాన్నతో మాట్లాడి ఆపొచ్చనే భావనతో మాధవ్ ఉన్నాడు.

"నేను వాళ్ళతో మాట్లాడతానులే. మీరేం బాధపడొద్దు.." అన్నాడు విద్యార్థినులతో.

◆◆◆

స్కూలు ప్రార్థనకి ఇంకా సమయం కాలేదు. స్టాఫ్‌రూంలో కూర్చుని ఆలోచిస్తున్నాడు. ఆ ఊరి సంగతి మాధవ్‌కు తెలియందేమి కాదు. ఈ మధ్య జరిగిన దేవర అయిపోయాక అందరూ వలసబాట పడ్తున్నారు. ఆ దేవరే ఈ ఏడాది ఒక కుటుంబాన్ని ముక్కలు ముక్కలు చేసేసింది. అదీ హారిక వాళ్ళ కుటుంబమే. అతనూ ఆ ప్రాంతం వాడే. ఆ ప్రాంతంలో ఏ ఊళ్ళో దేవర జరిగినా దున్న పోతు ప్రాణంతో పాటు మనిషి ప్రాణం పోతుంటాది. ఆ ఊరి దేవర్లో కూడా అట్లే ఒకరి ప్రాణం పోయింది. ఆ ఊళ్ళో బంగారమ్మవ్వ ద్యావుర.. సుగ్గికి పోయినోళ్ళందరూ వస్తారు. ఊర్లో ద్వావుర జరిగిందంటే ఎవరిదో ఒకరి ప్రాణం పోతుంది. ఆ ఊరులల్లో ఇది సహజం.

పోతును నరికేటప్పుడు ఎవున్నో ఒకున్ని సంపుతారు. కక్ష ఉన్నోన్నే కాదు. ఊర్లో పెద్దలకి ఎదురు తిరగినోడో.. అవినీతిని ప్రశ్నించేవోడో ఎవుడో ఒకడు సచ్చేది ఖాయం. పోతు నరికే ముందురోజు పూజ. ఊర్లో ఉండే అన్ని గుడులకి ఉదయం నుండి పూజలు చేస్తారు. సాయంత్రం ఇంటింటికి ఒక కుంభం ఎల్లిస్తారు. కుంబాలన్నీ బంగారమ్మ గుడిదగ్గర దింపి నైవేద్యం పెడతారు. ఆ మరుసటి రోజే ఊళ్ళో విధ్వంస కాండ. పోతు నరికేది మరుసటి రోజే. ద్వాపుర ఆచారం ప్రకారం ఉత్తబిత్తల భూతుబిల్లి తిరుగేది పోతు నరికేరోజే. భూతుపిల్లి అంటే అఘోరా మాదిరి ఉంటాడు. మనిషే. ఊరు సుట్టూ పొలిమేరంతా ఉత్తబిత్తల తిరుగుతా పొలి సల్లుతాడు. ఆ సమయంలో ఊర్లో ప్రతి ఇల్లూ వాకిలేసుకుంటారు. ఎవురూ బయటికి రారు. భూతుబిల్లి వచ్చింతర్వాతే బంగారమ్మ గుడికాడ పోతు నరుకుతారు. ఊరి జనుమంతా కలిసేదప్పుడే. ఆడ ఎవుని ప్రాణమో ఒకుంది తీస్తరు. ఒక్కసారి గుంపు గుంపంతా ఎవున్నైతే సంపాలనుకుంటారో వాని మీద పడుతుంది. ఆ గుంపు దెబ్బకి కిందకు పడిపోతాడు. ఎవుడు తొక్కుతాడో, ఎలా తొక్కుతారో .. ఆ తొక్కుడుకే ఆ మనిషి ప్రాణాలిడుస్తాడు. బంగారమ్మవ్వ బలి తీసుకునేద్య అని అనేస్తారు. బంగారమ్మవ్వకు కోపమెచ్చి తీసుకునేదంటారు. కేసుల్లేవు. పోలీసోళ్ళడిగితే ఇక్కడ ఇది మామూలే.. ఆచారమంటారు. పొడిసి సంపేదుండదు. గుంపుగుంపంతా తోసేసి కాళ్ళకింద ఏసి తొక్కి సంపే ఆచారం దుర్మార్గమని మాధవ్‌కు అనిపిస్తుంది. బంగారమ్మవ్వకి కేకలేస్తరు కాబట్టి ఆ అరుపుల్లో ఎవుడు బలైతడో ఎవ్వడూ కని పెట్టలేడు. కింద పడినోని అరుపులు ఎవునికీ వినబడవు. సాధారణంగా ఊరికి బలమైనోడు.. పెద్దరికాన్ని ధిక్కరించేటోడు, ఊరికేమన్నా సేయల్లనుకునేవోడే సస్తడు. అట్ల సచ్చినోడే హనుమంతు తమ్ముడు.

♦ ♦ ♦

“సార్” అనే పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు మాధవ్. ఎదురుగా హారిక వాళ్ళ నాన్న హనుమంతు.

“కరోనా – కరువు మా బతుకుల మీద మన్ను బోసిందయ్యా! మాకు సుగ్గితప్ప ఇంగో దారి లేదు. ఈ సినదాన్ని గూడా దీస్కబోతే నాల్గు దుడ్లు సేతిలబడ్తయ్. సేతికొచ్చిన పిల్ల ఇంట్లో ఉండ్రాదు. దాని నెత్తిమీద నాలుగ్గింజలేసి సాగనంపితే బరువు దిగుతాది. అందుకే మా పాపకు హాజరెయ్యండయ్య. ఆ అమ్మఒడి దుడ్లు పడితే వేన్నీళ్ళకు సన్నీళ్ళు తోడైనట్లుంటాది..” సెప్పుకుంటూ పోతుండాడు హనుమంతు.

“అదిగాదు హనుమంతన్న.. మీ పాప బాగా సదువుతాది. క్లాసులోనే తెలివైంది. నీవు సుగ్గికి తీస్కబోతే తన సదువేం గావల్ల? సదువుకుంటే మీ కష్టాలు తీర్చే పిల్లగ తయారైతది. నా మాట విను” అన్ని విధాల ఒప్పించే ప్రయత్నం చేస్తున్నాడు మాధవ్.

“సార్.. మా కష్టాలు దేవుడు కూడా తీర్చలేడు సార్. దేవుడు మా మీద పగబట్టిన్యాడు సార్. ఒక్కేడైనా పంట సరిగ్గా పండల్యా. వాన కురవదు. నీళ్ళులేవు. కన్నీళ్ళనే తాగుతున్నట్లుండాది. కుక్కని సూసి నక్కవాత పెట్టుకున్నట్ల ఒగరైతు యా పంట ఏస్తే, అందురూ అదే ఏస్తరు. ఎవునికి ధర రాదు. పోయినేడు అందురూ పత్తి ఏసినారు. క్వింట మూడు వేలు దాటల్యా. పంట మీద పెట్టిన పెట్టుబడి గూడా రాల్యా. తుంగభద్ర ఎల్లెల్సీ నానాయకట్టు కాలువ నీళ్ళు దొంగతనంగా కట్టుకుంటుంటమి. ఎగరాకి ఇంత అని కాలువోళ్ళకి డబ్బులిచ్చి కట్టుకుంటుంటిమి. ఇప్పుడు దాన్ని బంద్ సేపిచ్చినారు. నానాయకట్టు నీళ్ళు కట్టుకునే యా రైతు పైపులు నరకల్యా.. మా సేను పైపులొక్కటే నరికి కేసులు బెట్టినారు. మా నాయన తలా మూడెకరాలని సెప్పి సచ్చిపోయినాడు. మా తమ్మున్ని మా నాయిన సదివిచ్చినాడు. వాడు కూడా బాగా సదువుకున్నాడు. ఉద్యోగుం రాల్యా. ఉద్యోగుం వచ్చింటే వాన్ని ఈ ఊర్లోనే పెడుతుండ్యా. సదువుకున్నా సేను పన్లన్నీ చేసే వోడు. ఏ అలవాట్లు లేవు. ఊరికి ఏదన్నా సెయ్యాలని ఎప్పుడూ అనేటోడు. వానికి తెలీదు, ఊరికి ఉపకారం సేయగూడదు. పీనగకి సింగారం సేయగూడదని. వద్దన్నా వినకుండా ఎలచ్చన్లో పోటీ సేసినాడు. ఎలక్షన్లంటే లక్షలు గావల్ల. మన దగ్గర యాడుండావి. జనుం దుడ్లు తీసుకోకుండా ఎవురూ ఓటెయ్యరు. ఇక్కడ తీసుకుంటారు. అక్కడ దీసుకుంటారు. తీసుకున్నోడు మనకే ఏస్తరని గ్యారెంటీ లేదని శ్యానా సెప్తి సారు. వాడు ఇనక పాయా.” అంటూ కొనసాగించాడు.

“ఏయ్ నీకేం తెలుసు.. ఈ ఏడు యస్సీలకి వచ్చేద. ఈ అవకాశం మరిరాదు. మనూరు గౌడ గూడా సపోట్ సేస్తనని సెప్పేద్య. నీవు ఊకే ఉండు అని నన్నే గదిరిచ్చా. వాని మీద కర్సు పెట్టినట్లే పెట్టి.. మా తమ్ముడ్నే వెంటేసుకుని తిరిగి లోపుల్లోపుల అవుతులోళ్ళకి సపోటు సేసి ఊరి గౌడ మా ఓన్ని ఓడిచ్చ.. మా వోడు సదువుకున్నోడు. అన్నీ అడుగుతాడని గౌడకి తెలుసు. ఎవునికి తెలీకుండా.. సదువులేకున్నోన్ని ఎలచ్చన్లకి దింపి గెలిపిచ్చినాడు. వాడు బ్యాగరోళ్ళ పిల్లోడు. సర్పంచ్‌గ గెలిసినాంక కుర్సీలో కూసోలేకుంటే సాలు నిన్ను గెలిపిస్తను అని గౌడ వానితో కండీషన్ పెట్టినాడు. మా వోని పేరు మీద ఉన్న మూడెకరాలు ముందర ఆయకం సేసుకుని

ఎలచ్చన్లు అయిపోయినాంక మా వోని పేరు మీద ఉన్న ఆస్తి గౌడ పాలాయ. గెలిసిన బ్యాగరోళ్ళ పిల్లోడు ఈ పొద్దుటికీ కుర్సీలో కుసునేకి లేదు. వానిగ్గూడా గౌడ అప్పిచ్చినాడు కాబట్టి వాడిప్పుడు గౌడ యాడ సంతకం పెట్టమంటే ఆడ పెడుతుం డాడు. పెత్తనమంతా గౌడదే!"

"మా తమ్మునికి రాజకీయాలొద్దని సెప్పితి. వాడు ఇనలేదు. మనుం ఆస్తులు పోయినాంక సంపాదించుకునేల్లేమని సెప్పితి. నా భాగం నాకిస్తావా లేదా అని వాని భాగం వాడు తీసుకుని గౌడకి ఆయకం సేసిచ్చ. ఇంగేముండాది. వాడు మొన్న బంగారమ్మ ద్వావుర్లన కిందబడి సచ్చిపాయా. ఎవుని మీద కేసులు పెట్టినా ఏం లాభుం లేదు. అసలు పోలీసొళ్ళే కేసు తీసుకోరు. ఎవుడు ఎదురు తిరగితితే వాడు ద్వావుర్లన సస్తడనీ అందురికీ తెలుసు.'' అంటూ ఆవేదనగా చెప్పాడు హనుమంతు.

"అవును.. ఓడిపోయినాడు సరే. ఆ దుడ్లుకి సేను రిజిష్టర్ సేసిచ్చినాడు గదా. ఇంగ సంపాల్సిన అవుసురుమేమంటావు." అని మాధవ్ అడిగాడు.

"మా తమ్ముడు ఓడి పోయినాంక ఊరికే ఉండొచ్చు గదా. ఉండల్యా. ఓడిపోయినాను అనే బాధలో ఊర్లో గౌడ వాని మనుషులు సేసే ప్రతి పనికి అడ్డం తగులుతుండాడు. గౌడ ఊకే ఉంటాడా. ముందు మా సేన్లకి కాలువ నీళ్ళు కట్ సేపిచ్చ. కాలువొళ్ళు అందర్ని ఇడిసి పెట్టి మామీదే కేసులు పెట్టిరి. నా సేను ఎండి పాయా. మా తమ్ముని భాగము గౌడ తీసుకునేడ కాబట్టి నేళ్ళు పారుతుండావి. నాది బాగా పండిన సేను ఎండి పాయ. మా తమ్ముడు సేసిన పనికి నా సేను నాశనుం ఆయ. బాగా సేతికొచ్చిన వొరిపంట ఎండిపాయా. వానికి పెండ్లికాలేదు. నా దగ్గరే ఉంటుండ్య. నా దగ్గరే తింటుడ్య. వాడు పోయినాంక నా బతుకు నా సంసారుం సూసుకునల్ల గదా సారు. అందుకోసుమే సుగ్గికి పోవల్లని అనుకునేన్య. వేం బొయ్యేది గూడా గుంటూరుకే. మిరపకాయల సుగ్గి. ఆడ చేతి నిండా పని బాగా ఉంటాది. మెరపకాయలు తెంపేది. ఆడుకాంట పాడకాంట సేసే పని. ఆడ అడివి పందులెక్కువ. అడివి పందులు వేరే పంటల్ని నాశనం సేస్తాయి. మిరపని నాశనం సేయలేవు. ఈడ మాత్రం మన ఊరిని ఏలే పందులు మాత్రం మా బతుకుల్ని నాశనం సేస్తుండాయి. ఈ ఊరుకంటే శ్మశానుం మేలనిపిస్తది.. మా బతుకులింతే సార్.. సుగ్గి తప్ప ఏరే దారి లేదు సార్.. ఆడన్న కడుపునిండా తింటాము.." అనుకొంటూ కళ్ళల్లో నీళ్ళు బెట్టుకున్నాడు హనుమంతు.

"సుగ్గికి పోయిన కాడ యాడుంటారు." అడిగాడు మాధవ్.

"అడివిలో తార్పాలు గుడిసెలు ఏసిస్తారు. దాంట్లోనే ఉంటాము. సలి, వాన లెక్కల్యాకుండా బతకల్ల" అని సెప్పె హనుమంతు.

"అంత కష్టపడి ఉండేకన్నా ఈడే యాదో పని సేసుకోవచ్చు గదా?" మాధవ్ అడిగే ప్రశ్నలన్నింటికీ జవాబు చెప్పే ఓపిక కూడా హనుమంతుకు లేదు. శక్తంతా కూడగట్టుకుని మాట్లాడుతున్నాడు.

"ఈడ పంటలు పండియ్యల్యలంటే మనతో కాదు. వానలు పడకపోవడమొవడమొక ఎత్తైతే.. అసలు సేను పన్లకి కూలీలు దొరకడమే కష్టం. మేమిచ్చే మూడువందలకి కూలీలు దాకుండా ఉండేకి కారణుం ఉండాది. కూలొళ్ళు దావల్లంటే ఆటో వాళు సెప్తేనే వొస్తారు. ఆటోవోడు సెప్పిన రైతుపనికే కూలోళ్ళు పోతారు. వాడికి కూడా రైతే కమీషన్ ఇయ్యల్ల. ప్రతి కూలీ మనిషి మీద వానికి ఇరవై రూపాయలు కమీషన్. ఆటోచార్జీ గాని రైతే పెట్టుకునల్ల. పంట అంటావా.. ఇక చేతి కొచ్చే వరకు గ్యారెంటీ లేదు. పత్తికాయలో నాలుగింటిలో రెండు పాయల్ని పురుగు తినేస్తుంది. ఎన్ని మందులు కొట్టినా సావదు. రెండు వేలు రూపాయిలు లీటర్ పెట్టి కొన్న మందుకొట్టినా గులాబి పురుగు నాశనంగాదు. మూడునాలుగేండ్ల నుండి పత్తి ఏస్తూనే ఉండాను. ప్రతి ఏడు గులాబి పురుగు తింటుండాది. కంపెనివొళ్ళు గూడా మా బతుకుల్తో ఆట్లాడుకుంటుండా రనిపిస్సుంది" హనుమంతు సెప్తానే ఉన్నాడు.

"నీకు ఎన్నెకరాలుంది.. హనుతంతన్నా.."

"ఆరెకరాలు వుండ్యసారు.. మా తమ్మునికి మూడు నాకు మూడు.. వాందేమో గౌడ లాగేసకునేడ్య"

"ఈ ఏడు ఏమి ఏసింటివి"

"మనూర్లో అందురూ కనకాంబరాలేస్తే నేను గూడా ఏస్తి సారు. పత్తి మోసుం సేసేదని కనకాంబరాలేస్తే.. తొలేడు బానే వొచ్చా.. కాని ఈ ఏడు దళార్లెక్కువైరి. వాళ్ళకే అమ్మల్ల.. ఏంటికంటే పెట్టుబడికి వాడు దుడ్లిస్సుండాడు. వాడు సెప్పిన రేటుకే అమ్మల్ల.. పెట్టుబడికిచ్చిన దుడ్లకి వడ్డీ ఏసి ఇయ్యల్ల. కేజికి నూరు నూటా యాభై కంటే ఎక్కువియ్యరు. వాళ్ళేమొ బొంబాయి, బెంగుళూరుల్లో ఐదారు నూర్లుకు అమ్ముకుం టారు.. యాడసూసినా రైతే నాశనమైతుండాడు." అంటూ నిరాశగా మాట్లాడాడు.

రైతుకిన్ని కష్టాలా? ఒకపక్క ప్రకృతి శాపం. మరో పక్క తెగుళ్ళ శాపం. ఇంకోపక్క లేబర్ మాఫియా. ఇన్ని కష్టాల్ని రైతు ఎలా తట్టుకుంటాడో. మాధవ్‌కు అర్థం కాలేదు.

"ఎట్టన్న దయసూపండి" మళ్ళీ వచ్చిన పని గుర్తు తెచ్చుకున్న వాడిలా.. తువాల్తో కళ్ళ తడి తుడుసుకుంటూ

సెప్తనే ఉండాడు హనుమంతు.

"సర్లే.. నేను ఏదో ఒకటి చేసి హాజరేస్తాలే పో.. పాప జాగ్రత్త.." అంటూ 'మెరపకాయల పనికి ఎంతిస్తారు?" అని అడిగాడు మాధవ్.

"జతకి వెయ్యి రూపాయిలిస్తారు. నేను నా పెళ్ళాం మా చినపాప హారికకు కలిపి దినుంకి పదైదునూర్లొస్తాయి."

"మన వొళ్ళంతా గుంటూరుకే ఏంటికి బోతారు. ఇంతకుముందు బొంబాయి, బెంగుళూరుకి పోతుండ్రి గద." మాధవ్ తన సందేహాన్ని అడిగాడు.

"అవును సారు.. బొంబాయిలో శ్యాపల పని.. ఆ వాసనకి బువ్వ తినబుద్ధి గాదు. మురిక్కాలువల దగ్గరే జోపిడీలేసుకుని బతకల్ల.. ఆ బతుకు ల్యాకుంటే లేదని ఇడిసి పెడితిమి. వయసులో ఉన్న మొగపిల్లలందురూ సెడిపోయి రోగాలు తెచ్చుకుంటుండారు. మా అన్న కొడుకు చాపల లారీకి డ్రైవరుగా బోతుండ్య.. ఆదివారం సుట్టీ ఇస్తుండ్రి ఇంటికాడ ఉండకుండ. యాడో బోయి రాత్రికొస్తుండ్య.. వాడు కొన్నాళ్ళకి బాగా సుస్తీ అయి సచ్చిపాయా. బొంబాయికి పోయిన మనొళ్ళెక్కువ మందికి రోగము.. అది బాగయ్యే రోగుం కాదు" అంటూ చెప్పుకొచ్చాడు.

"మనోళ్లందరూ ఉండేది బొంబాయిలో ఎక్కడ" అని అడాగాడు మాధవ్

"వర్సోవా, మాడా, ధారావి, జుహు, మార్వేలలో మొత్తం మనోళ్ళ. రాయలసీమలో ప్రతి జిల్లావోళ్ళుండేది ఆడే.. ఆడ యాడ సూసినా మనొళ్ళే.." చెప్పాడు హనుమంతు.

బతుకు సమరంలో జీవితాలెలా అంతమౌతున్నాయో హనుమంతు మాటలు తేటతెల్లం చేస్తున్నాయి.

మాధవ్ కన్నీళ్లను అదిమిపట్టుకున్నాడు.

"గుంటూరు జిల్లాలో ఇంక ఏఏ ఊర్లకి సుగ్గికి పోతారు మనోళ్ళు." అనడిగాడు

"ఈ రాయలసీమ వొళ్లందురు గుంటూరు జిల్లా నిండా ఉండారు. మేం బొయ్యేది మాత్రుం వినుకొండ సుట్టుపక్కల సినసిన్న ఊర్లు. మెరప పంటే అందురూ ఏసేది. ఆ మెరపతోనే పెయింట్లు తయారు సేస్తరంట.."

"అవునా..!" అంటూ ఆశ్చర్యపోయాడు మాధవ్"

అప్పటి వరకు మాధవ్‌కు తెలీదు మెరప పెయింట్ పరిశ్రమకుపయోగ పడ్తదని.

హనుమంతు వెళ్ళిపోయాడు.

వాళ్ళ బతుకుల్ని మార్చే శక్తి మాధవ్‌కు లేదు. పిల్లలకు పాఠాలు మాత్రమే చెప్పగలడు. పాలకుల మీద ప్రజలకే మాత్రం నమ్మకం లేదు. ఎన్ని స్కీములొచ్చినా వడ్డించే వాడు మనవాడైతేనే మనం చివర గూర్చున్నా మనకన్నీ వస్తాయి. ఈ స్కీములు అంతే.. ఎవురధికారంలోకి వస్తే వాళ్ళకే అన్నీ.

మరుసట్రోజు గుంటూరు నుంచి వచ్చిన లారీలో అందరూ ఎక్కుతుండారు. హనుమంతు కుటుంబం కూడా ఎక్కుతాంది. హారిక లారీ ఎక్కేటప్పుడు ఏడో తరగతి ఆడపిల్లందరూ ఏడుస్తుండారు. లారీ కదులుతుంటే హారిక్కూడా కళ్ళనిండా నీళ్ళు. కాలవల్లా పారుతున్నాయి. ■



## శాంతి

**కు**దురుగా కూర్చోలేవు
బెదురుగా చూస్తుంటావు
కానీ
ఒద్దికగా మాట్లాడతావు

ఎన్నో ప్రశ్నలకు
జవాబులు రాసి
సాయంత్రం
పక్షుల వరుసలో పక్షిలా చేరి
హాయిగా రెక్కలు ఆడిస్తుంటావు

ప్రతి కదలికలో
ప్రేమ స్పర్శ ధ్వనిస్తూ
ఒక శాంతి!

**- లక్ష్మీ కందిమళ్ళ**
89196 99815






# బలివాడ కాంతారావు జీవితం - సాహిత్యం

- బొడ్డపాటి చంద్రశేఖర్
63003 46501

**తె**లుగు సాహితీ సాహిత్య యవనికపై కథ, నవల, నాటక, వ్యాస ప్రకియల్లో అద్భుతమైన సృజన చేసిన రచయిత బలివాడ కాంతారావు. ఆయన దాదాపు 400 కథలు, 32 నవలలు, అనేక దృశ్య, శ్రవ్య నాటకాలు సృజియించారు. ఆయన 1927 జులై 3వ తేదీన శ్రీకాకుళం జిల్లా మడపాం గ్రామంలో పుట్టారు. కాంతారావు గారి మీద తన తండ్రి, గురువుల ప్రభావం కన్నా తాతయ్య రామమూర్తి ప్రభావం ఎక్కువ.

తాతయ్య చెప్పిన రామాయణ, భారత కథలు, నక్షత్ర, గ్రహాల గాథలు బలివాడ గారికి భారతీయ తత్వాన్ని చూపించింది. దాన్ని తన రచనల్లో అవసరమైన సందర్భాల్లో చాలాసార్లు వాడుకున్నారు. ఉద్యోగరీత్యా ఉత్తర భారతంలో తన జీవితంలో ఎక్కువ భాగం గడపిన వారికి భారతీయ జీవనంలోని వైవిధ్యత, విశిష్టత, విభిన్న ఆచారాలు, సంస్కృతులు అర్థం చేసుకునే అవకాశం వచ్చింది. అప్పటికే వారిలో ఉన్న విస్తృతాధ్యయనానికి పరిశీలన తోడైంది. గొప్ప రచనలు చేసే అవకాశమిచ్చింది. చిన్నప్పుడు విశాఖపట్టణంలో ఐదవ తరగతి చదవటానికి తన మేనమామ కరకవల్స అప్పారావు గారింటికి వచ్చారు ఆయన. అత్తయ్య అక్కున చేర్చుకుని చెప్పిన కథలు సాహిత్యం పట్ల అభిరుచిని కలిగించాయి. అందుకే ఆమెకొక పుస్తకాన్ని అంకితం చేశారు బలివాడ.

కుటుంబ బాధ్యత మోస్తున్న నాన్నకు ఒకింత ఆసరా అవుదామని పదవ తరగతితో చదువుకు స్వస్తి పలికి, విశాఖపట్నం ఆర్డినెన్స్ డిపోలో గుమస్తాగా చేరారు కాంతారావు. కొంతకాలానికి దూర ప్రాంతానికి బదిలీ అయితే, అంత దూరం పంపటానికి తండ్రి ఇష్టపడలేదు. దాంతో ఉద్యోగం పోయింది.

అప్పుడు స్వగ్రామానికి చేరుకొని, గ్రంథాలయంలోని జంపన, కొవ్వలి నవలలు చదివిన స్ఫూర్తితో 'శారద' అనే నవల రాశారు. అది 'చిత్రగుప్త'లో ధారావాహికగా వచ్చింది. అది ఆయన మొదటి రచన. 1947లో 'పరివర్తన' అనే కథ రాశారు. అన్ని ప్రముఖ పత్రికలతో పాటు 'భారతి'లో కూడా వారి రచనలు ప్రచురితం కాసాగాయి.

కాంతారావు గారి పాత్రలు నేల విడిచి సాము చేయవు. ఈ లక్షణమే ఆయనకొక ప్రత్యేక గుర్తింపు నిచ్చింది. విశాఖలోని హిందూ రీడింగ్ రూమ్, గ్రంథాలయం, విశాఖ రచయితల సంఘం, ఆనాటి సుప్రసిద్ధ సాహితీవేత్తలైన పురిపండా అప్పలస్వామి, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, అంగర వెంకట కృష్ణారావు, అంగర సూర్యారావు, శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావుల ప్రసంగాలు, వారి సాంగత్యం బలివాడవారికొక ఊపు, లోచూపులనిచ్చాయి. ఆయనలోని సాహితీ మూర్తిమత్వాన్ని తీర్చిదిద్దాయి. విక్టర్ విగో, డాస్టవిస్కీ, టాల్ స్టాయ్, మార్క్ ట్వైన్, అనటోలే ఫ్రాన్స్, పెరలెస్ బక్, హెర్మన్ హెసేల రచనలు చదివి ఆయన విశ్వ సాహిత్యాన్ని అవగతం చేసుకున్నారు.

బలివాడకు కేంద్ర సాహిత్య పురస్కారం వచ్చిన 'బలివాడ కాంతారావు కథలు' అన్న పుస్తకం ముందుమాటలో ఆయనిలా రాశారు : "అమెరికాలో ఒక నాలుగు నెలల పాటు గడిపి, వాళ్ళ జీవన సరళిని అర్థం చేసుకుని వాళ్లలో ఉండే కొన్ని సుగుణాలు నా దేశంలో ఉంటే బాగుండేదనిపించింది. ఆ సంపన్న దేశంలోనూ వాళ్లకున్న కష్టాలు చూసి మనిషి ఎక్కడున్నా, ఏ విధంగా బతికినా మానవులంతా ఒక్కటే అనిపించింది. ఇప్పుడు నాకు నా పల్లె, నా పట్నం, నా దేశం ఏ ఒక్కటీ కాదు ముఖ్యం. ఈ విశాల విశ్వం చెడు ఎక్కడ

జరిగినా బాధపడ్తాను : ఏ మంచి జరిగినా ఆనందిస్తాను...” బలివాడ కాంతారావనే మనిషి మనీషిగా ఎదిగాడని చెప్పటానికి ఈ మాటలే నిదర్శనం. ఈ విశ్వమానవ కల్యాణ భావనే బలివాడను గొప్ప రచయితను చేసింది.

కాంతారావు గారు కథలకు ప్లాట్స్, పాత్రల చిత్రణ, వాటి వివరాలను ఇంగ్లీష్‌లో రాసుకునేవారు. పదవ తరగతి వరకే చదివిన ఆయన ఇంగ్లీష్ రాయటం ఓ గొప్ప విశేషమే. గురజాడ అప్పారావు గారికి ఆ అలవాటు ఉండేది. ఆలోచన మెదలగానే అతి తక్కువ సమయంలోనే దానికి అక్షర రూపానివ్వగలిగే శక్తి వీరికుంది. భారతీయ భాషాసాహిత్యాలతోనూ, విశ్వ సాహిత్యంతోనూ వారికున్న పరిచయం వారి సాహితీదృష్టిని ఎంతో విశాలపరిచింది. వీరి రచనలు హిందీ, తమిళ, కన్నడ, గుజరాతీ, ఒడియా ఆంగ్లభాషల్లోకి అనువాదమయ్యాయి. వీరి నవల సంపంగి హిందీ, కన్నడ భాషల్లోకి; ఇదే నరకం – ఇదే స్వర్గం... నవల హిందీ, ఇంగ్లీష్‌ల్లోకి వెళ్లాయి. వీరికి మంచి గుర్తింపు తెచ్చిన ‘దగాపడిన తమ్ముడు’ నవలను నేషనల్ బుక్స్ ట్రస్ట్ వారు అన్ని భారతీయ భాషల్లోనూ అందించారు. ‘అడవి మనిషి’ నాటకం జాతీయ కార్యక్రమంగా ఆకాశవాణిలో అన్ని భారతీయ భారతీయ భాషల్లోనూ ప్రసారమైంది. 1972లో ‘పుణ్యభూమి’ నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1986లో ‘వంశధార’ నవలకు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాలు లభించాయి.

### తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకున్న సంతానం

బలివాడ కాంతారావు గారి తనయలు ఉష, సుజాత, కవిత. రెండవ కుమార్తె సుజాత తమ తండ్రి సాహిత్యాన్ని ఈ తరం వారికి అందించే ప్రయత్నం చేసి గొప్పగా కృతకృత్యులయ్యారు. ఆమె వత్తిరీత్యా ఇంగ్లిష్ ప్రొఫెసర్. కాంతారావు గారి నవలలు గోవాలో ప్రేమను ...Maansoon showers in Goa గానూ, మత్స్యగంధిని ...The Mythical Mermaid గానూ, సంతృప్తి రహస్యం మరికొన్ని కథలను... The Secret Of Contentment గానూ సాహిత్య అకాడెమి కోసం ఇంగ్లీషులోకి అనువదించారు. కుమారుడు అశోక్ తమ తండ్రి సాహిత్యం మొత్తం లభ్యమైనంతవరకు వెబ్ సైట్లో ఉంచారు. బలివాడ వారి సృజన మీద పిహెచ్‌డి చేయాలనుకునే ఔత్సాహికులకు ఆయన చేసిన కృషి చాలా ఉపయోగకరం.

బలివాడ వారి శ్రీమతి శారద గారు పుట్టుక, చదువు అంతా ఒరిస్సాలోనే. తెలుగు భాషా పరిచయం అంతగా లేదు. వివాహమైన పిమ్మట తన భర్త సాహితీ ప్రకాశాన్ని చూసి తెలుగును పట్టుదలతో నేర్చుకొని వారి రచనలను చదివి, విశ్లేషించే స్థాయికి ఎదిగారు. భర్త మరణానంతరం వారి అముద్రిత రచనలను వెలుగులోకి తెచ్చారు.

### బలివాడ కథల విశ్లేషణ

బలివాడ కాంతారావు గారికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం సంపాదించి పెట్టినవి వారి కథలు. ఆ కథా సంపుటిలో మొత్తం 33 కథలు ఉన్నాయి. నా విశ్లేషణకి ఐదు కథలు ఎంచుకున్నాను.

**చక్రతీర్థ :** ఈ కథలో ప్రధాన పాత్ర శ్రీధర్. కలెక్టర్. తన ఉన్నతికి కారకుడైన తన తండ్రి సుదర్శన్ పండాను కలవటానికే కాదు, కనీసం మాట్లాడటానికి కూడా ఇష్టపడడు. కారణం... తన తండ్రి ఒక చేత్తో బెత్తంతో కొడుతూ మరో చేత్తో భక్తుల దగ్గరనుంచి డబ్బు గుంజేవాడు. ఎవరైనా ఇవ్వకపోతే నానా దుర్భాషలాడేవాడు. ఇది నచ్చని శ్రీధర్ తండ్రిని అసహ్యించు కుంటాడు. ఓసారి చూడటానికి వెళితే ... “... ఎంత పైకి నువ్వు ఎదిగావన్నది కాదు ముఖ్యం. ఏమి సాధించావన్నది ముఖ్యం. వెళ్ళు – నాయనా –వెళ్ళు’ అంటూ ముఖం తిప్పేస్తాడు కొడుకు దురుసు ప్రవర్తనకు అతలాకుతలమైన మనస్సుతో. కొంతకాలానికి తన తండ్రి చనిపోయిన తరువాత ఒక ఉత్తరం అందుకుంటాడు శ్రీధర్. దాని సారాంశం : “మంచం మీద ఉన్న నన్ను చూడటానికి వచ్చిన నిన్ను చూసి, వీడికి తండ్రి గుర్తున్నాడని సరదా పడ్డాను. వచ్చిన వాడు నా ఇంట్లో దిగలేదు. కనీసం తినమన్నా తినలేదు. ఆ క్షణంలోనే నాకు కొడుకు లేడనుకున్నాను.” శ్రీధర్ చక్రతీర్థలో పుట్టిపెరిగి, అంత అధికారం చేపట్టి, ఆ వీధినే అసహ్యయించుకున్నాడు. తండ్రిని ద్వేషించాడు. ఆ తండ్రి సంపాదనా పునాది మీదే తను పెరిగానని, గొప్ప భవిష్యత్తు పొందానన్న విషయాలు విస్మరించాడు. తండ్రినుండి అంత ప్రేమను పొంది, అవసరపడిన వేళ దాన్ని ఆయనకు పంచలేకపోయాడు. ఉత్తరం చదివిన శ్రీధర్ పశ్చాత్తప్తుడై, కుమిలిపోతాడు

**మనిషి – పశువు :** ఒక తాగుబోతు డ్రైవర్ ప్రధాన పాత్రగా సాగే కథ ఇది. గవర్నమెంటు ఉద్యోగం. తరచూ గైరుహాజరే. అతనంటే భయంతో మాట్లాడే సాహసమే చేయలేదు ఏ ఆఫీసర్. కొత్తగా వచ్చిన ఒక ఆఫీసర్ అతన్ని సంస్కరించే ప్రయత్నం చేస్తాడు. అతన్ని మనిషిని చేసే క్రమంలో ఎన్నో చేదు అనుభవాలు ఎదురవుతాయి. ఓరోజు అతడి పెళ్ళాన్ని ఎవరో తక్కువ చేసి మాట్లాడారని, అందుకు వాళ్ళని చావబాదానని చెప్పి ఆ పోలీస్ కేసునుంచి బయట పడేయమని వేడుకుంటాడు డ్రైవర్. ఆఫీసర్ అతని మీద జాలితో ఆ సహాయం చేస్తాడు. అప్పటినుండి తాగుడు మాని కొత్త జీవితం ఆరంభిస్తాడు. పశువు లాంటివాడు మనిషిగా మారాడు.

ఒకరోజు రాత్రి దడ దడ తలుపు శబ్దం. తీసి చూసిన ఆఫీసర్‌కి ఎదురుగా కమీజంతా రక్తపు మరకలతో తాగుబోతు డ్రైవర్ నాథూరామ్ పాటిల్.

ఇద్దరి మధ్య సంభాషణ.

"ఏం చేసావ్?" అన్నాను

వాడు రక్తంతో నిండిన బాకు కమీజు నించి తీసి నా వైపు చూస్తూ – "నేను పశువుగా ఉండేవాణ్ణి. మీ దయతో మనిషి నయ్యాను. నా జీతం, నా ప్రేమ, నా బతుకంతా దానికివ్వటం మొదలుపెట్టినా అది పరాయి వాళ్ళతో పోవటం మానలేదు. దానిని పొడిసేశాను" అంటూ ఆఫీసర్ కాళ్ళ మీద పడిపోయాడు.

చెడు తనలోనే కాదు, ఎక్కడున్నా, ఎవరిలో ఉన్నా సహించలేని మానసికస్థితికి చేరుకున్నాడు. భార్యను చంపేసాడు. మంచితనం ముసుగులో మనుషులు ఎలా ప్రవర్తిస్తారో చెప్పే కథ ఇది. ఎవరు మనిషి, ఎవరు పశువు? మీరు చెప్పండి అంటూ పాఠకులనే ప్రశ్నించారు రచయిత.

**దానం** : గిరిధరరావు డబ్బున్నవాడు కాదు కానీ, ఉన్నంతలో అవసరమైనవారికి దానం చేసేవాడు. అటువంటి గిరిధరరావుకి ఇప్పుడు భార్య భానుమతి ప్రాణం నిలబడాలంటే ఆమెకు 'మూత్ర పిండాలు' కావాలి. దాతల కోసం పేపర్‌లో ప్రకటనిచ్చాడు. రాజమండ్రి నుంచి చిట్టెమ్మ అనే ఆమె వచ్చి, దానం చేసి, అవసరమైన విశ్రాంతి తీసుకుని ఊరు వెళ్ళిపోవటానికి ఉద్యుక్తురాలవుతోంది. ఒక్కతనే పంపటం ఇష్టంలేక ఆమెతో రాజమండ్రి వెళతాడు గిరిధరరావు. చిన్న ఇల్లే, కాని ఎంతో పొందికగా ఉంది.

తనను పోల్చుకోలేని గిరిధరారావుతో ఆమె అతని స్నేహితుడి భార్య సుశీలనని, తమ ఇంటికి వచ్చే గిరిని భర్త కావాలని అప్పుడు కోరుకున్నానని చెబుతుంది. అప్పటికి గిరికి పెళ్లి కాలేదు. తన భర్తకు మూత్రపిండం అవసరమైతే, ఇవ్వడానికి ముందుకొచ్చాడు. మిత్రుడ్ని చూడటానికి వచ్చే గిరి ఆమెను చూసి ఆకర్షితుడై ఆమె పొందు కావాలని.. మిత్రుడు చనిపోయిన తరువాత... ఆమెను అడగబోయి మర్యాద కోసం దాన్ని అణచుకున్నాడు. ఆ మిత్రుడి భార్యే... సుశీల. తన భార్యకు మూత్రపిండం దానం చేసి తన ఇంటి దీపాన్ని కాపాడింది.

గిరి ప్రేమానురాగాలు అనే ఫలితం ఆశించే అతని భార్యకి ఈ దానం చేసానని సుశీల వివరణ ఇచ్చింది. అతణ్ణి పెళ్లి చేసుకోపోయినా ఈ దానం ద్వారా తనకవి దక్కినట్టే. ఇన్నాళ్లకు తన కోరిక ఇలా నెరవేరిందని అంటుంది. ఇద్దరిలో భావోద్వేగం పెల్లుబుకుతుంది. వయసులో వారి మనసులో కలిగిన ఆ సహజ కోరికను రచయిత ఎంతో ఉదాత్తంగా మలచి ఈ దానంతో వారి మనసులను ప్రక్షాళన చేశారు.

**ముంగిస :** "1969లో మా గ్రామం వెళ్లాను. పొరుగున ఉన్న మా మేనమామ ఇంట్లో మువ్వల శబ్దంతో తిరుగుతున్న ముంగిస పిల్లను చూసాను. 'ఏం బాబూ, అలా చూస్తున్నారు. దీని మీద ఒక కథ రాసేస్తారా?' అంది మేనత్త. మరుసటి రోజు ఉదయం పదిగంటల కల్లా కథ రాసి వినిపించాను. ఆవిడ కళ్ళల్లో నీరు చూసి మంచి కథే అనిపించింది." అని ముంగిస కథకు ప్రేరణగా నిలిచిన సంఘటన గురించి చెప్పారు కాంతారావు.

ఆ కథ సారాంశం ఇదీ : ఒక ఎలకలవాడు అప్పారావు అనే డాక్టరు గారి ఇంట్లో ఎలకల బాధ నుంచి విముక్తి పొందేందుకు ఒక ముంగిసనిస్తాడు. 'మూడు మువ్వలు దాని మెడలో కడితే ముంగిస జాతి దీన్ని వెలి వేస్తుంది. అప్పుడు ఈ ఇంటిని వీడక మీకు మాలిమవుతుంది, దొరా" అని చెబుతాడు. డాక్టరు అలాగే చేస్తాడు. అది బాగా మాలిమై పెరిగి పెద్దది అవుతుంది. రొట్టెముక్క, పంచదార , పాలు, మురిపాలు... వీటితో సొంత బిడ్డలా సాకటం మొదలుపెట్టారు. దానికి బయ్యన్న అని పేరు పెట్టారు. ఇల్లంతా తానై తిరగాడే ఆ బయ్యన్న ఆ డాక్టర్ గారి కుటుంబ సభ్యుడయ్యాడు. అలా సాగిపోతున్న అనుబంధానికి ఒక పెద్ద విఘాతం భైరవయ్య. వీళ్ల ఆర్థిక పరిస్థితికి ఈర్ష్య. చచ్చిన తన అయిదు తన కోడిపిల్లల్ని వీళ్ల ముందు పడేసి 'చూడు, మీ బయ్యన్న పని' అని హుంకరించాడు ఒకరోజు. డబ్బులిమ్మని దబాయించాడు. డాక్టరు ససేమిరా అన్నాడు. పది రోజులు తరువాత ఏదో బాధతో తన దగ్గరకు వచ్చిన భైరవయ్యకు పైసా తీసుకోక, వైద్యం చేసాడు డాక్టరు, గొడవ మరచిపోయి. కాని భైరవయ్య మరువలేదు. ఒకసారి డాక్టర్ కుటుంబం పట్నంలో ఉన్న కూతుర్ని చూడటానికి వెళ్ళిన వేళ ముంగిసను చంపేస్తాడు. తిరిగొచ్చిన డాక్టరు దంపతులు బయ్యన్న జాడ తెలియక తల్లడిల్లిపోయారు. బయ్యన్నను చంపిన భైరవయ్యలో తప్పు చేసిన భావం పెరిగి మనోవ్యాధితో మంచమెక్కుతాడు.

ఈ కథ చదివిన పాఠకుల హృదయం బరువెక్కుతుంది. కన్నుల ముందు బయన్న రూపం, దాని ఘల్లు ఘల్లుమనే శబ్దం వారి చెవులకు వినిపిస్తూనే ఉంటుంది. ఆ పాత్రను అంత గొప్పగా మలిచారు రచయిత.

**దృష్టి :** విశ్వనాథం ఆంగ్ల సాహిత్యంలో పోస్టు గ్రాడ్యుయేట్. ఒక ప్రైవేటు కంపెనీలో పెద్ద ఉద్యోగం. అతని దృష్టిలో తండ్రి

ఒక అజ్ఞాని. గిట్టే దశ వచ్చినా ఒక్కడినైనా ఉంటానని, ఆ పల్లెను వీడనని భీష్మించుకున్న పరమ మూర్ఖుడని విశ్వనాథం అవగాహన. విశ్వనాథం కొడుకు రమేశ్. తనను పైచదువుల కోసం అమెరికా పంపిస్తాడు. విశ్వనాథం తండ్రి .. తను చనిపోతే కర్మకాండలన్నీ తాను ఆచరించిన మత పద్ధతుల్లోనే జరపాలని కొడుకును ముందుగానే కోరతాడు. 'నా కోర్కెను మరచిపోకు. అప్పుడు నా మాట పడిపోతే చెప్పలేనేమోనని ముందుగా ఇప్పుడే చెప్పేస్తున్నాను.' అంటాడు. ఆ మాటలు తేలికగా తీసుకుని నవ్వుకుంటాడు విశ్వనాథం.

చాలా కాలంలో ఊరు వెళ్లటం మానేసిన విశ్వనాథం ఒకసారి వెళ్ళినప్పుడు.. తండ్రి పరమానందభరితుడవుతాడు. మాట్లాడిన తరువాత "నాయనా! శలవై పోయిందిరా!" అంటూ తల వాల్చేసాడు. ఊరు ఊరంతా చేరుకుంది. ఒక పెద్దాయన చొరవతో అంతా తండ్రి కోరుకున్నట్టే జరిగింది. తన ప్రమేయం లేకుండా క్రతువు జరిగిపోయింది. అప్పుడు తను పొందిన అనుభూతిని కొడుక్కి ఉత్తరంలో రాస్తాడు విశ్వనాథం. "నా తండ్రిని బతికుండగా తెలుసుకునే దృష్టి నా చదువు నాకివ్వనిది.. అతను బూడిదై నాకు ప్రసాదించాడేమో" అని రాసాడు.

సాధారణంగా రచయితలు ఇక్కడ కథను ముగిస్తారు. కాని, బలివాడ ఇక్కడే ఈ కథకు ఓ అద్భుతమైన మలుపు నిచ్చారు. అది రమేశ్ చేత సమాధానం ఇప్పించటం. దాని సారాంశం : "మీ తండ్రిని మీరు ఆయన చావు తరువాతే తెలుసుకున్నారు. మీకు ఎప్పుడూ పరభాషా వ్యామోహమే! కాని తాతయ్య నాకు తెలుగు భాష నేర్పారు. భారతీయ చింతన, సంస్కృతుల గురించి చెప్పి భారతీయ దర్శనం చేయించారు. నా జాతి దృష్టితో, ఇక్కడ వీళ్ళ భాష సహాయంతో ఇక్కడ ఈ జాతి ఆలోచనా సరళి, జీవితం విధానం, సంస్కృతిని చూస్తున్నాను. ఈ రెండు సంస్కృతుల రాపిడిలో ఏ ఒక్క అగ్నికణం రాలి ప్రకాశించినా అది నా దృష్టిని తేజోవంతం చేస్తుందని నమ్ముతున్నాను." మాతృభాషను, జీవనానికి అవసరమైన భాషలను అర్థం చేసుకోవలసిన తీరును, సంస్కృతులను ఎలా చూడాలో మనకందరకూ దృష్టిని కలిగించే కథ ఇది.

కథను సూటిగా, క్లుప్తంగా, రక్తిని కట్టిస్తూ చెప్పగల గొప్ప రచయిత. నిగర్వం, నిరాడంబరత, నిజాయితీ, నిబద్ధతలు వ్యక్తిగాను రచయితగానూ ఉన్న రచయిత బలివాడ.

■



# సమీకరణం

- తండ హరీష్ గౌడ్

89784 39551

**పి**ల్లి ఎలుకను తినేది కాదు
ఎలుకే పిల్లిని తినేది
ముంగీస పామును మింగేది కాదు
పామే ముంగీసను మింగేది
గద్ద కోడిపిల్లనెత్తుకపోయేది కాదు
కోడిపిల్లే గద్దనెత్తుకపోయేది

పురుగు మొక్కను
తొలిచేది కాదు
మొక్కే పురుగును తొలిచేది
తుపాను తీరం దాటేది కాదు
తీరమే తుపానును దాటనివ్వకపోయేది
దుఃఖాన్ని సుఖంగా మలిచేది
చీకటిని వెలుగుగా పూయించేది
కలవని దిక్కులను కూడా
ఒక్కటి చేసేది
నిప్పును నీరుగా ఒంపేది
అలలను కలలుగా తూచేది

శిల్పమే ఉలిని చెక్కే
ఒకానొక అధునాతన
అరుదైన సమీకరణం కావాలి
భూమిని సమంగా
బాధ్యతగా మోసే వ్యక్తుల్లాంటి
అసలుసిసలు సమీకరణం
నాకొకటి కావాలి!

■





# సాహితీ ఆతిథ్యం

- ఎస్. హనుమంతరావు
88978 15656

**నం**దమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, తరచు కాంగ్రెసేతర పార్టీల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసేవారు. వీటికి దేశం నలుమూలల నుంచి ప్రతిపక్ష నాయకులు ఉత్సాహంగా వచ్చేవారు. ఈ సమావేశాలపై ఒకసారి కాంగ్రెస్ నాయకుడు జలగం వెంగళరావు వ్యాఖ్యానిస్తూ 'ఎన్టీయార్ ఇచ్చే విందులకు ఆకర్షితులై నాయకులు వస్తున్నారు తప్ప... అంతకంటే ఏం లేదు' అన్నారు. ఆ రకంగా ఆ సమావేశాల విలువను చులకన చేయడం జలగం ఉద్దేశ్యం. ఈ కామెంట్‌ని అంత సీరియస్‌గా ఎవరూ తీసుకోకపోయినా, సమావేశాల విజయంపై ఆతిథ్య పాత్రను మరీ తేలిగ్గా తీసుకోలేం. ఇది రాజకీయ సమావేశాలకే పరిమితమైన విషయం కాదు. సాహితీ సమావేశాలు, సంబరాల విషయంలోనూ విందుల, ఆతిథ్యాల ప్రాధాన్యత తక్కువని అనలేం.

డెబ్బయి, ఎనభై దశకాల నాటి సాహిత్య సమావేశాలకు జనం బాగా వచ్చేవారు. చప్పట్ల హోరు... ఆత్మీయ కరచాలనాలు... కొత్త పరిచయాల మధ్య సభలు ఉత్సాహభరితంగా జరిగేవి. అయితే వచ్చిన వారికి తాగడానికి మంచినీళ్ల ఏర్పాటు కూడా ఉండేది కాదు. ఇక కాఫీ, టీల గురించి చెప్పనక్కరలేదు. ఎనభైల్లో భాగ్య నగరంలో బొగ్గుల కుంట ఆంధ్ర సారస్వత పరిషత్ (ఇప్పటి తెలంగాణ సారస్వత పరిషత్) హాల్లో ప్రతి నెలా మొదటి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు కె.కె.రంగనాధాచార్యుల అధ్యక్షతన సాహిత్య సభలు జరిగేవి. ఆ సమావేశంలో కచ్చితంగా తేనీరు, ఉస్మానియా బిస్కట్లు ఇచ్చేవారు. అప్పటికి అదో కొత్త పద్ధతి అని చెప్పాలి. ఎందుకంటె మిగతా సభల్లో ఇలాంటి ఏర్పాట్లు ఏమీ ఉండేవి కావు. 2000 సం.తర్వాత హైదరాబాద్‌లో టి.వి. టవర్ దగ్గర ఉండే ప్రసిద్ధ సాహితీవేత్త సి.వి. క్రిష్ణారావు గారి ఇంట్లో 'నెలా నెలా వెన్నెల' పేర సభలు నిర్వహించేవారు. వారు తేనీరు సరఫరా చేస్తే.. సభకి వచ్చినవారిలో ఎవరో ఒకరు స్వీట్లు తెచ్చి అందరికీ పంచేవారు.

ఇప్పుడు పరిస్థితి మారింది. ఏ సభ జరుగుతున్నా కనీసం టీ అయినా ఇస్తున్నారు. దీనికి తోడుగా సమోసా, మిక్చరు, బిస్కట్లు ఇవ్వడం మొదలైంది. విశాఖలో ఒక సాహితీ సంస్థ వారు నిర్వహించే సమావేశానికి వచ్చేవారికి గోదావరి జిల్లా మార్కు కాజా, మిక్చర్ తప్పనిసరి. సమావేశకర్తే వచ్చిన అందరికీ 'స్నాక్స్ తీసుకోండి' అంటూ అతిథి మర్యాద చేస్తుంటారు ఆప్యాయంగా. భాగ్యనగరంలో జరిగే 'కవి సంగమం' సభల్లో సైతం ఈ సంప్రదాయం ఉంది.

సొంత డబ్బులతో పుస్తకాలు వేసుకుని, వాటి ఆవిష్కరణ సభలు పెట్టుకునే సాహితీకారులకి ఈ ఆతిథ్యంతో అదనపు ఆర్థిక భారం పడుతోంది. స్టార్ హోటళ్లలో పెట్టే సాహితీ సమావేశాలకు కచ్చితంగా హాజరయ్యేవాళ్లు కొందరున్నారు. దీనికి కారణం ఊహించడం పెద్ద కష్టం కాదు. సభలు రెండు పూటలా వుండే కార్యక్రమానికి 'మధ్యాహ్న భోజన పథకం' తప్పనిసరి. సభకి వచ్చినవారు లంచ్ టైంలో భోజనం చేస్తూ సాహితీ చర్చలు జరుపుతూ ఉంటారు. ఎనభైల్లో రవీంద్ర భారతిలో ఓ సాహితీ సమావేశం జరుగుతోంది. దానికి ఒక

ప్రముఖ సినీ కవి ముఖ్య అతిథిగా వచ్చారు. ఆయనకి ఒకప్పు డు నాటకకర్తగా సాహితీ ప్రపంచంలో మంచి పేరుండేది. చాలా రోజుల తర్వాత ఇలాంటి సభలకి వచ్చేరేమో, మంచి 'జోష్'లో వుండి, సభలో వున్న వారందరికీ పక్కనే వున్న త్రీ స్టార్ హోటల్లో భోజనం ప్రకటించారు. కొద్ది నిమిషాలకి చిన్న సవరణ వచ్చింది. దగ్గరలో వున్న ఓ ఉడిపి హోటల్‌కి ఆతిథ్య స్థలం మారింది. ఆ రోజుల్లోనే హైదరాబాద్ రాంకోటిలో ఒక కళాశాల హాల్లో ఒక బీద సాహితీ సంస్థ మే నెలలో ఓ ఆదివారం సమావేశం ఏర్పాటు చేసింది. కార్యక్రమం పెద్దది కావడం, ఆలస్యంగా ప్రారంభం కావడంతో, భోజన సమయానికి సరిగా సగం కార్యక్రమం ముగిసింది. భోజన విరామం ప్రకటిస్తే, మళ్లీ మధ్యాహ్న కార్యక్రమానికి జనం వచ్చే పరిస్థితి లేదు. అంచాత దగ్గరలోని ఓ ఇరానీ హోటల్‌లో పప్పు, కూర, చారులతో అందరికీ భోజనం పెట్టించారు. అంత మందికి భోజనం ఏర్పాటు చెయ్యడం నిజంగా భారమే ఆ సంస్థకి.

పూర్వం సంపన్న గ్రామాల్లో కొంచెం అభిరుచి వున్న పెత్తందార్లు సాహితీ సాంస్కృతిక సభలు ఏర్పాటు చేస్తే అపూర్వమైన ఆతిథ్యం ఇచ్చేవారు. అభ్యుదయ కవి ఆవంత్స సోమసుందర్ తన అసంపూర్ణ ఆత్మ కథలో ఇలాంటి సందర్భాన్ని ఉటంకించారు. పిఠాపురం సమీపంలోని ఓ మారుమూల గ్రామంలో రెండు రోజుల పాటు సాహితీ సమావేశాలు ఏర్పాటు చేశారు గ్రామస్తులు. ఆ సభలో ముఖ్య అతిథిగా దేవులపల్లి క్రిష్ణశాస్త్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ఊరి పెద్దలు ఇచ్చిన విందు 'న భూతో న భవిష్యతి' అన్న చందంగా ఉండటంతో క్రిష్ణశాస్త్రి గారు ఆ తర్వాత చాలాసార్లు ఆ సభకి ప్రధాన కారకుడైన సోమసుందర్‌ని మెచ్చుకునేవారట. గడియారం రామక్రిష్ణశాస్త్రి గారి ఆత్మ కథ 'శతపత్రం'లో కూడా ఇలాంటి విషయమే ప్రస్తావనకు వచ్చింది. ఆలంపురంలో ఏర్పాటు చేసిన సాహితీ సభలకి అక్కడి ఊరి పెద్దలు అద్భుతమైన ఆతిథ్యం ఇచ్చారట.

ఇరవయ్యో శతాబ్దపు మొదటి సంవత్సరాల్లో విశాఖపట్నంలో ఒక సాహితీ సమావేశం జరిగింది. దానికి ఆంధ్ర దేశంలోని ఉద్దండులైన అనేకమంది సాహితీవేత్తలు వచ్చారు. మధ్యాహ్నం వేళ భోజనాలు పెట్టారు. ఆ సమావేశానికి కుర్రవాడైన అబ్బూరి వరద రాజేశ్వరరావు హాజరయ్యారు. హాల్లో అప్పటికే పెద్దవారు అంతా భోజనాలు చేస్తున్నారు. ఆకలికి తాళలేక తనకు భోజనం పెట్టమని మారాం చేస్తున్న వరదని, స్థలం లేక వసారాలో కూర్చోమన్నారు. అప్పటికే అక్కడ ఒక పెద్దాయన భోజనం చేస్తున్నారు. వరద వెళ్లి ఆయన పక్కనే కూర్చున్నాడు. భోజనం చేస్తూ 'ఎవరబ్బాయివి బాబూ?' అని అడిగారు ఆ పెద్దాయన. 'అబ్బూరి రామక్రిష్ణరావు గారి అబ్బాయిని' అని వినయంగా చెప్పాడు వరద. మిగతా పెద్దలతో పాటు కాకుండా విడిగా భోజనం చేస్తున్న ఆ పెద్దాయన ఎవరో కాదు, మహాకవి జాషువా. ఆనాటి కుల వివక్షకి ఇదో తుచ్ఛతునక!


అరవైల్లో ఇప్పుడు మూత పడిన హైదరాబాద్ అబిడ్స్‌లోని 'ఓరియంట్ కేఫ్'లో దిగంబర కవులు కలిసి సాహితీ చర్చలు జరిపేవారట. అలాగే సాహితీ రంగంలో ద్వారకా మిత్రులుగా శివారెడ్డి, ఆయన మిత్ర బృందం చాలా ప్రసిద్ధి పొందారు. నారాయణ రెడ్డి గారు కూడా ఈ సమావేశానికి రావాలని ఉబలాటపడినా, ఆయన సెలబ్రిటీ స్థాయి అడ్డు వచ్చేదని అంటారు. లక్డీకాపూల్‌లోని ద్వారకా హోటల్లో కవులు చేరి కాఫీలు తాగుతూ సాహితీ చర్చల్లో మునిగి తేలేవారు. ఎ.జి. ఆఫీసు పక్కన వున్న కార్నేషన్ కేఫ్‌లో పుస్తక ఆవిష్కరణ సభలు కొన్నాళ్లు జరిగాయి. ఇరానీ ఛాయ్, కారా బిస్కట్లు ఇక్కడి ఆతిథ్యం. నారాయణ గూడా తాజ్‌మహల్ హోటల్లో కొంతమంది సాహితీవేత్తలు ఇడ్లీ, కాఫీలు ఆస్వాదిస్తూ సాహితీ చర్చలు జరిపేవారు.

కొంతమంది డబ్బున్న సాహితీవేత్తలు తమ ఊళ్లకి ఏవో ఉత్సవాల పేరిట సాహిత్యకారుల్ని పిలిచి దిమ్మ తిరిగే ఆతిథ్యం ఇచ్చి వారికి మరుపురాని అనుభవం కలిగిస్తారు. ఇది ఆతిథ్య సాహితీవేత్తల ఎదుగుదలకి బాగా ఉపకరిస్తుందని కొందరు భావిస్తారు. ఇక సాహితీ రంగంలో మరో రకం ఆతిథ్యం ఉంది. 'సభానంతర సభలు' అని వీటికి పేరు. వీటిలో వచన కవులైనా, వచన రచయితలైనా 'సీస' పద్యాలే పఠిస్తారు. అందుకే ప్రసిద్ధ సాహితీవేత్త ఒకరు సభల కంటె సభానంతరం సమావేశాలే రంజుగా ఉంటాయని వ్యాఖ్యానించారు. కొందరు సాహితీ వేత్తలను సాహిత్య కార్యక్రమాలకు అతిథులుగా ఆహ్వానించినప్పుడు ఫస్ట్‌క్లాస్ రైలు టిక్కెట్లు, హోటల్లో ఎ.సి. రూమ్, కమ్మటి విందు... ఇంకా మరెన్నో సౌకర్యాలు కావాలని డిమాండ్లు పెడుతుంటారని సమావేశకర్తలు వాపోతుండటం చూస్తుంటాం. నిజమైన సాహితీ ప్రియులకు ఇలాంటి పైపై మెరుగులు పట్టవు. వారికి సాహిత్యమే లోకం.

ప్రసిద్ధ సాహితీవేత్త, రాజకీయవేత్త డా. బెజవాడ గోపాలరెడ్డి 'ఆమె' పేరిట ఓ కావ్యం ప్రచురించారు. అన్ని విషయాలను 'ఆమె'కి ఆపాదిస్తూ రాసిన కావ్యం అది. శాసన సభ్యురాలైన ఒక 'ఆమె' గురించి చెబుతూ ...

'ఆమె/ నోరు విప్పలేదు

ఒక్క కాఫీ టేబుల్ దగ్గర తప్ప!' అని ఛలోక్తి విసిరారు. ఎలాంటి వారినైనా కదిలించేది తిండే మరి. మేధస్సు కన్న, హృదయం కన్న జిహ్వకు స్పందన ఎక్కువ మరి! ■






## బహుజన బతుకుల చిత్రికలు

# సిక్కెంటిక కథలు

- డా.వి.ఆర్.రాసాని
98484 43610

**తె**లుగు కథా సాహిత్యంలో బహుజన కథలు రాసినవారిలో ముందుగా గుర్తొచ్చేవారు బండి నారాయణ స్వామి, శాంతి నారాయణ, బి.ఎస్.రాములు, కాలువ మల్లయ్య, పెద్దింటి అశోక్ కుమార్, జి.వెంకటకృష్ణ, పసునూరి రవీందర్, స్కైబాబా, షాజహానా, ఖదీర్‌బాబు, బారహంతుల్లా, ఇనయతుల్లా, శిరంశెట్టి కాంతారావు, వినోదిని, భారతి, జాజుల గౌరి, రాసాని, దేవపుత్ర, సుంకోజి దేవేంద్రాచారి, జిల్లేళ్ల బాలాజీ తదితరులు.

జిల్లేళ్ల బాలాజీ కథకుడు, నవలాకారుడు. అంతకుమించి మంచి అనువాదకుడు. తమిళ భాష నుంచి నవలలు, కథలు అనువాదం చేశారు. తమిళభాషలో జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన జయకాంతన్ నవలల్ని, కథల్ని ఆయనకు ఆ అవార్డు రాకముందే తెలుగులోకి అనువాదం చేశారు. ఒరునడిగై, నాడగం పార్కిరాల్ అన్న నవలని 'కల్యాణి' పేరుతోను, ఒరు మణిదన్– ఒరు వీడు – ఒరు ఉలగం నవలను 'ఒక మనిషి, ఒక ఇల్లు, ఒక ప్రపంచం' పేరుతోనూ అనువాదం చేశారు. జయకాంతన్ మరో నవలను 'ఎదురుచూపులు' పేరుతో తెనుగించారు. ఎస్.రామకృష్ణన్ తమిళంలో రాసిన ప్రసిద్ధ నవల 'మాయం'ను అదే పేరుతోనూ, కల్కి రాసిన 'అలైఓసై' నవలను 'అలల సవ్వడి' పేరుతోనూ అనువాదం చేశారు. ఇలా మొత్తం 15 నవలల్ని అనువదించారు. తాను స్వయంగా ఇటీవల 'జీవితమొక పయనం' అన్న నవల రాశారు. తను అనువదించిన కొన్ని కథల్ని 'కాలప్రవాహం', జీవనాడి నైలునది సాక్షిగా.., శిధిలం (తమిళ దళిత కథలు) పేర్లతో ప్రచురించారు. బాలాజీ తన సొంత కథల్ని ఐదు సంపుటాలుగా తెచ్చారు. అవి : 1. సిక్కెంటికలు, 2. వంతు 3. ఉందు నాయనా, దిష్టి తీస్తా 4. మైత్రీవనం (మిత్రులతో కలిసి) 5. పగడాలూ పారిజాతాలూ.

బాలాజీ ఒక ప్రైవేటు పాఠశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఆర్థికంగా ఎన్ని ఒడుదుడుకులున్నా నిరంతరం రచనా కార్యంలో జీవించే నిత్య సాహిత్య కృషీవలుడు. ఆయన కథల సంపుటాల్లో మొదటిది 'సిక్కెంటిక'. ఈ సంపుటి ఎందరో సాహిత్యకారుల్ని ఆకర్షించి, విమర్శకుల మన్ననలను సైతం పొందింది. ఈ సంపుటిలో మొత్తం 15 కథలున్నాయి. వీటిని ఆరు రకాలుగా విభజించుకొని పరిశీలించవచ్చు. 1. కులవృత్తుల కథలు, 2.వృద్ధుల కథలు 3. బాలకార్మికుల కథలు 4. అనుబంధాల్ని తెలిపే కథలు 5. మత సామరస్య కథలు 6. ఇతర స్త్రీల కథలు. సజీవం, కొలువు, గుండెలేని మనిషి, సిక్కెంటిక, జ్వలనం.. అనేవి కులవృత్తుల కథలు. అభిమానవతి, పర్యవసానం, అహం అనే కథలు ఇతర స్త్రీలకు సంబంధించిన కథలు. అమ్మ డైరీ, తమ్ముడి మరణం, వాడు, బంగారు గాజులు అనుబంధాల్ని తెలిపే కథలు. మిగిలినవి గడింపులో ముగిసిన మజిలీ, గమ్యం తెలియని పరుగు, నవజీవన రాగం.

**కులవృత్తుల కథలు :** తెలుగులో మంగలి వృత్తి కథను మొదట రాసిన వారు ఆచార్య కొలకలూరి ఇనాక్. ఆయన రాసిన 'తల లేనోడు' కథ విశిష్ట శిల్పంతో కూడుకున్నది. వీరి తర్వాత తుమ్మల రామకృష్ణ, రాప్తాటి గోపాలకృష్ణ, శ్రీనివాసమూర్తి కలిసి 'పల్లె మంగలి కథలు' అన్న చిన్న పుస్తకం ముద్రించారు. తెలుగు సాహిత్యంలో వచ్చిన మొదటి కులవృత్తుల కథా సంపుటి ఇదే. తర్వాత జర్నలిస్టు కథకుడైన బాలకృష్ణమూర్తి ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో 'భజంత్రీ కథలు' పేరులో చాలా మంచి కథలు రాశారు. ఈ మధ్య కాలంలో మూరిశెట్టి గోవిందు 'మావూరి మంగలి కథలు' పేరుతో పుస్తకం తెచ్చారు. ఒకటి రెండు మంగలి కథలు రాసిన మరికొందరు ఉన్నారు.

వీరందరికంటే బాలాజీ రాసిన కథలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. సిక్కెంటిక సంపుటిలోని కథల్లో సామాన్య రచయితలు గమనించని, పట్టించుకోని సరికొత్త కోణంలో చిత్రించిన మంగళ వాయిద్యకారుల జీవిత శకలాలు దర్శనమిస్తాయి. 'సజీవం' అన్న కథలో పెద గోవిందు వాద్యకారుల బృందం పరిగిపూడి గ్రామంలో వున్న జనార్థన నాయుడి కొడుకు పెళ్లికి బయల్దేరు తుంది. బస్సు దిగిన చోటు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం డోలు, నాదస్వరాలు మోసుకొని వివాహ గృహానికి చేరుకుం టారు. నాయుడు కొడుకు "ఈకాలంలో వాయిద్యాలెందుకు? సీడీలున్నాయి.. మీరు వెళ్లండి" అంటాడు. వారు ఉసూరుమనుకుంటూ తిరిగి వెళు తుంటే, మాలపల్లెలో పెట్రోమాక్స్ లైట్ల వెలుతురులో వివాహం జరపబోతున్న ఒక దళిత యువకుడి పెండ్లికి ఆహ్వానింపబడి వాద్యాలు వాయిస్తారు. ఆరోజు కరెంటు పోవడంతో పరికిపూడి గ్రామంలో సడీచప్పుడు లేకుండా అయి పోతుంది. గోవిందయ్య మేళం బృందంతో దళిత వివాహం ఘనంగా జరుగుతుంది. అంతరించిపోతున్న జానపద కళల్ని దళిత బహుజనులే బతికించుకుంటున్నారని ఈ కథ చెబుతుంది.

గుడుల్లో పూజ, అభిషేక సమయాల్లో; విగ్రహాల ఊరేగింపు తరుణంలో మంగలి వారి నాదస్వరం, డోలు, తాళం, శృతి పెట్టె వంటి వాయిద్యాలు వినిపిస్తుంటాయి. ఇలా వాయిద్యాలు వాయించే కొలువులోని కుట్రలు, రాజకీయాల గురించి తెలుగు సాహిత్యంలో ఎవ్వరూ రికార్డు చేయలేదు. ఆ లోటు తీర్చినవాడు బాలాజీ. 'కొలువు' కథలో... రాగిమాకుల కుప్పయ్య తిరుత్తణి కుమారస్వామి ఆలయంలో మేళగాడు. అది అతనికి వంశ పారంపర్యంగా వస్తున్న కొలువు. ఉదయాన్నే లేచి, వంకలో స్నానం చేసి, తోటి వాద్యకారులతో గుడికి వెళ్లి నాదస్వరం, డోలు వంటివి వాయిస్తుంటాడు. అతనికి ఒక కూతురు. ఆ కూతుర్ని ముని రాఘవుడికి ఇచ్చి, తన తర్వాత గుడి కొలువు అతని ద్వారా నిలుపుకోవాలనుకుంటాడు. అల్లుడికి ఒక కొడుకు పుట్టింతర్వాత కూతురు చనిపోతుంది. తనే ధనలక్ష్మి అనే మరో అమ్మాయితో అల్లుడికి వివాహం చేయిస్తాడు. తర్వాత అనారోగ్యంతో మరణిస్తూ గుడి కొలువు వదలొద్దని, తలకొరివి మనవడి చేత పెట్టించమని చెబుతాడు. అతను బతికున్న రోజుల్లో ఏనాడూ పలకరించి ఎరుగని అతని తమ్ముడి గవరయ్య కొడుకు, తాగుబోతు వచ్చి.. దాయాదులం మేముండగా కూతురి బిడ్డతో తలకొరివి పెట్టడానికి ఒప్పుకోమని, గుడి కొలువు తనకిమ్మని కోరతాడు. దానికి ఇష్టపడని ముని రాఘవుడు ఇంటిని అతనికి రాసిచ్చి, తలకొరివి పెట్టించి, కొలువుని నిలుపుకుంటాడు.

ఇలాంటి కొలువు గురిచే 'వొంతు' కథల సంపుటిలో అదే పేరుతో మరో కథ రాశారు బాలాజీ. అందులోనూ తిరుత్తణి గుడిలోని నాదస్వరం కొలువుపైనే కథ నడుస్తుంది. 'చంద్రం' కొలువు వొంతు కోసం మద్దిస్తం పెడతాడంట అన్నమాటతో కథ ప్రారంభమవుతుంది. అంజిమిట్ట రామస్వామి ఆ గుడిలో నాదస్వరం కొలువు చేస్తుంటాడు. అతని ఏకైక కూతురు గౌరమ్మను పరమేశం అనే ప్రభుత్వ ఉద్యోగికిచ్చి పెండ్లి చేస్తాడు. వారికి పుట్టిన సంతానం చంద్రం. వారికి వేరే ఊరికి బదిలీ కావడంతో ఆ ఊరొదిలి వెళ్ళిపోతారు. రామస్వామికి వయసు పెరిగిపోతుంటే మెల్లగా అతని తమ్ముడు నరసింహులు కొడుకును అతనితో పాటు కొలువుకు పంపిస్తూ గుడివారిచ్చే సాదం డబ్బులు సగంసగం తీసుకుపోతుంటాడు. చంద్రం డిగ్రీ పూర్తి చేస్తాడు. గౌరమ్మ చనిపోతుంది. లత అనే అమ్మాయిని పెళ్లి చేసుకొని ఉద్యోగం దొరక్క తాత వారసత్వంగా కొలువు కోసం మద్దిస్తం ఏర్పాటు చేస్తాడు. కానీ ఆదెమ్మ కూతురితోపాటు దిగుడు బావిలో ఆత్మహత్య చేసుకున్నట్టు డ్రామా ఆడి అతన్ని వెనక్కి పంపేస్తుంది. గుడి కొలువు కోసం ఎన్ని ఎత్తులు వేస్తారో, ఎంత స్వార్థం చూపిస్తారో ఈ కథలో చిత్రించారు బాలాజీ.

అనాథలా బతికే ఒక నాదస్వర వృద్ధ కళాకారుడి జీవితాన్ని కరుణరసాత్మకంగా ఆవిష్కరించిన కథ 'గుండె లేని మనిషి.' ఒకనాటి వైద్యశిబిరంలో నాగస్వరాన్ని భుజానికి తగిలించుకుని కళ్ల పరీక్ష కోసం వస్తాడు పేద నాదస్వర విద్వాంసుడు గణపతయ్య. అతనికి గుండె కొట్టుకుంటున్న దాఖలాలు కనిపించకపోవడంతో గుండె ఉండదని భావించి ఆ విషయం నిర్ధారణ చేసుకొని ప్రపంచానికి చాటి పేరు తెచ్చుకోవాలను కుంటాడు అతన్ని పరీక్షించిన కళ్ల వైద్యుడు ఆనందమూర్తి. తన వాయిద్యాన్ని మరిచిపోయి చెప్పకుండా వెళ్లిపోతాడు గణపతయ్య. ఆ వాయిద్యం కోస తప్పకుండా అతడు వస్తాడని భావించి దానిని ఇంట్లో భద్రపరుస్తాడు ఆనందమూర్తి. రెండు నెలల తర్వాత అతనున్న పట్టణంలోని ఓ రోడ్లో కనిపిస్తే అతన్ని తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకుంటాడు. అతని తండ్రికి కిడ్నీలు దానం చేసిన నిజాన్ని గ్రహించిన గణపతయ్య వారు చేసిన మోసాన్ని గుర్తుకు తెచ్చుకొని తన నాదస్వరం తీసుకొని చెప్పకుండా వెళ్లిపోతాడు. లక్షలిస్తేగాని దొరకని కిడ్నీలకు ఆనందమూర్తి తండ్రి గారి పనిమనిషైన గణపతయ్య కూతురిని మోసం చేసి అతనికి పదివేలు మాత్రమే ఇచ్చి వుంటారు. కళాకారులకు మోసాలెలా జరుగుతాయో తెలియజేసిన కథ ఇది.

ఈ సంపుటిలో ఈ కులవృత్తిపైన ప్రపంచీకరణ ప్రభావం ఎలా పనిచేస్తోందో పరోక్షంగా చెప్పే కథ కూడా ఉంది. ఆ

కథ పేరు 'రాచబాట'. ముప్పయ్యేళ్ల క్రితం వరకూ చాకలి వారు, మంగలి వారు పల్లెల్లో 'మేర' పేరుతో పనిచేసేవారు. గుడ్డలు ఉతికినందుకు చాకలికి ఏడాదికి ఇన్ని 'శేర్లు' అని కొలిచేవారు. రైతులకు గెడ్డం గొరగడం, జుట్టు కత్తిరించడం, గోర్లు కత్తిరించడం వంటి పనులు చేసినందుకు మంగలికి కొంత ధాన్యాన్ని కొలిచేవారు. దాన్నే 'మేర' అంటారు. అలా మేరకు ఒప్పుకున్న ధనంజయ తాతకు జుట్టు గొరిగి రమ్మంటాడు, ఆ పల్లెమంగలి నటేశుడు తన కొడుకైన కోదండంతో. అతను డిగ్రీ చదువుతుంటాడు. మేర పని చేయడం నామోషీగా భావించడం వల్లనూ, ఆ ముసలాడి తల నిండా పుండ్లు ఉ ండడం వల్లనూ ఆ పని చేయడానికి ఒప్పుకోకుండా ఇల్లొదిలి పట్నానికి వచ్చి ఒక మంగలి షాపులో కటింగుకు కుదురుతాడు. ఆ షాపు ఓనరు షౌకతాలి అనే ముస్లింగా గుర్తించి, తానూ తన కులవృత్తితో పట్నంలో ఒక కమర్షియల్ షాపు తెరవాలని నిర్ణయించుకుంటాడు.

కుటుంబ ఆధారమైన మగవాళ్లు లేకపోతే ఈ కులవృత్తిలోని ఆడవాళ్లు ఎన్ని బాధలను అనుభవిస్తారో తెలియజేసే కథలు ఈ సంపుటిలో రెండున్నాయి. అవి : 'సిక్కెంటిక', 'జ్వలనం'. ఎన్ని ఏండ్ల నుంచో మేర పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే ఒక మంగలి ఒక మద్రాస్ వ్యక్తికి సిక్కెంటికలు అమ్మి మోసపోవడంతోనూ, అనారోగ్యంతోనూ మరణిస్తాడు. దాంతో అతని భార్య దేవయాని తన రెండేళ్ల కొడుకును జోలెలో పెట్టుకొని పల్లెల్లో తల దువ్వగా రాలిపోయిన సిక్కెంటుకల్ని కొంటానని తిరిగి కడుపు నింపుకుంటూ ఉంటుంది. అత్త వేధింపులు ఎక్కువ. పాపమ్మ అనే ఆమె దేవయాని పొడవైన జుట్టు చూసి 'అలాంటి సవరం చేసుకొని రా... ఎంతయినా కొంటాన'ంటుంది. సవరానికి అవసరమైన సిక్కెంటుకలు దొరక్క పోవడంతో దేవయాని రెండు రోజుల తర్వాత తన వెంట్రుకల్ని గొరిగించుకొని, వాటితో సవరం అల్లి పాపమ్మకమ్ముకుంటుంది. ఇదీ సిక్కెంటిక కథలోని సారాంశం.

'జ్వలనం' కథలో నారాయణరావు కొడుకు మాధవ్ వివాహానికి డోలు, మేళం వాయించడానికి ఒప్పుకున్న సుధారాణి, సంధ్యారాణి అనే స్త్రీలు వాయిద్యాలతో నారాయణ రావు ఇంటికి చేరుకుంటారు. వివాహం జరిగేటప్పుడు స్కూటరుతో పాటు ల్యాప్‌టాప్ తీసియ్యాలని నారాయణ రావు పెళ్లికూతురు తండ్రితో పేచీ పెట్టుకొని వాయిద్యాలు ఆపమంటాడు. పెళ్లి కూతురు దీనంగా ఏడుస్తుంటుంది. అది చూసిన ఈ రాణులు వాయిద్యాలు వాయించమని తిరస్కరించి వచ్చేస్తారు.

**ఈ సంపుటిలో వృద్ధులకు సంబంధించి** 'ముగిసిన మజిలీ' అనే కథ ఉంది. ఈ కథలో భార్య చనిపోయిన ఒక వృద్ధుడు పక్షవాతంతో మాట, కాళ్లూ చేతులు పడిపోయి మంచాన పడి ఉంటాడు. కొడుకు, కోడలు అతణ్ని సరిగ్గా చూడరు. అసహ్యించుకుంటారు. చనిపోయిన భార్య ఆత్మరూపంలో అతన్ని కనిపెట్టుకొని ఉంటుంది. ఒకసారి ఆ వృద్ధుడు ప్రకృతి అవసరాలను పంచెలోనే చేసుకొని పడిపోతే, కొడుకు, కోడలు అతనికి విషమిచ్చి చంపేయాలనుకుంటారు. అది గమనించిన ఆ వృద్ధుడు తన దగ్గరే వున్న బీపీ మాత్రలన్నీ మింగేసి ప్రాణం వదిలేస్తాడు. కొడుకు కోడలు చేసే దుష్ట చర్యల్నీ, దుష్ట ఆలోచనల్ని తల్లి ఆత్మ గమనిస్తున్నట్లు రాయడం ఈ కథలో కనిపించే ఒక విశిష్ట శిల్పం.

**బాల కార్మికుని కథ :** గమ్యం తెలియని పరుగు కథలో ఒక బాల కార్మికుడు నారాయణ. ఒక ఆక్సిడెంట్లో తండ్రికి పక్షవాతం వచ్చి, తల్లికి కాళ్లు పోతాయి. వారిని పోషించడానికి ఆ బాబు ఒక హోటల్లో పనిచేస్తుంటాడు. మోహనరావు అనే అతను కార్లో దిగి, ఆ హోటల్లో నారాయణ చేసే పనులు చూసి బాల కార్మికుడని, వాడిని పనిలోంచి తీసేయమంటాడు. దీంతో, బిల్డింగ్ కట్టే చోట పనికి కుదురుతాడు నారాయణ. ఆ బిల్డింగూ మోహనరావుదే. అక్కడా అతన్ని పని మాన్పించేస్తే, అతని కారు అద్దాలపై రాయి విసిరి అక్కడి నుంచి పరుగెత్తిపోతాడు నారాయణ. బాల కార్మిక వ్యవస్థను ఎలా అర్థం చేసుకోవాలో లోచూపునిచ్చే కథ ఇది.

**'నవజీవనం' మత సామరస్యాన్ని చాటే కథ.** విశ్వనాథం సంప్రదాయవాది. అతని కొడుకు సుమంత్ స్టెల్లా అనే క్రిస్టియన్ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. అందుకని వాళ్లకి దూరంగా, ఆర్థిక ఇబ్బందుల్లో వున్న విశ్వనాథాన్ని గంగాధరం అనే పేరుతో రూ.25 వేలు చెక్ పంపి ఆదుకుంటాడు స్టెల్లా తండ్రి డేవిడ్. స్టెల్లా సీమంతంలో డేవిడ్ ఆదరణను చూసి చలించిపోతాడు విశ్వనాథం. మతం కన్నా మానవత్వం, మనిషితత్వం మిన్న అనుకుంటాడు.

**అనుబంధాల్ని తెలిపే కథలు :** మన సమాజంలో అనుబంధాల్ని చాలా విలువైనవిగా భావిస్తారు. అమ్మానాన్న, అక్కా తమ్ముడు అనే బంధాలు ఏ కాలంలోనైనా బలమైనవే. వీటిని తెలియజేసే కథలు అమ్మడైరీ, తమ్ముడి మరణం, వాడు, బంగారు గాజులు. లేకలేక పుట్టిన కొడుకు రవిచంద్ర మిలట్రీలో చేరిపోయి, ఉద్యోగానికి వెళుతుంటే అతని తల్లి తను రాసిన డైరీ ఇచ్చి చదవమంటుంది. ట్రైన్లో ఆ డైరీ చదువుతాడు రవిచంద్ర. ఆమె వెజైనా లేకుండా పుట్టడంతో ఎంతటి ఇబ్బంది పడిందో, ఆపరేషన్ చేయించుకొని, అక్కడ చేసిన సుధీర్‌బాబును పెళ్లి చేసుకొని, ఎన్ని కష్టాలు పడి రవిచంద్రను కన్నదో ఆ డైరీలో ఉంటుంది. తల్లి రక్షణలాగే భారతమాత రక్షణా తనకు

ముఖ్యమని రవిచంద్ర ఉత్తరం రాస్తాడు. ఇది తల్లీబిడ్డల అనుబంధాన్ని తెలిపే కథ. 'తమ్ముడి మరణం', 'వాడు' అన్నదమ్ముల అనుబంధాన్ని తెలిపే కథలు. సవతి తల్లికి పుట్టిన తమ్ముడు మరణించడంతో, అతని సంవత్సరికానికి తాను పనిచేసిన స్కూల్లో పిల్లలకు పుస్తకాలు, పెన్సిళ్లు పంచి తమ్ముడిపైన తనకున్న ప్రేమను వ్యక్తం చేసుకుంటాడు రచయిత. 'బంగారు గాజులు' కథ అక్కచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమను తెలిపే కథ. గౌరి గర్భవతి కాగానే బంగారు గాజులు కావాలని భర్తను కోరుతుంది. కాన్పు కోసం పుట్టింటికి వెళతావు కదా.. అప్పుడు మీ అమ్మనడిగి చేయించుకోమని గౌరిని పుట్టింటికి పంపిస్తాడు భర్త. ఆమె తండ్రి తాగుబోతు. చెల్లి సరస్వతి కుంటిది. తల్లి నానా కష్టాలూ పడి కుటుంబాన్ని పోషిస్తూ సరస్వతి కోసం బంగారు గాజులు చేయించి ఉంచుతుంది. వాటిని గౌరి అడగ లేకపోతుంది. ప్రమాదవశాత్తు తల్లి గోడమీద నుంచి పడి చనిపోతుంది. గౌరి ఆడబిడ్డను కని మెట్టినింటికి వెళ్లే సమయం దగ్గర పడుతుంది. సరస్వతి అక్క చేతి నిండా రంగురంగుల మట్టి గాజుల్ని ప్రేమతో తొడిగిస్తుంది.

**ఆడవాళ్ల మనస్తత్వాన్ని తెలిపే మరో మూడు కథలు** ఈ సంపుటిలో ఉన్నాయి. ఉత్తమ పురుషలో నడిపిన 'అభిమానవతి' కథలో ఆత్మాభిమానం గల యువతి రచయిత భార్య. ఆమె భర్త బాగా ఈగో కలిగిన వ్యక్తి. ఆమెకు గౌరవం ఇవ్వకుండా డెలివరీ నెపంతో ఆమెను ఆమె పుట్టింటికి పంపేసి, ఆ తర్వాత పట్టించుకోడు. రెండేళ్ల తర్వాత ఆమె బస్టాండ్‌లో చిప్స్ అమ్ముతూ కొడుకుతోపాటు కనిపిస్తుంది. అవాక్కైపోతాడు రచయిత. పర్యవసానం కథలో... మండలాఫీస్‌లో ఆర్ఐగా పనిచేస్తున్న రఘుపతి ఒక ఆస్తి విషయంలో పరిష్కారం కోసం వచ్చిన అమ్మాయిని లైంగిక వేధింపులకు గురిచేసి టీవీల్లో కెక్కుతాడు. అదే సమయంలో అతని కూతురికి పెళ్లి సంబంధం కోసం వచ్చినవారు ఆ న్యూస్ చూసి.. తండ్రే ఇలా ఉంటే బిడ్డ ఇంకెలా వుంటుందని ముఖం మీదనే అనేసి వెళ్లిపోతారు. తల్లిదండ్రుల ప్రవర్తన పిల్లలపైన ఎలాంటి ప్రభావం చూపిస్తుందో తెలిపిన కథ ఇది. అహం కథలోకి వెళితే.. చీరలు కొనడానికి వచ్చిన విలాసిని, ప్రణతి అనే స్నేహితురాళ్లు ఈగోకు వెళ్లి ఎక్కువ విలువ గల చీరలు కొని ఆ చీరల్ని ఇంటి కర్టెన్లుగా సోఫా కవర్లుగా కుట్టించి తమ అహాన్ని చాటుకుంటారు. వీరి అహానికి ఒక బిచ్చగత్తె బలైపోవడం ఈ కథలో చివరి ట్విస్ట్. ఇవీ బాలాజీ 'సిక్కెంటిక' కథా సంపుటిలోని కథా విశేషాలు. దాదాపు 131 అనువాద కథలను, 151 డైరెక్టు కథలను ముద్రించిన జిల్లెళ్ల బాలాజీ తెలుగు బహుజన కథా సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారు. ఆయన మరిన్ని కథలు వెలువరించాలని ఆశిద్దాం.

## విధ్వంసమే వ్యాపారం

ఏదో ఒకరోజు యుద్ధం ముగుస్తుంది
ఆకాంక్షలు తీరేకనో గెలుపోటములు తేలేకనో
ఎప్పుడైనా యుద్ధం ముగుస్తుంది!
మరి యుద్ధ కల్లోలం ముగుస్తుందా?
విధ్వంసం ముగుస్తుందా?

గుండెలు పగిలిన రక్తనదులు
తండ్రిని కోల్పోయిన పసిపాపల కన్నీటి గదులు
శిథిలాల కింద వెదకినా దొరకని శరీర జాడలు
శవదహనాల పొగల్లో ఎగసి పడుతున్న జనశ్వాసలు
బంకర్లలో ప్రసూతి ఆర్తనాదాలు
ఛిద్రమైన పచ్చని చెట్లు
చెల్లాచెదురైన పక్షుల గుంపులు
కూలిన ఇంటి పైకప్పులు
ఆ కింద జీవంలేని మమకారపు సవ్వడులు

అక్కడ
జీవనది సాఫీగా ఎప్పుడు కదలాడుతుంది?
జీవన సరిగమలు ఎప్పుడు వినిపిస్తాయి?

అవును
విధ్వంసం కూడా ముగుస్తుంది
అగ్రరాజ్యానికి కాసుల రాశులై ముగుస్తుంది
విధ్వంసం చరిత్రయి ముగుస్తుంది
ఒక అనుభవమై ముగుస్తుంది
మరోచోట మరో దేశంతో
యుద్ధం ప్రారంభమై ముగుస్తుంది
యుద్ధం –
సామ్రాజ్యవాదుల వాణిజ్య చక్రం
యుద్ధం వారి శ్వాస నిశ్వాసల లక్షణం
ఆయుధ సృష్టికర్తలు వారే !
యుద్ధ సృష్టికర్తలూ వారే !!

**- బొడ్డ కూర్మారావు**
**99595 00360**

■



# ఇష్టం

- పద్మావతి రాంభక్త
99663 07777

**సా**హిత్యం మీద తీరని మమకారంతో ముందస్తు ఉద్యోగ విరమణతో ఉద్యోగానికి వీడ్కోలు చెప్పి హాయిగా కథలు కవితలు చదువుకుంటూ కాలక్షేపం చేద్దామని ఆలోచించుకున్నాను.

"రాజేశ్వరీ , ఇలా పొద్దున్నే ఆఫీస్‌కు వెళ్లి సాయంత్రం ఇంటికి రావడం అనే ఈ దినచర్య విసుగొస్తోంది. హాయిగా అన్నీ మానేసి నాకు నచ్చినట్టుగా బతకాలని ఉంది. ఏమంటావ్?' అన్నాను.

శ్రీమతి 'ఇదేమి చోద్యం అండి. చక్కగా ఆఫీసుకి వెళ్లి పనిచేసుకుంటే, రోజంతా చురుగ్గా ఉంటుంది. పొద్దు పోతుంది. లేకపోతే ఖాళీ అయిపోయి బుర్ర పిచ్చెక్కుతుంది.' అంటూ బుగ్గలు నొక్కుకుంది.

'ముందు కొన్ని రోజులు బాగానే ఉంటుంది కానీ ఆ తర్వాత మీకు విసుగొస్తుంది నాన్నా..' అని పిల్లలు ఎంత చెప్పినా నేను నా మాట మీదే గట్టిగా నిలబడిపోయాను. హాయిగా కాలేజి రోజుల్లో బోలెడు నవలలు, కథలు, కవిత్వం చదువుతూ ఎంతో ఆనందం పొందేవాడిని. లైబ్రరీలు పుస్తక ప్రదర్శనలు, సాహితీ సమావేశాలు అంటూ తెగ తిరిగేవాడిని. చదువును నిర్లక్ష్యం చెయ్యకపోవడంతో ఎలా తిరిగినా ఇంట్లో నుంచి మాత్రం అంతగా ఒత్తిడి ఉండేది కాదు. ఏదో రాయాలని అప్పుడప్పుడు అనిపించినా సమయం ఉండేది కాదు. సమయం ఉన్నప్పుడు మనసు కుదిరేది కాదు. ఆనక ఉద్యోగం – పెళ్లి– పిల్లలు అలా జీవిత నౌకలో తీరిక లేని ప్రయాణంతోనే సరిపోయింది. ఇప్పుడు పిల్లలు ఉద్యోగాల్లో కుదురుకుని వారి పిల్లలతో వారు, ఎవరి జీవితాల్లో వారు బాగానే ఉన్నారు. ఇక ఇదే నా కోరిక తీర్చుకోడానికి సరైన సమయం అనిపించింది. అందుకే మరో ఆలోచన లేకుండా ఉద్యోగానికి స్వస్తి చెప్పి నాకెంతో ఇష్టమైన సాహిత్యాన్ని హత్తుకున్నా.

ఇప్పుడు రోజూ న్యూస్ పేపర్లు, అన్ని రకాల పత్రికలూ కొని తెచ్చుకుని అక్షర స్నానంతో విశ్రాంతిగా సేదతీరుతున్నాను. కథలు చదువుతుంటే, అప్పుడు నేను చదివిన కథలకు ఇప్పటి వాటికి చాలా తేడా కనబడింది. అప్పటి సమస్యలు వేరు. అప్పటి రోజులు వేరు. ఇప్పుడు పరుగుల జీవితంలోని సమస్యలను కొత్త కోణంలో చూస్తూ కొత్త రచయితలు చాలా బాగా రాస్తున్నారు. పాత రచయితల్లో కొంతమంది ఇంకా కలం కదుపుతూ కొత్త పోకడలకు అనుగుణంగా రాయడం మెచ్చుకోదగ్గ విషయమే.

రోజూ ఉదయం కాఫీ తాగి కాసేపు వార్తా పఠనం, ఆ తరువాత కాస్త శ్రీమతికి వంటలో సహాయం చేసి మళ్ళీ పుస్తకాలతో సహచర్యం, మధ్యాహ్నం భోజనం తరువాత

కాసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం పార్కులో మిత్రులతో కాలక్షేపం చేయడం, రాత్రికి భోజనం కానిచ్చి కాసేపు చదువుకుని నిద్రకు ఉపక్రమించడం. ఇది నా దినచర్య. శ్రీమతికి కూడా నా దినచర్య బాగా నచ్చింది. నేను ఆవిడకి వంటలో కాస్త సహాయపడడం వల్ల ఆవిడ ఈ మధ్య మరింత హుషారుగా కనిపిస్తోంది.

పొద్దున్నే లేచి, 'రాజీ, ఉల్లిపాయలు, కూరగాయలు తరిగి ఇవ్వమంటావా' అని అడుగుతూ, 'ఇవాళ పేపర్లో ఏం రాసారో తెలుసా' అంటూ ఆమెతో కబుర్లు చెప్తుంటే ఆమె చకచకా వంట ముగించేస్తోంది.

'ఇద్దరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఇలా వంట చేసుకోవడం ఎంత బావుందో నాకు' అని ఎన్నోసార్లు అంది.

ఒక రోజు పార్కులో  నాలాగే సాహిత్యంతో పరిచయం ఉన్న స్నేహితుడు 'అవునూ, నువ్వు ఎందుకు రాయడానికి ప్రయత్నించకూడదు' అని ఉన్నట్టుండి అన్నాడు.

'నేను రాయడమేమిటి? నాకు ఏం వచ్చు?' అన్నాను.

'నువ్వు భలే వాడివి మూర్తి.. అప్పట్లో కాలేజి మాగజీన్‌కు ఎన్ని శీర్షికలు రాయలేదు నువ్వు' అన్నాడు. ఏదో సరదాకి అన్నాడులే, అప్పుడు ఏదో కుర్రతనపు వేడిలో అలా ఏదో రాసేసాను అని మనసులో అనుకుని నవ్వేసి ఇంటికి వచ్చేసాను.

ఇంటికొచ్చాక భోజనాల మధ్యలో ఈ విషయం ఆవిడతో అన్నాను. వెటకారం చేస్తుందేమో అనుకున్న నా భార్య ...

'అవును మీరు ఎందుకు ప్రయత్నించకూడదు. తినగ తినగ వేము తీయనవును అన్నట్టు .. రాస్తూ ఉంటే అదే కథాక్రమం పట్టుబడుతుంది' అని తన ఫుల్ సపోర్ట్ ఇచ్చేసింది. మంచి ఇతివృత్తం ఆలోచించి ఒక కథ రాసి పత్రికకి పంపించాను. పది రోజుల్లో గోడకి కొట్టిన బంతిలా వెనక్కి వచ్చేసి, నన్ను దు:ఖసాగరంలో ముంచెత్తింది. పత్రికకి కథ పంపినట్టు, తిరిగొచ్చినట్టు చెప్తే నవ్వుతారని నా స్నేహితులకి చెప్పలేదు  సరి కదా ఈ చిదంబర రహస్యం ఎవరికీ చెప్పొద్దని నా శ్రీమతికి మరీ మరీ చెప్పాను.

'ఇందులో సిగ్గు పడడానికి ఏముంది? ఒక్కసారికే ఒక్క కథకే పెద్ద రచయిత అయిపోతారా ఎవరైనా?' అంటూ మరోసారి నాకు ధైర్యం ఇచ్చింది ఆవిడ. ఈసారి మరో పత్రికలోని  కథల పోటీకి ఈ కథనే మరోసారి చదివి కొన్ని మార్పులు చేర్పులు చేసి పంపించాను. ఆశ్చర్యం ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. నా ఆనందానికి అవధులు లేవు. పిల్లలు ఎంత సంతోషించారో చెప్పలేను. అసలు ఈ బహుమతి కథ మా ఆవిడకే అంకితమివ్వాలి కాబట్టి ఆనందంతో తలమునకలై మా ఆవిడకు మంచి పట్టుచీర కొనిపెట్టాను. నాకు ధైర్యాన్నిచ్చి ముందుకు తోసింది ఆవిడే కదా. అంతే మరిక నేను తిరిగి చూడలేదు. అలా విరివిగా కథలు పత్రికల్లో వస్తూనే ఉన్నాయి. అడపాదడపా బహుమతులు గెలుచుకుంటూనే ఉన్నాయి. కాగితం పైన రాసి పంపడం మాత్రం కొంచం కష్టమయ్యేది. ఒక్కొక్కసారి ఆఖరు తేదీ దగ్గరపడి పోటీకి పంపడం ఆలస్యమై, స్పీడ్ పోస్టులో పంపాల్సి వచ్చేది.

ఆఫీసులో కొంచం కంప్యుటరుతో పరిచయం వుంది కనుక తెలుగు టైపింగ్ నేర్చుకుని ఇప్పుడు ఇ మెయిల్‌లో కూడా పంపడం అలవాటయింది. ఇప్పుడు అన్ని పత్రికలూ మెయిల్‌లో కూడా పంపవచ్చని చక్కగా కథలను ఆహ్వానిస్తున్నాయి.

ఆఖరి నిమిషంలో ఆలోచన వచ్చి అప్పటికప్పుడు కథ రాసి పోటీకి పంపి బహుమతి గెల్చుకున్న సందర్భాలు ఉన్నాయి. అలా వాట్సప్ సమూహాలలో చేరి సాహితీ మిత్రులతో కలసి చాలా సంగతులు పంచుకుంటూ, కొత్త విషయాలు తెలుసుకుంటూ కాలంతో  పరుగులు తీస్తున్నాను. ఇంకా నా తృష్ణ తీరక, ఇంకేదో సాధించాలని నా మనసు నన్ను నిద్రపోనిచ్చేది కాదు. సాహిత్యం ఒక తీరని దాహం అన్నారు కదా. ఈసారి  కవిత్వం రాసి ప్రయత్నించి చూద్దామని ఒక కవిత రాసి పంపితే వెంటనే పత్రికలో వచ్చేసరికి నా ఆనందానికి అంతు లేదు. కవిత్వం కూడా బాగా చదువుతూ రాస్తూ అందులోను బాగా నిలదొక్కుకున్నాను.

విభిన్న రకాలైన సామాజిక సమస్యలను స్పృశిస్తూ నేను రాసే కథలతో పాఠకులను ఆకట్టుకోవడమే కాక నాకు అంతులేని తృప్తిని మిగులుస్తోంది సాహిత్యం. మన చుట్టూ జరిగే మనసు కలచివేసే సంఘటనలను, మనుషుల భిన్న మనస్తత్వాలను అద్దం  పట్టే విధంగా రాసే కథ, కవిత్వం అందరికీ  నచ్చుతాయి కదా. ఈ మధ్య కాలంలో వచ్చినవే కాకుండా అంతకు మునుపు నేను చదవని ఎన్నో పుస్తకాలను, అనువాద సాహిత్యాన్ని  చదువుతూ ఇప్పుడు నేను ఇంట్లోంచే  ప్రపంచాన్ని చుట్టేస్తూ ఆ విషయాలన్నీ నా భార్యతో చర్చిస్తూ గడిపేస్తుంటే సమయమే తెలియట్లేదు.

మా చిన్న ఇంటి చుట్టూ కాసిని పూలమొక్కలను,

కూరగాయల పాదులను పెంచుకుంటూ, వాటికి నీరు పెడుతూ అక్కడే ఆరు బయట రెండు కుర్చీలు వేసుకుని నేనూ, నా శ్రీమతి ఉదయం సాయంత్రం వేడి కాఫీని ఆస్వాదిస్తూ తీరికగా ఎన్నో కబుర్లతో చలోక్తులతో సమయాన్ని ఆనందంగా కరిగిస్తున్నాం. చెప్పాలంటే ఇంతవరకు గడిచిన ఉరుకుల పరుగుల మా జీవితంలో ఇంత సంతోషంగా గడిపిన క్షణాలు మాత్రం ఇవే అని బల్ల గుద్ది మరీ ఇద్దరం చెప్పగలం. ప్రతి రోజూ ఆహ్లాదంగా తీరికగా సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని చూడడం ఎంత అదృష్టం. మన చుట్టూ ఉన్న చిన్న ప్రపంచంలోని అందమైన దృశ్యాలను కనులలో బంధిస్తూ, నచ్చినట్టు బతకడంలోనే కదా అంతులేని ఆనందం ఇమిడి ఉంది. ఈ విషయం తెలియక ఆనందాన్ని ఎక్కడెక్కడో వెదుకుతారు కొందరు. ప్రకృతిని మించిన సౌందర్యం ఏముంది ఈ జగతిలో.

డాక్టర్ దగ్గరకు వెళ్ళి చాలా రోజులవడం వల్ల నేను శ్రీమతి ఆరోగ్య పరీక్షలు చేయించుకోడానికి వెళ్ళాం. ఎప్పటినుండో నాకు బీపీతో పాటు షుగరు, ఆవిడకు కాస్త లోబీపి, పెద్దతనం వల్ల వచ్చిన చిన్న చిన్న నొప్పులు ఉన్నాయి. ఆవిడ అందుకే కాస్త ఉప్పు తగ్గించి కూరలు వండుతుంది. తీపి పదార్థాలు తినవద్దని కట్టడి చేస్తుంది. అయినా నేను బయటకు వెళ్ళినప్పుడు స్వీట్లు చూస్తే ఆగలేను. ఆవిడ చూడకుండా రహస్యంగా తినేస్తుంటాను. కాని ఇలాగ పరీక్ష చేసినప్పుడు పట్టుబడిపోయి, డాక్టర్ చేత, ఆవిడ చేత కాసిని అక్షింతలు వేయించుకుంటాను.

ఈసారి మాత్రం  డాక్టరు గారు  అన్ని పరీక్షల రిపోర్టులు చూసి ఎంతో ఆశ్చర్యపోయారు.

'ఏమిటి సర్.. ఈ మధ్య ఆహార అలవాట్లు మార్చి, వ్యాయామం ఎక్కువగా ఏమైనా చేస్తున్నారా ఏమిటి?' అని అడిగారు. ఎందుకలా అడిగారని అడుగుతూ ప్రశ్నార్థకంగా ఆయన వైపు చూసాను.

అన్ని రిపోర్ట్స్ నార్మల్‌కు దగ్గరగా ఉన్నాయంటూ చెబుతూ తీసుకోవల్సిన మాత్రల డోసు కూడా తగ్గించి రాసారు. ఇక ఆ విషయం విని చాలా ఆనందంగా అనిపించి బయట హొటల్‌లో తినేసి ఇంటికొచ్చి ఆలోచనగా తలపంకిస్తూ నా శ్రీమతి వైపు చూసి ...

'ఏమిటిది ఎప్పుడూ లేనిది ఈసారి రిపోర్టులు ఇలా ఆశ్చర్యపరిచాయి' అన్నాను.

'మీకు ఇష్టమైన పని చేస్తూ ఉద్యోగ ఒత్తిడి కూడా లేకుండా ఉన్నారు. అందుకే మీ రుగ్మతలన్నీ ఎగిరి పోయినట్టున్నాయి' అంది నవ్వుతూ. బాబోయ్ ఎంత తెలివైనది నా భార్య అనుకున్నాను ఆ క్షణంలో. ఆమె బుగ్గ మీద ఒక చిటిక వేసి 'అంతా నా శ్రీమతి మహిమేనోయ్' అంటూ చిలిపిగా నవ్వాను.

'చాల్లెండి మరీనూ బడాయి.. మీరు కష్టపడి రాసి పేరు తెచ్చుకుని నాకు కిరీటం ఎందుకు?' అంటూ ఏదో పాత పాట పాడుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది. నేను కూడా వెనకే వెళ్లి 'అది కాదోయ్.. ఇదంతా నీ సహకారం, ప్రోత్సాహం వల్లే కదా' అన్నాను.

ఆ రోజు రాత్రి నాకు బుర్రలో ఒక మంచి ఆలోచన మెరిసింది. సాయంత్రం నా మిత్రులతో మంచి సంగీతం టీచర్ ఎక్కడున్నారో తెలుసుకుని, ఏ ఏ సమయాల్లో క్లాసులు చెబుతారో ఆరా తీశాను. అన్ని వివరాలు కనుక్కుని నా శ్రీమతికి విషయం వివరించాను. ఆమె సిగ్గుపడుతూ

'నాకు ఈ వయసులో సంగీత పాఠాలు ఏంటండి?' అన్నది.

'ఏ విద్య అయినా నేర్చుకోవడానికి వయసు ఎప్పుడూ అడ్డు కానేకాదు' అన్నాను.

మొత్తానికి ఆమెను ఒప్పించి సంగీతం క్లాసులో జాయిన్ చేసాను. నేను సాయంత్రం పార్కుకు వెళ్ళినపుడు ఆవిడను సంగీతానికి దింపి మళ్ళీ నేను ఇంటికి వచ్చినపుడు తీసుకొచ్చేస్తాను. ఎప్పుడో ఒకసారి ఆవిడకు చిన్నప్పుడు సంగీతం నేర్చుకోవాలని ఉండేదని కాని ఎందుకో నేర్చుకోలేకపోయానని చెప్పిన సంగతి నాకు అనుకోకుండా గుర్తుకురావడం చాలా మంచిదైంది. నేను ఆవిడా మా అభిరుచులకు అనుగుణంగా మా జీవితాన్ని అందంగా మలచుకుని ఎంతో హాయిగా ఉంటున్నాం. ఇప్పుడు మాకు ఒక పది సంవత్సరాల వయసు తగ్గినట్టుంది. అవును.. మనకు నచ్చినట్టు, మనకు ఇష్టం వచ్చినట్టు, అవకాశం వచ్చినపుడు హాయిగా వినియోగించుకుంటూ, ఆనందాన్ని సొంతం చేసుకుంటూ ప్రతి క్షణాన్ని ఆస్వాదించడమే కదా జీవితం అంటే! ■

# కవిత

## కాలనీ



- డాక్టర్ ఉదారి నారాయణ

94414 13666

మట్టి బంధం నుంచి దూరమైన
పల్లెల అవశేషమిది
సిటీ చెట్టుకు పూసిన
రంగు రంగుల పూల కొమ్మ ఇది
భూస్వాముల ఆధిపత్యం పడగ నుంచి
విముక్తులైన
వలస జీవుల ధైర్య శాల ఇది!

చేతికొచ్చిన పిల్లలు కీళ్ళరిగిన పెద్దలు
పైకి పాక లేక కిందికి దూకలేక
వింత పోకడల జీవితమిది
చిక్కు ముడులు విప్పలేక
బయట కక్కలేక లోలోన
కుమ్ములో ఉడుకుతున్న బడితెం బతుకులివి

లోపల సమస్యల పొగని
నిశ్శబ్ద యుద్ధాల రొదని
నల్ల కిటికీ రెప్పలు కాపలా కాస్తుంటాయి
పొద్దున వార్తా పత్రికతో మొదలై
దినం రాత్రిలోకి సద్దు మణిగేదాక
సమస్యల గానుగు చుట్టూ తిరిగే
నెలవారి సగటు సంసారాలివి!

కోరికలు చల్లారవు
తీరికలు వెన్నుకందవు
నయా హంగుల భవనాలు
మైమరపించే నగిషీలు
ఇక్కడ అందరి జీవన ప్రయాణం ఒక్కటే
ప్రామాణిక ఆలోచనలే తేడా !

ఈ గల్లీలో దేవుడు చందాల
పీటమీద దర్శనమిస్తాడు
సారాయుళ్ల మత్తులో ఉరేగుతాడు
రహస్యాతి రహస్యంగా అప్పుడప్పుడు
సంస్కృతి పేరుతో కులం మతం
కుబుసమిడుస్తాయి!

కన్ను తెరిచినా మూసినా పిడికెడు మందితోనే
ఎవరింట్లో వాళ్లే ఎవరెస్టులు
జియో టవరుకి వేలాడే గబ్బిలాలు
వైఫైలు సెల్ ఫోన్లు కార్ల హొయలు
ఇంటి గుట్టును హుందాగా చూయించే
సైబర్ ఫిరంగులు

మావాడు చైతన్యలో ఫస్ట్
మావాడు నారాయణలో టాప్
మొబైళ్ళు నిద్ర పోకుండా టైంలెస్ కబుర్లు
ఇక్కడి మెట్ల కింది కీచురాళ్లు కూడా
కార్పొరేట్ పాటనే పాడతాయి
గోరంత ఫలితానికి కొండంత
కరెన్సీ ఎరువును చదువుల పొలాల్లో వెదజల్లే
చదరంగ రణ భూమి ఇది!

దేశ రాజకీయాలన్నీ
ఇక్కడే పదునెక్కుతాయి
బయట స్వదేశం లోన పరద్వేషం
నిరంతరం బుసలు కొదుతున్న
సమైక్య సహజీవనం ఈ కాలనీ!

వర్తమానం



# హైకోర్టు తీర్పు కానరాని మార్పు

- తెలకపల్లి రవి

అమరావతిలో రాజధాని నిర్మాణాన్ని యథాతథంగా కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును వైసీపీ మినహా అన్ని పార్టీలూ స్వాగతించాయి, దాన్ని శాసన రాజధానిగా పరిమితం చేసి పాలనా రాజధానిని విశాఖపట్టణంలోనూ, న్యాయ రాజధానిని కర్నూలులోనూ ఏర్పాటు చేయాలని 2020 జనవరిలో మళ్లీ ఆగస్టులో రెండుసార్లు ఎపి శాసనసభ బిల్లు ఆమోదించడం తీవ్ర ప్రతిష్టంభనకు దారితీసింది. 807 రోజులుగా రైతులు దీక్షా శిబిరాలు నడుపుతున్నారు. ఆ సమయంలో హైకోర్టులో దాఖలైన పిటిషన్లు గత రెండేళ్లుగా విచారణలో ఉన్నాయి. ఈలోగా హైకోర్టులో ముగ్గురు ప్రధాన న్యాయమూర్తులు మారారు. గత నవంబరులో ఆ బిల్లును వెనక్కు తీసుకుంటూ ప్రభుత్వం రద్దు బిల్లును ఆమోదించింది. అదే సమయంలో పాలనా వికేంద్రీకరణ తమ విధానమనీ, మరింత పటిష్టంగా లోపరహితంగా కొత్త బిల్లు తెస్తామని ప్రకటించింది. గతంలో రెండుసార్లు వాయిదా పడిన ఈ కేసు విచారణను పున:ప్రారంభించిన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి ప్రశాంతకుమార్ మిశ్రా, న్యాయమూర్తులు సోమయాజులు, సత్యనారాయణ మొదటినుంచి మళ్లీ వాదనలు విన్నారు. రాజధాని ఎక్కడ వుండాలో తాము చెప్పబోమని, ముందే ప్రకటించారు. ఏడవ తేదీ నుంచి మొదలయ్యే బడ్జెట్ సమావేశాల్లో మరోసారి వికేంద్రీకరణ బిల్లు తీసుకు వస్తారనే ఊహాగానాల మధ్య హైకోర్టు తీర్పు వెలువరించడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ తీర్పుతో తమ విధానం మారబోదని ప్రభుత్వం ప్రకటించగా గత పాలకపార్టీ అయిన తెలుగుదేశం ఇది తమ విజయమన్నట్టు హడావుడి చేస్తున్నది. ఉభయ కమ్యూనిస్టులు ఈ తీర్పును అమలు చేసి రాజధాని వివాదం ముగించాలని కోరాయి.

### సిఆర్‌డిఏ ఒప్పందాల ఉల్లంఘన

అమరావతిలో రాజధాని నిర్మించడం కోసం శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అందుకోసం ఎపిసిఆర్‌డిఎను నెలకొల్పింది, అభివృద్ధి చేసిన ప్లాట్లు, వాణిజ్య ప్లాట్లు కేటాయించడం, కౌలు ఇవ్వడం ప్రాతిపదికగా రైతులనుంచి 34 వేల ఎకరాలు సేకరించింది. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామనీ, పదేళ్లనాటికి ప్రపంచ స్థాయి నాణ్యతతో దాన్ని పెంపొందిస్తామని మాట ఇచ్చింది. ఎపిసిఆర్‌డిఎ 9.14 కింద జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జిపిఎ)చేసుకుని ఆ భూమిని స్వాధీన పర్చుకుంది. కాని ఇప్పటికీ వారికి ప్లాట్లు అప్పగించడం పూర్తికాలేదు, మౌలిక సదుపాయాలు భవనాల నిర్మాణం జరగలేదనీ హైకోర్టు పేర్కొంది. 2019లో వచ్చిన ప్రభుత్వం మూడు రాజధానుల విధానం తీసుకోవడంతో అమరావతి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రామిసరీ ఇస్టోపిల్ సూత్రం ప్రకారం సిఆర్‌డిఎ ప్రభుత్వం చేసిన వాగ్దానం నిలబెట్టుకోలేదు. ఒక కాంట్రాక్టులో ఉభయపక్షాలు తమ మాటకు కట్టుబడివుండాలి. ప్రభుత్వమే ఆ స్థానంలో వుంటే మరింత బాధ్యతగా వ్యవహరించాలి. తన చేతిలో శాసనాధికారం వుందని ఇష్టానుసారం దుర్వినియోగం చేసి ఒప్పందం

కట్టుబాటును ఉల్లంఘించకూడదు. ఈ ఏడేళ్లలో వివిధ రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాల కోసం ఇంచుమించు రూ.15 వేల కోట్లు ఖర్చు అయింది. అర్ధంతరంగా వదిలివేయడంతో ఆ ప్రజాధనం వృథా అవడమే గాక భూములిచ్చిన రైతుల జీవనోపాధి దెబ్బతినిపోయింది. ఆస్తిహక్కుకు విఘాతం కలిగింది. సుక్షేత్రాలైన వారి భూములు పడావు పడ్డాయి. అభివృద్ధి పనులు పూర్తిచేయడం జరగలేదు గనక ఈ ప్రాంతం వెనకబడి పోయింది. ఇది కాంట్రాక్టు చట్టంలోని 202 సెక్షన్‌ను మాత్రమే గాక 21వ అధికరణం కింద జీవించే హక్కుతో సహా ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే. సిఆర్‌డిఎతో కుదుర్చు కున్న ఒప్పందం మేరకు వారు ఈ విషయమై ఎలాటి న్యాయస్థానంలోనూ కేసు వేయకూడదు. మూడు రాజధానుల బిల్లు మేరకు అమరావతిని శాసన రాజధానిగా పరిమితం చేసేట్టయితే వారు భూములు ఇచ్చేప్పుడు ఆశ చూపించిన అభివృద్ధి గాని, ఆర్థిక లబ్ధిగాని జీవనోపాధి గాని లభించవు. ఇప్పుడు ఆ బిల్లును వెనక్కు తీసుకున్నాము గనక విచారణ అవసరం లేదని ప్రభుత్వం, సిఆర్‌డిఎ న్యాయవాదులు వాదిస్తున్నారు. భవిష్యత్తులో తెచ్చే వికేంద్రీకరణ శాసనం ఎలా వుంటుందో తెలియకుండా ఊహాజనితంగా కేసు విచారణ జరపకూడదని అడ్వకేట్ జనరల్ చెబుతున్నారు. కాని భూము లిచ్చిన రైతులకు ఇప్పటికే జరిగిన నష్టంతో పాటు భవిష్యత్తు లోనూ దెబ్బ తగిలే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది గనక మేము జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఎపిసిఆర్‌డిఎ చట్టం, 9.14జిపిఎ ప్రకారం అమరావతిలో గతంలో అనుకున్న విధంగానే రాజధానిని నిర్మించాలని, ఏ కార్యాలయాన్ని ఏ విభాగాన్ని ఎక్కడికి తరలించరాదని ధర్మాసనం తీర్పులో పేర్కొంది.

### నెలల్లో గడువు, నిరంతర సమీక్ష

రాజధాని నిర్మాణంపై రైతులతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించడానికి కారణాలు లేవని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రామిసరీ ఇస్టొపిల్ కింద ఒప్పందాన్ని తోసిపుచ్చడం ప్రజా ప్రయోజనం కింద మాత్రమే అనుమతించవచ్చు.ఇక్కడ అలాటి ప్రయోజనం వుందని నిరూపించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫల మైంది. వికేంద్రీకరణతో వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి పేరుతో ఇక్కడ భూములిచ్చినవారిని వెనకబాటులోకి నెట్టడం సమంజసం కాజాలదు.పైగా హైకోర్టును ఎక్కడ ఏర్పాటు చేయాలో నిర్ణయించేది సుప్రీం కోర్టు కాగా ఆదేశాలిచ్చేది రాష్ట్రపతి. శాసనసభ దీనిపై నిర్ణయం తీసుకోవడానికి లేదు.అమరావతిలో శాసన రాజధానిని కొనసాగించినా దానివల్ల వాగ్దానం చేసిన ప్రకారం అభివృద్ధి ఉండదు. 163 అధికరణం కింద గవర్నర్ శాసనసభను ఎక్కడైనా సమావేశపర్చవచ్చు. అదే జరిగితే శాసన రాజధాని భావనకే అర్థం ఉండదు. సమగ్ర రాజధానిగా పెంపొందిస్తామనీ, నవ నగరాలతో అవకాశాలు మెరుగవుతాయని ఆశపెట్టి భూములు తీసుకున్న తర్వాత ఇన్నేళ్లకు కూడా ఎలాటి పురోగతి లేకపోవడాన్ని న్యాయస్థానం ప్రత్యేకంగా ప్రస్తావించింది. నెలలో మౌలిక సదుపాయాల కల్పన, మూడు మాసాలలో ప్లాట్లు అప్పగింత, ఆరు మాసాలలో మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్మాణం పూర్తి చేయాలని నిర్దేశించింది. నిధులు లేవన్న వాదనను కూడా తోసిపుచ్చుతూ 38వ అధికరణం కింద ప్రభుత్వం అనేక పథకాలకు డబ్బు వెచ్చిస్తున్న సంగతి పేర్కొంది. ఇంత వేగంగా పూర్తి చేయడం ఆచరణ సాధ్యమా అన్న ప్రశ్నలు ముందుకు రావడానికి ఇది దారి తీసింది. పైగా కంటిన్యుస్ మాండమస్ (నిరంతర పర్యవేక్షణ) కింద రాబోయే కాలంలోనూ రాజధాని పనుల పురోగమనాన్ని తాను సమీక్షిస్తుంటాననీ, ఎప్పటికప్పుడు ప్రభుత్వం అఫిడవిట్లు సమర్పించాలని కోర్టు పేర్కొంది. తీర్పులోని ఈ భాగం చాలా అరుదైనదిగా చెబుతున్నారు. ఇందుకోసం నలభై పిటిషన్ల విచారణ కోర్టు అట్టిపెట్టుకుంది. ఇందువల్లనే సుప్రీం కోర్టు జోక్యం చేసుకోకపోవచ్చని ఒక అభిప్రాయం.

### అధికారానికి పరిమితులు

ఈ సందర్భంగా కోర్టు రెండు ముఖ్యమైన భావనలు పొందు పర్చింది. లెజిస్లేటివ్ ఎక్స్‌పెక్టేషన్స్, లెజిస్లేటివ్ కాంపిటెన్సీ. (శాసనపరమైన అంచనాలు, శాసనాధికారం) ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకున్న సమయంలో భూములు ఇచ్చిన వారు గాని ఇతరత్రా గాని రాబోయే శాసనాలపై కొన్ని అంచనాలు పెట్టుకుంటారు. అసాధ్యమైన పరిస్థితులు వుంటే తప్ప వాటిని నెరవేర్చవలసిన బాధ్యత చట్టసభలపై వుంటుంది. వాటికి నష్టం కలిగించే విధంగా చేయడం రాజ్యాంగ నైతికత కాదు. ఇక్కడ సిఆర్‌డిఎ ఇచ్చిన హామీలకు భిన్నంగా విధానాన్ని మార్చడం కోసం చేసే వాదనలు దురుద్దేశపూరితంగా వున్నాయని అనాల్సి వస్తుంది.

రాజధాని విషయంలో రాష్ట్రానిదే అధికారం అని కేంద్రం కోర్టుకు చెప్పింది. అయితే రాజ్యాంగం 2, 3, 4 అధికరణాల ప్రకారం రాష్ట్రాల ఏర్పాటు విభజన, రద్దు వంటివి జరిగినప్పుడు పార్లమెంటు నుంచి మాత్రమే శాసనసభకు అధికారం

సంక్రమిస్తుందని కోర్టు వివరణ ఇచ్చింది. ఎపి విభజన చట్టం ప్రకారం ఒకసారి ఆ అధికారాన్ని ఉపయోగించి ఏకగ్రీవంగా రాజధానిని నిర్ణయించారు. దాంతో ఆ అధికారాన్ని వినియోగించడం పూర్తయిందని ధర్మాసనం అభిప్రాయపడింది. దాన్ని తరలించడానికి గాని, లేక మూడు విభాగాలను మూడు చోట్లకు తరలించడానికి గాని శాసనసభకు అధికారం వుండదని తేల్చి చెప్పింది. ఇది కొంత విపరీతంగా కనిపించినా ప్రస్తుత వివాద నేపథ్యంలో రాజధాని మార్పులు ఎడతెగని వ్యవహారంగా వుండరాదన్న స్ఫూర్తి కనిపిస్తుంది. అంటే రాజధాని నిర్ణయం, మూడుగా విభజన, మళ్లీ దాన్ని రద్దుచేయడం, ఇప్పుడు మరో రూపంలో తేవడం అంటే నాలుగు సార్లు మార్పులు చేయడం నిస్సందేహంగా అసాధారణమే. రేపు మరో ప్రభుత్వం మరోసారి మార్పులు చేస్తానే వుండొచ్చా? ఈ విషయంలో శాసనాధికారానికి లిమిటేషన్ (పరిమితి) ఉంటుందని కోర్టు అభిప్రాయపడింది. ఉన్న ఫళాన (సూమోటో)గా రాజధాని మార్చే అధికారం వుండదని హైకోర్టు తేల్చింది. ఇది శాసనసభ అధికారాన్ని కుదించడమే గనక సుప్రీంకోర్టులో సవాలు చేయొచ్చని చెబుతున్నారు. రాజధానిపై గతంలో మూడుసార్లు సుప్రీంకోర్టులో రాష్ట్ర వాదనలు వీగిపోయాయి. ఇప్పుడు వెళ్లినా ప్రయోజనం వుండదనే భావన ప్రభుత్వ వర్గాల్లో నెలకొంది. కొద్ది మాసాలు నిరీక్షించడమా లేక మరో కోణంలో వెళ్లడమా అని తర్జనభర్జన పడుతున్నది. పైగా ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులను నాట్ బిఫోర్ చేయాలని ఒక అధికారి కోరిన దాన్ని తీర్పులో వ్యంగ్యంతో ముందే తోసిపుచ్చారు. ఏదో రూపంలో ఈ ఘర్షణ ఇంకా సాగుతూనే వుందని గమనంలో ఉంచుకోవాలి.

### మూడు ప్రభుత్వాల తప్పిదాలు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను లెక్కలను కోర్టు తీర్పులో వివిధ చోట్ల పొందుపర్చారు. నిధుల కొరత వాదనతోనూ ఏకీభవించలేదు, అయితే నిధుల కొరత నిజమే. ఈ దుస్థితికి గత ప్రస్తుత ప్రభుత్వాలు కేంద్రం కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఉదాహరణకు తెలుగుదేశం ఇది తన విజయమే నన్నట్టు చెబుతుంది గాని మొదటి జాప్యం అక్కడే జరిగింది. అలాగే దాంతో కలిసి రాష్ట్రాన్ని పాలించిన, ఇప్పటికీ కేంద్రాన్ని పాలిస్తున్న బిజెపి ఈ తీర్పును స్వాగతించింది. అయితే అంతకుముందు రోజే బడ్జెట్‌లో లక్ష రూపాయలు రాజధాని నిర్మాణాలకు కేటాయించినట్టు వార్త వచ్చింది. లక్షకోట్ల పాట ముందు లక్ష ఇవ్వడం నవ్వులాటే. హైకోర్టు తీర్పులో అవి సూచన ప్రాయంగా కూడా లేవు. మొత్తంపైన విభజన తర్వాత ఎనిమిదో ఏట కూడా రాజధానిపై అస్పష్టత ఆందోళన కలిగిస్తుంది. నష్టం కూడా చేస్తుంది. ఈ తీర్పు తర్వాతనైనా దాన్ని ముగించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. రాజకీయ వైరుధ్యాలు ఎలా వున్నా ప్రజలందరి ఆశ. వికేంద్రీకరణ తప్పనిసరిగా జరగాల్సిందే గాని అది రాజధాని విభజన రూపంలోనా?అందరూ అంగీకరించిన హైకోర్టు కర్నూలు తరలింపు అభ్యంతరంగా మారడం ఈ కేసు మొత్తానికి అదే కీలక వాదన కావడం గమనార్హం.

### కిం కర్తవ్యం? జగన్ వ్యూహం!

ఈ సుదీర్ఘమైన తీర్పులో సాంకేతికంగా చెప్పుకోవాల్సిన అంశాలు చాలా వున్నాయి. కాని ఇప్పుడు ఈ తీర్పు అనంతరం ప్రభుత్వ వైఖరి ఎలా వుండబోతున్నదీ ఇప్పటికే దాదాపు వెల్లడై పోయింది. తీర్పు వెనువెంటనే మాట్లాడిన మంత్రులు బొత్స సత్యనారాయణ వంటివారు తమ విధానంలో మార్పు లేదనీ, కోర్టుతీర్పు అధ్యయనం తర్వాత ఎలా ముందుకువెళ్లేది చూస్తామని అన్నారు. రియల్ మాఫియా, సామాజిక వర్గం వాదనలు మళ్లీ వినిపించారు. మరుసటిరోజు సజ్జల రామకృష్ణా రెడ్డి కూడా అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడివున్నామంటూ అమరావతిలో నిధులు మొత్తం వెచ్చించలేమన్నట్టు మాట్లాడారు. కొన్ని లెక్కలు అనేక వాదనలు చేశారు. విశాఖలో ముఖ్యమంత్రి మకాం కార్యక్రమాలు పెంచడం, కర్నూలులో జగన్నాథగట్టుపై న్యాయసముదాయం (హైకోర్టు రహితంగా), ప్రత్యామ్నాయంగా చూపించడం తదుపరి చర్యలుగా కనిపిస్తున్నాయి. అమరావతికి సంబంధించి గతంపై ఆరోపణలు చేయడం తప్ప అసంపూర్ణంగా వున్నవాటినైనా పూర్తిచేయడంలో, పూర్తయినవాటిని కేటాయించడంలో ఈ ప్రభుత్వం ఎలాటి నమూనా చూపించలేక పోయింది. అమరావతికీ ఇతర ప్రాంతాలకు మధ్య పోటీ అనేది రాబోయే రోజుల్లో జగన్ ప్రభుత్వ రాజకీయ వ్యూహంగా ప్రచారాస్త్రంగా వుండబోతున్నట్టు కనిపిస్తుంది. ఇది నిజంగా వికేంద్రీకరణ కంటే వివాదాలు కొనసాగడానికి, దారితీస్తే ఆశ్చర్యం లేదు. ఇందులో కుల వాదనలు కూడా చొరబడటం ఇంకా అవాంఛనీయం. ఇప్పటికే విభజనతో దెబ్బతిని రాజధాని రహితంగా ఎపిని మరోసారి అయోమయావస్థలోకి నెట్టడం ఏ విధంగానూ అనుమతించ రానిది. వాదన ఏదైనా అది ఎవరికీ మేలు చేయదు.

**(6.3.2022 ప్రజాశక్తి దినపత్రిక నుంచి)**



# ఇంజెక్షను

- దారల విజయ కుమారి
91771 92275

**మి**షనరీ హాస్పిటల్. మేల్ మెడికల్ వార్డు. రాత్రి రెండు కావస్తూంది. దాదాపు 30 మంది పేషెంట్లు ఉన్నారు. ఇద్దరికి సెలైన్ పోతోంది. వాళ్ళు చేయి కదిలించకుండా పట్టుకుని కూర్చోనున్నారు పక్కన ఆడవాళ్ళు.

బ్యాక్ రెస్ట్ వేసి ఆనించి పడుకోపెట్టారు మరో ఇద్దరినీ. నిద్రపోతున్న పేషంట్ల దగ్గర జీరో లైట్లు వెలుగుతుంటే ట్రీట్మెంట్‌లో ఉన్నవాళ్ళ దగ్గర ట్యూబ్ లైట్ల వెలుగు ఎక్కువగా ఉంది.

వార్డుకు చివర గోడకు దగ్గరగా ఒక పెద్ద టేబుల్ రెండు కుర్చీలు.. మరోవైపు ఒక బెంచి ఉన్నాయి. బెంచి పైన కూర్చొని కేస్ షీట్స్ ఒక్కొక్కటి చూస్తూ రేపు ఉదయం ఎవరెవరికి ఏఏ పరీక్షలు ఉన్నదీ లిస్టు రాసుకుంటోంది సిస్టర్. తెల్లటి యూనీఫాం.. అప్పర్ లోయర్ పైన.. తెల్లటి కోటు.. కోటుకు ఎడమ చెస్ట్ పైన నీలిరంగులో డి.జ్యోతి, స్టాఫ్ నర్స్ అన్న చిన్న నేమ్ ప్లేట్. నైట్ డ్యూటీకి రాగానే ప్రతి పేషంట్ గురించీ రిపోర్ట్ టేకోవర్ తీసుకుని.. అందరికీ వైటల్స్ చెక్ చేసి.. 10 గంటలకు, 12 గంటలకు ఇవ్వాల్సిన డ్యూ ఇంజెక్షన్లు.. మాత్రలు ఇచ్చేసి.. ఒకసారి వార్డంతా కలియ దిరిగి.. ఇక ఏ కంప్లైంట్స్ లేవని నిర్ధారించుకుని కూర్చొని నెమ్మదిగా రాసుకుంటోంది.

జ్యోతి సిస్టర్ అంటే అందరికీ ఇష్టం. స్వచ్ఛంగా నవ్వుతూ పలకరిస్తూ.. వారి సమస్యలను ఓపికగా వింటూ.. బాధ తెలియనీకుండా మాట్లాడుతూనే ట్రీట్మెంట్ చేసే తన కోసం ప్రతి పేషంటూ ఎదురుచూస్తారు. జబ్బు నయమై వెళ్లి పోతూ ఫోన్ నెంబర్, అడ్రస్ అడిగేవారు కొందరు.. బిడ్డలా అక్కలా భావించే వారు కొందరు. సున్నితంగా తిరస్కరిస్తూ.. ఆమోదిస్తూ ఉంటుంది చిరునవ్వుతోనే. సిస్టర్ అనే పదం ఆమెకు చాలా యాప్ట్‌గా ఉంటుంది. జీతం కోసమే పనిచేసే వాళ్ళు చాలా మంది ఉంటారు. వారిలో జీతం అవసరంతో పాటు ఇచ్చిన పనిని నిజాయితీగా నిక్కచ్చిగా చేసే వారు తక్కువ మందే ఉంటారు. అలాంటి వారిలో జ్యోతి సిస్టర్ ఒకరు. ఆమె వార్డులోకి ఎంటర్ కాకనే.. ఆమె చిరునవ్వు మొదట ఎంటర్ అవుతుంది.

ఆమెకిచ్చే జీతంలో రెండు శాతం చాలా చిన్న మొత్తమే అయినా.. దాంతో పూర్తిగా పేద పేషెంట్లకు బ్రెడ్డు, పండ్లు లాంటివి తెచ్చి ఇస్తుంటుంది. ఏ వార్డులో డ్యూటీ వేసినా ఏ డ్యూటీ చేయమన్నా మారు మాట్లాడకుండా చేస్తుంది. డాక్టర్లకు సిబ్బందికి ఆమెపై చాలా నమ్మకం. ఆమె వ్యక్తిగత వివరాలు ఎవరితోనూ పంచుకోదు. ఎవరి సొంత విషయాలపైనా ఆసక్తి చూపదు. ఆడంబరంగా ఉండటం బహుశా ఎవరూ చూసిండరు. అంత చిన్న వయసులోనే ఇంత దక్షత ఎలా అబ్బిందో అని అందరికీ ఆశ్చర్యం. ఎంతో మంది పేషెంట్లు వస్తుంటారు. రికవరీ అయి వెళ్తుంటారు. ఎవరితోనూ చనువును పెంచుకోదు.

అలాంటిది ఈమధ్య భాస్కర్ అల్లరికి బాగా నవ్వుతూ ఎంటర్‌టైన్ అవుతోంది. ఇరవై ఐదేళ్ళ భాస్కర్ కడుపునొప్పితో అడ్మిట్ అయ్యాడు వారం క్రితం. చాలా కలివిడిగా ఉంటాడు. 'నాకు కాస్త బాగా అవనివ్వండి.. నేనే మీకు హెల్ప్ చేస్తాను' అంటుంటాడు. సెలైన్ అయిపోతుంటే ఆ స్టాపర్‌ను కిందికి లాక్ చేసి, సిస్టర్ సెలైన్ అయిపోయింది. ఇంకా ఏమైనా పెడతారా.. స్టాప్ చేసాను.. పర్లేదు నెమ్మదిగానే రండి' అని కేకలేసి చెబుతుంటాడు.

అపుడపుడు నొప్పి వస్తూనే ఉంది. ఏవేవో ప్రొవిజినల్ డయాగ్నోసిస్‌లు చేసినా.. ఇంకా కరెక్టుగా ఎగ్జాక్ట్‌గా జబ్బును నిర్ధారించలేదు.

భాస్కర్ వచ్చాక వార్డంతా సందడిగా ఉంటోంది. టాయిలెట్‌కని అడిగి వెళ్ళి.. వస్తూ వాళ్ళ మంచాల దగ్గరికి వెళ్ళి అందరినీ పలకరిస్తుంటాడు. ముసలోళ్ళతో చాలా పరాచికాలాడ్తాడు.

జ్యోతి చిరునవ్వు నవ్వితే 'ఇంకాస్త కూడా నవ్వండి సిస్టర్.. మరేం పర్లేదు' అంటుంటాడు. అలా 'మరేం పర్లేదు' అన్నది చాలాసార్లు అంటుంటాడు.. ఏదో మ్యానరిజం లాగ.

నిన్న రాత్రి చెప్పాడు : మా ఊరు చాలా బాగుంటుంది. కాకపోతే ఈ మధ్యనే కాస్త సీరియస్‌గా బిహేవ్ చేస్తున్నారు ఊరోళ్ళు. మీరు గాని ఓసారి వచ్చారనుకోండి. అందరికీ మీ చిరునవ్వులను అంటించేస్తారు. ఇక మా అమ్మ.. ఉత్త తిక్కది నాకేదో అయిపోయిందని దిగులు పెట్టేసుకుంది. వచ్చారను కోండి.. ఒక గొర్రెనే తోలిచ్చేస్తుంది. నెయ్యి కూడా కట్టి పంపిస్తుంది. అంత మంచి కాచిన నెయ్యి మీరు తినే ఉండరు. మరేం పర్లేదు. ఈసారికి ఒచ్చేయండి ఓ మారు మా ఊరు' అని వెంట తిరిగి తిరిగి చెప్పాడు. రాస్తూ రాస్తూ గుర్తొచ్చిందేమో భాస్కర్ వైపు చూసి తనలోనే తాను నవ్వుకుంది జ్యోతి.

మూడున్నర దాటుతోంది. రాసుకోవడం ఆపి, టేబుల్ పైన తలపెట్టుకుని కళ్ళు మూసుకుంది. నిద్ర పట్టింది. సడెన్‌గా ఏవో అరుపులు.. గోల. ఉలిక్కిపడి లేచింది. ఒకరిద్దరు హడావుడి పడుతున్నారు. కేకలేసి పిలుస్తున్నారు. దాదాపుగా పరిగెత్తు కుంటూ వెళ్ళింది. భాస్కర్ కడుపు పట్టుకుని లుంగచుట్టుకు పోతూ అల్లాడి పోతున్నాడు. డాక్టర్‌కు కాల్ చేసింది. మానిటర్ కనెక్ట్ చేసింది. డాక్టర్ వచ్చి చెక్ చేసి 'సిస్టర్ బుస్కోపెన్ ఇంజెక్షన్ ఇవ్వండి. ఎమర్జెన్సీ సీటీ అబ్డామిన్ చేయాలి. రేడియాలజీకి షిఫ్ట్ చేయండి' అని అన్నారు.

జ్యోతి కదిలిపోతోంది. భాస్కర్‌ను అలా చూస్తూ బాధపడ్తూనే ఇంజెక్షన్ లోడ్ చేసుకుని వచ్చింది.

ఇంజెక్షన్ వేసాక పది నిమిషాలకు ఎగిరెగిరి పడిపోవడం మొదలైంది. బిపీ పైల్స్ చాలా పెరిగిపోతూ.. ఏవేవో చేసినా పరిస్థితి చేయి దాటిపోయింది. దాదాపుగా ఆరు గంటలవు తుండగా భాస్కర్ చనిపోయాడు. చాలా షాకింగ్‌గా ఉంది. వార్డులో దాదాపు అందరూ ఏడుస్తున్నారు.

ఆ బెడ్ చుట్టూ స్క్రీన్ పెట్టడం వాళ్ళ వాళ్ళకు ఇంటిమేషన్ ఇవ్వడం జరిగిపోయింది. జ్యోతి తన సర్వీస్‌లో ఎన్నో మరణాలను చూసింది. కాని ఇంత బాధ ఎన్నడూ కలగలేదు. తనను తానే కన్సోల్ చేసుకుంటూ.. హడావుడిగా పడేసిన పరికరాలు.. ఇంజెక్షన్లు సర్దింది.

ఉదయం వార్డు హేండోవర్ ఇస్తూ ఇంచార్జి సిస్టర్‌ను పట్టుకుని ఏడ్చేసింది. ఆమె వయసులో పెద్దామె. 'ఏయ్ ఏంటి చిన్నపిల్లలా.. ఎవరైనా ఏమైనా అన్నారా.. రెస్ట్ దొరకడం లేదా.. ఆఫ్ కావాలా.. ఏదో చెప్పు.. మెడికల్ ఫీల్డ్‌లో ఉండి ఇలా ఏడుస్తారా? పిచ్చి పిల్లా ఇంటికెళ్ళి బాగా నిద్రపో' అని సముదాయించింది.

రోజులు గడుస్తున్నాయి. గుర్తు కొచ్చినప్పుడంతా జ్యోతి ఏడుస్తూనే ఉంది. మునుపటి ఉత్సాహం.. ముఖంలో చిరునవ్వు తగ్గిపోయాయి. ఒక రోజు ఎప్పట్లా పనులన్నీ అయిపోయాక టేబుల్ పైన తలపెట్టుకుని నిద్రలోకి జారుకుంది. ఒక చేతి సంచి పట్టుకుని.. 'సిస్టర్..' ఎవరో పిలుస్తున్నారు.

'సిస్టర్.. నేనండి.., ఉడికించిన వేరు సెనక్కాయలు.. అమ్మ మీకు ఇచ్చిరమ్మంది' అంటూ నవ్వుతూ.

ఎదురుగా నిలబడ్డాడు భాస్కర్. కలలోంచి దిగ్గున లేచేసింది జ్యోతి. వార్డు చూసింది. అందరూ నిద్రపోతున్నారు. భాస్కర్ ఉన్న బెడ్ చూసింది. మరో పేషంట్ ఉన్నాడు. దు:ఖం పొంగుకొచ్చింది జ్యోతికి. ట్రీట్మెంట్ రూంలోకి వెళ్లి వెక్కిళ్లు పెట్టింది.

♦ ♦ ♦

ఆ మరుసటి రోజు నైట్ డ్యూటీకి మేల్ వార్డులోకి మరో కొత్త సిస్టర్ వచ్చింది. పేషెంట్లు ఆ సిస్టర్‌ను అడుగుతున్నారు.

'జ్యోతి సిస్టర్ రాలేదా' అని.

'ఆమె రాజీనామా చేసి వెళ్ళిపోయింది.'

పేషంట్స్‌కు పెద్ద షాక్.

'ఎందుకు సిస్టర్'

'నాకూ సరిగ్గా తెలియదు. పనిష్మెంట్ ఇవ్వండి అని తనే ఏదో అర్జీ పెట్టుకుందట. అందరూ విచిత్రంగా మాట్లాడు కుంటున్నారు' జవాబు చెప్పేసి పనిలో లీనమైంది కొత్త సిస్టర్.

♦ ♦ ♦

ఇంచార్జి సిస్టర్ ఎమర్జెన్సీ డ్రగ్స్ ట్రే సర్దుకుంటోంది. కాస్సేపటికి ఒకటే కేకలేసింది. అందరినీ 'ఈ బుస్కోపెన్ ఇంజెక్షన్ వరుసలో అడ్రినలిన్ పెట్టిందెవరు? అవి కూడా రెండు తక్కువ ఉన్నాయ్. ఎవరికి వాడారు? ఎవరికీ బాధ్యత లేదా? అడుగుతుంటే ఎవరూ మాట్లాడరేం? మీ అందరికీ మెమో ఇప్పిస్తా..' ఎదురుగా నిల్చున్న వారు ఏమీ మాట్లాడలేకుండా అలాగే చూస్తూ ఉన్నారు.

■






# కోట్ల సామాజిక సరళ శతకం

- పుట్టి గిరిధర్
94914 93170

**'ప్రవచనాలెన్ని విన్నా/ అవి కర్ణామృతమే**
**ఆచరణ లోపిస్తే కాలహరణమే!'**

మంచి ఎంత చెప్పినా, ఎంత విన్నా బాగుంటుంది, ఆచరణ లోనే కష్టం. వాక్యంలో గానీ, సూక్తిలో గానీ, పద్యంలో గానీ ఎన్నో విషయాలను ఎందరో బోధించారు. వాటిని మనం వినడం, చెప్పడం కంటే ఆచరించే ప్రయత్నం చెయ్యడం ముఖ్య మంటారు ప్రముఖ కవి, కాళోజీ పురస్కార గ్రహీత కోట్ల వెంకటేశ్వర రెడ్డి.

తెలుగు సాహిత్యానికి మకుటం వంటిది పద్యం. కానీ ఆ పద్యం సరళంగా ఉంటేనే సామాన్య ప్రజల మనసుకు చేరుకుం టుంది. అలాంటి పద్యాలు ఛందోబద్ధమైనా వేమన, సుమతీ లాంటి శతక పద్యాలు తెలుగు వారి గుండెల్లో భద్రంగా ఉ న్నాయి. ఆధునిక సాహిత్యం విస్తరిస్తున్న దశల్లో భాగంగా ఎన్నో కొత్త కొత్త ప్రక్రియలు పుట్టాయి. ఎవరి సౌలభ్యాన్ని బట్టి, అభిరుచిని బట్టి వారు ఆయా ప్రక్రియల్లో సాగిపోతున్నారు. ఆ దశలో భాగంగా ఛందస్సు అడ్డంకులను దాటి ఒక కొత్త ప్రక్రియ 'సరళ శతకాన్ని' మొదలెట్టారు. ఇందులో మకుటం అనేది ఒక నియమం. దానితో బాటుగా మిగతా మూడు పాదాలు ఉంటాయి. సరళమైన భాషలో పాఠకులను చేరాలనే కాంక్ష దీని ప్రధాన ఉద్దేశం. ఈనాటి కాలాన్ని బట్టి, ప్రజల మనోభావాలను బట్టి సాహిత్యం కూడా తన రూపురేఖలను మార్చుకుంటున్నది. దానికోసం ఒక్కొక్కరు ఒక్కో ప్రయత్నం చేస్తున్నారు. చెప్పే భావం, విషయ గాఢత తగ్గకుండా సాహిత్యంలో నిలిచే కవిత్వాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎన్నెన్నో ప్రక్రియలు వచ్చాయి, వస్తున్నాయి. కానీ ప్రక్రియ కోసం కవిత్వం రాయడం కాకుండా, రాసిన కవిత్వం ఏ ప్రక్రియలో ఇముడు తుందో చూసుకొని ఆ భావాన్ని అందులో చెబితే ఆ ప్రక్రియతో బాటు కవి చెప్పే భావమూ పండుతుంది. అలా ఏ ప్రక్రియలో రాసినా తమ భావాన్ని పండిస్తారు కోట్ల.

సాహిత్యం పట్ల అభిమానంతో, తెలుగు సాహిత్య వికాసం కోసం కృషి చేస్తున్న బుర్రా వెంకటేశం గారు బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తూనే తెలుగుభాషపై ఉన్న మమకారంతో 'జీవన ధన్య శతకం' పేరుతో సరళ శతకాన్ని రాసారు. మొట్టమొదట ఎవరు రాశారు అనేది ఇదమిద్ధంగా తేలకపోయినా దానిని పైకి తీసుకువచ్చి వ్యాప్తి చెయ్యడంలో బుర్రా వెంకటేశం ఆద్యులుగా చెప్పుకోవచ్చు. వీరు దాదాపు 14 భాషల్లో నైపుణ్యాన్ని కలిగి ఉన్నారు. 'గెలుపు పిలుపు' (Selfie of Success) అనే చక్కని జీవన గ్రంథాన్ని రాసి అంతర్జాతీయ ఖ్యాతిని సాధించారు. వీరి సరళ శతకాన్ని చదివి ఆ ప్రక్రియను బలోపేతం చేసేందుకు ఇప్పుడు కోట్ల వెంకటేశ్వర రెడ్డి కూడా 'కోట్ల సరళ శతకాన్ని' మన ముందుకు తీసుకువచ్చారు.

'కాలగతి తెలియంగా బహుకష్టం కోట్లా!' అనే మకుటమే శతక సారాన్ని తెలియజేస్తుంది. ఈనాటి కాలగమనాన్ని తమ అక్షరాలతో అల్లి, సామాజిక అంశాలతో సరళంగా కూర్చారు. ఇందులో ముఖ్యంగా నేడు మనిషి ఎదుర్కొంటున్న పరిస్థితుల నుంచి మనిషి ప్రవర్తన వరకు, అటు ప్రజలు ఇటు నాయకుల వరకు, ప్రకృతి మొదలుకొని మనిషి మానసిక సంఘర్షణలను సుతిమెత్తగా చెబుతూనే వ్యంగ్యాత్మక చురకలను అంటిస్తారు. కోట్లకు చెట్టుపై మమకారం ఎక్కువ. వారి కవిత్వం చెట్టును చుట్టి రాకుండా నడవదు. చెట్టు గుణాన్ని మనిషికి ఆపాదిస్తూ బోధన చేస్తూ ఉంటారు. అలాంటి వాటిలో కొన్ని ముఖ్యమైన పద్యాలను పరిశీలిస్తే ...

'చెట్టుకు మొక్కాలంటే/ దానికి పాదాలుండవు
త్యాగధనులకుండేవి సహస్ర హస్తాలే!'

'ఆకు రాలినా/ పూవు రాలినా చెట్టు దు:ఖించదు
చిగురునో మొగ్గనో వాగ్దానం చేస్తూనే ఉంటుంది!'

'మిత్రమా రాలిన ఏ విత్తూ/ మట్టిలోనే మలిగిపోదు
అదను చూసి సహస్ర బాహువుల్తో పైకి లేస్తుంది!'

ఇందులో ఏ పద్యాన్ని చూసినా మనిషి చెట్టులా సహస్ర బాహువులతో విస్తరించాలని ఉద్బోధ కనిపిస్తుంది. ఓడి పోయినా మళ్లీ బతకడం మొదలెట్టాలని, ఓడిపోయినంత మాత్రాన చావడం కాదు.. అదును చూసి ఎదుర్కోవాలనే ధైర్యాన్ని నూరిపోస్తారు కవి. చెట్టు తన పని తాను చేసుకు పోతుంది, మనిషీ అలా ఉండాలని అంటారు.

చెట్టుపై ప్రేమను చూపినట్లే మధ్య మధ్యలో జీవన సహచరితో ఉన్న బంధాన్ని అందంగా చెప్తారు.

'ఆమే నేను/ నాలుగు పాదాల ఒకే పద్యం
ఊహిస్తున్నకొద్దీ జీవనసారం పొంగిపొర్లుతది!'

ఇద్దరినీ నాలుగు పాదాల ఒకే పద్యంగా మలచడం అందమైన ఊహ. అలా ఊహించేకొద్దీ ప్రేమభావం నిజంగానే పొంగిపొర్లుతుంది.

'వేలెత్తి చూపినప్పుడల్లా
ఎగిరెగిరి పడితే విరిగేవి మన ఎముకలే
ఒక్కోసారి మౌనమే మహా ఔషధమ'ని, ఎగిరిపడితే నష్టం మనకేనని సూటిగా చెప్తారు.

ఇంతకాలం ప్రపంచం మన గుప్పిట్లో ఉందనుకున్నాం. కరోనా వచ్చాక ఎడం ఎడంగా జరగడం చూస్తున్నాం. ఈ శతకంలో కరోనా కాలాన్ని కూడా నిక్షిప్తం చేస్తారు.

'కరోనా కాలంలో గదిలో/నే తలదాచుకుంటే నీ స్వేచ్ఛేదని
కిటికీ రెక్కమీద ఊరపిచ్చుక వెక్కిరిస్తోంది!'

అందరికీ ఇలాంటి అనుభవాలను ఎన్నో మిగిల్చింది కరోనా కాలం. చివరికి పిచ్చుక కూడా మనల్ని చూసి వెక్కిరించడం మన అసహాయతను స్పష్టంగా చూపెడుతుంది. చలిచీమల చేతిలో చిక్కినట్లు కరోనా చేతిలో చిక్కడం, నదులు శవాలను ఊరేగించడం, ఆక్సిజన్ కొరతతో ప్రజల పడిన ఇబ్బందులు, ఆకలి కేకలు, వలస పాదాల రక్తపు గుర్తులు, శ్మశాన వాటికలో శవాలు వరుసలో ఉన్న విధానం మొదలైన అంశాలను వాస్తవ దృష్టితో చెప్పారు.

'పదునెక్కిన పాట/ పదవిని మోహించిందా
సుఖం శిలువ మోయలేదు!'

సుఖాన్ని మోహిస్తే కష్టాన్ని విడిచి పెట్టినట్లే. కష్టాన్ని పాడిన పాట సుఖానికి అలవాటు పడితే మళ్లీ ఆ బరువును మోయలేదనే హెచ్చరికను నేటి నాయకులకు సూచిస్తున్నారు.

'పిలవని పేరంటానికి/ పరుగులెత్తిన నది
సముద్రునితో కలిసి ఉనికిని కోల్పోతుంది!'

ఇందులో వాస్తవాన్ని సహజంగా చెప్పారు. అనువుగాని చోటికి పరుగులు తీస్తే మన ఉనికికే ప్రమాదమని చెబు తున్నారు. ప్రకృతిని పరిశీలన గావిస్తూనే దాన్ని మనిషిలోకి తొడ్కొని రావడం కోట్ల అభివ్యక్తిలో ముఖ్యమైన అంశం.

'నడవాలి నాన్నా నడవాలి/ నడవందే లక్ష్యం ఎదురు పడదు
ఆగిపోయిన చోట సమాధి రాళ్ళు మొలుస్తాయి!'

ఇందులో సమాధి రాళ్లు మొలవడం అనేది గొప్పగా చెప్పారు. ఆగిపోతే చచ్చిపోయినట్లేనని, నిరంతర ప్రయత్నమే మనల్ని లక్ష్యానికి చేరుస్తుందనే భావాన్ని చెప్తారు. చేసిన సేవ వృథా కాదని, నేటి రక్త సంబంధాలు ఎలా ఉన్నాయి, మనిషి విషపూరితం ఎలా అవుతున్నాడు, రైతు, చెట్టును పట్టించు కోకుండా పంట గురించి, పండు గురించి ఎలా ఆలోచిస్తాం, ఎన్నికలు, ఓటు అమ్మడం కూడా వ్యసనమని, రాజ్య కాంక్ష, పాదయాత్ర లాంటి అంశాలు; పెద్దల పట్ల గౌరవం, తలెత్తి చూడని, విరామం ఎరుగని ప్రయాణం నది చేస్తుందని, అలా మనిషి పయనం ఉండాలని, నిండుకుండ లాంటి కాళేశ్వరం, దు:ఖనది లాంటి వైద్యశాల మొదలైన అంశాలను ఎన్నింటినో ఇందులో చెప్తారు.

ఈ సరళ శతకానికి ముందుమాటలో సాంస్కృతిక కళా సంచాలకులు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి మామిడి హరికృష్ణ చెప్పినట్లు 'కోట్ల ఈ శతకంలో ఎన్నెన్నో సమకాలీన సార్వత్రిక, మానవీయ, కౌటుంబిక, ధార్మిక, తాత్విక అంశాలను వస్తువులుగా చేసుకుని రాస్తూ, వాటిని ప్రాకృతిక ధర్మాలను జీవన విలువలను నగిషీలుగా చెక్కి పాఠకులకు సరికొత్త అనుభూతిని దర్శింపచేస్తారు.' అలాగే ప్రముఖ కవయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి చెప్పినట్లు 'అనుభవసారంతో, సందర్భాన్ని బట్టి, ప్రజల జీవితాన్ని, జీవనాన్ని కలం కన్నుతో చూస్తూ, మానవీయ విలువలతో రాస్తూ ఉంటారు కోట్ల'. సరళ శతకంతో సరళమైన భాషలో, మృదువుగా చెప్పినా, పదునైన భావాలను పలికించడంలో కోట్ల దిట్ట. ఇలా మరోమారు పాఠకుల హృదయాలను చూరగొన్నారు. ■






# ఆధునిక స్త్రీ దృక్కోణంలో సీత జోస్యం

- భమిడిపాటి గౌరీశంకర్

94928 58395

**'నా**కు కావలసింది మీ ఆమోదం కాదు. మీలో ఆలోచన. నేను కోరేది మీ ప్రశంస కాదు. మీలో జిజ్ఞాస. ఎప్పటికప్పుడు పాత విషయాలను కొత్త దృష్టితో చూడ్డానికి మనం ప్రయత్నించాలి. పాత విశ్వాసాలను కొత్త పరీక్షలకు పెట్టుకోవాలి. కొత్త వ్యాఖ్యానాలను చెప్పుకోవాలి' నార్ల వారి ఈ మాటలు ఆయన తన పౌరాణిక నాటకాలకు రాసుకొన్న పీఠికలోనివి. ఆధునిక దృక్పథం నుంచి చూస్తే వీటికి సరైన సమాధానాలను అన్వేషించుకోవటంలో ఓ ప్రత్యేకత, వాస్తవ సత్యాలు గోచరమవుతాయి. ఇందుకు లోతైన అధ్యయనం అవసరమవుతంది.

తెలుగులో పురాణాలపై తొలి సమగ్ర విమర్శ ప్రారంభించిన వారు కవి రాజు త్రిపురనేని రామస్వామి గారని చెబుతారు. ఆ తరువాత ఆ స్థాయిలో పురాణాల్లోని అంశాలను చరిత్ర, జ్ఞానం, విజ్ఞానం, వర్తమానం అనే వాటి ఆధారంగా విపులంగా చర్చించినది నార్ల వెంకటేశ్వరరావు (1990-1985) గారు. ఆయన రాసిన పౌరాణిక నాటకాల్లో 'జంబాలి', 'సీతాజోస్యం', 'నరకంలో హరిశ్చంద్రుడు' ఇందుకు నిదర్శనాలుగా నిలుస్తాయి. 'సీతజోస్యం' సమతా స్వాతంత్ర్యాలు సర్వత్రా నెల కొనాలనీ, దారిద్ర్యం, దైన్యం అనే భూతాలు మటుమాయమైపోవాలనీ, వివేక, విజ్ఞానాలు వర్ధిల్లాలనీ ఆయన అంటారు.

'సీతజోస్యం' పీఠికలో ఆయన లేవనెత్తిన ప్రశ్నలు రామాయణ గాథకున్న చారిత్రక ఆధారాలేమిటి? రాముని మునులు వనవాసం ఏ ప్రాంతంలో? రాక్షసులెవరు? వారి స్థితిగతులేమిటి? రుషులెవరు? యజ్ఞయాగాదుల ప్రాధాన్యత ఎందుకు? ఆనాటి ఆయుధాలు ఎలాంటివి? మన పురాణాలపై పరిశోధనలు చేసిన వారిలో రమేష్ చంద్రదత్ ప్రముఖుడు. ఈయన మాటల్లో 'రాముడు ఇంద్రునికి' 'ఒక కొత్త మార్పు'. నార్ల వారి 'సీతజోస్యం' నాటకంలో దత్ గారి వ్యాఖ్యానాలకు ప్రాతిపదిక, ప్రాతినిధ్యం కనిపిస్తాయి. సీతా రాముల వ్యక్తిత్వాలను కూడా నార్ల వారు విశ్లేషించారు. ఆయన అభిప్రాయంలో సీత వ్యక్తిత్వమే గొప్పది.

పురాణాల నుంచి చరిత్రను వేరు చేయాలి. మతం నుంచి నీతిని విడదీయాలి. చరిత్ర వేసిన పురాణం మన మేధాశక్తిని బలహీనపరుస్తుంది. హేతుదృష్టిని మందగింపజేస్తుంది. వాస్తవికతకు దూరం చేస్తుంది. నార్ల వారు 'రామాయణం పూర్తిగా కల్పిత గాథ' గానే ఆధారాలతో నిరూపించారు. కొన్ని సూచనలు, సిద్ధాంతాలను ప్రతిపాదిస్తారు. వాస్తవ సత్యాలుగా రుజువు చేసారు. చదువరులకు ఓ కొత్త మేధా దృక్పథాన్ని కలిగిస్తారు. రామాయణాన్ని కూలంషంగా పరిశీలించిన జర్మన్ పండితుడు 'హెర్మన్ యాకో' విష్ణువునకు మరో పేరు 'ఉపేంద్రుడు'.. ఇతడు ఇంద్రుని సోదరుడు అని వివరిస్తారు. ఇందుకు సోదాహరణలు ఋగ్వేద, రామాయణాల నుంచి చూపిస్తారు. ఇలా అనేకమంది పండితులు విశ్లేషణలను పేర్కొంటూ తనదైన 'కొత్త చూపును' నార్ల వారు ప్రకటించారు.

నార్ల వారి జీవనరేఖలను స్పృశిస్తే ఆయనలోని నిర్భీతి అర్థమవుతుంది. 'నచ్చని నాయకుడిని ఎన్నుకోవాలని చెప్పే హక్కు గాంధీజీకి సహా ఎవరికీ లేదు' అని ఆయన తెగేసి చెప్పారు. 'నిజము కప్పిపుచ్చి నీతిని విడనాడి స్వామి సేవ సేయు జర్నలిస్టు తార్చువాని కంటే ఎక్కువ వాడురా', 'ఏ ఎండకు ఆ గొడకు పట్ట నేర్చినవాడు ఏమైనా కావచ్చునేమో కాని, నిజమైన ఎడిటర్ కానేకాడు' అని నిష్కర్షగా చెప్పిన జర్నలిస్టు, సాహితీవేత్త, కవి, రచయిత, ఉద్యమకారుడు, తెలుగు ఇంగ్లీష్‌ల్లో చక్కని పాండిత్యం కలిగి ఉండే వారు నార్ల వారు. ఆయనకు స్ఫూర్తి ప్రదాతలు బెర్నార్డ్‌షా, గురజాడ, కందుకూరి, వేమన, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి తదితరులు. ఎం.ఎన్.రాయ్‌కి వీరాభిమాని. క్రమంగా

హేతువాదిగా, మానవవాదిగా జీవించారు. నార్ల వారిని గురించి గోరాశాస్త్రి గారు 'తెలుగు నుడికారంలో 'కారం' ఎంత ఉ ందో తెలియజెప్పినవాడు' అని, ఖాసా సుబ్బారావు గారు' విరామ మెరుగని పని రాక్షసుడు నార్ల'ని కొనియాడారు.

నార్ల వారు 1908 డిసెంబరు 1న జబల్‌పూర్ (మధ్యప్రదేశ్)లో జన్మించారు. 1985 ఫిబ్రవరి 16న మరణించారు (76). 'వి.ఆర్.నార్ల' అనేది వీరికున్న మరో పేరు. లక్ష్మణరావు, మహాలక్ష్మి గార్లు ఈయన తల్లిదండ్రులు సులోచనాదేవి జీవిత భాగస్వామి. వీరికి శారద, చంద్రకళ, మీనాక్షి, ఉమాదేవి, రమాదేవి అనే ఐదుగురు కుమార్తెలు, మోహన్‌దాస్, దుర్గాదాస్, లక్ష్మణదాస్ అనే ముగ్గురు కుమారులు. భారత విద్యుత్‌రంగ నిపుణులుగా ఖ్యాతిగాంచిన నార్ల తాతారావు వీరి సోదరుడు. వీరి పెద్ద కుమార్తె కొల్లి శారద గుంటూరు నగరపాలక సంస్థకు మేయరుగా పని చేశారు. 1928లో 'కాంగ్రెస్' అనే పత్రికకు రాసిన ఉత్తరంతో పత్రికారంగ ప్రవేశం చేశారు. 'స్వరాజ్య', 'జనవాణి', 'ప్రజామిత్ర' పత్రికల్లో మెరుపులు మెరిపించారు. 1938 నుంచి 1959 వరకు ఆంధ్రప్రభలో వివిధ హోదాల్లో పనిచేశారు. తరువాత ఆంధ్రజ్యోతిలో పనిచేశారు. ఛాందస భావాలపై రాజీలేని పోరు చేశారు. తెలుగు పత్రికా రచనకు కొత్త గౌరవాన్ని, మర్యాదను తీసుకువచ్చారు. బాలల కోసం 'వాస్తవమ్ము నార్ల మాట' అనే మకుటంతో నీతి పద్యాలు రాశారు. తరువాత దానిని 'నవయుగాల బాట నార్ల మాట'గా మార్చి 700 పైగా సందేశాత్మక పద్యాలు రాశారు. తెలుగులోనే కాకుండా ఆంగ్లంలో కూడా రచనలు చేశారు.

ఈ జీవిత, జీవన, సామాజిక, కౌటుంబిక పరిశీలన్మాతక, ప్రయోగాత్మక, పరిశోధనాత్మక నేపథ్యంలో ఆయన రాసిన నాటకం 'సీతజోస్యం' ఈ రచనలో రెండు అంకాలున్నాయి. మొదటి అంకంలో సీతా, లక్ష్మణుడు, ఋషుల సంవాదం; రెండవ అంకంలో ఋషులు, రాముడు, సీతల సంవాదం ఉ న్నాయి. ఈ నాటకంలో సీతను వ్యక్తిత్వం ఉన్న ధీమంతురాలైన స్త్రీగా చిత్రించారు. సంప్రదాయ, ఛాందస భావాలతో రామాయణం చదివేవారు ఈ నాటకంలో 'సీత' ధోరణిని భరించలేరు. ఒక బాణికి అలవాటుపడిన 'రోటీన్' వాదాలను 'సీత' ఎదురించి నిలుస్తుంది. లక్ష్మణుడు ఆమెను వారించ లేకపోతాడు. రాముడికున్న 'మాట తప్పని' నైజాన్ని రాక్షసులను వధించే విషయం వదిలేయమంటుంది. ఋషులలో ఆమె మాట్లాడిన తీరులోని తీవ్రత ఆమెలోని అసలైన స్త్రీ తత్వాన్ని తెలుపుతుంది.

అసలు రాక్షసులను ఎందుకు చంపాలని ప్రశ్నిస్తుంది. 'ఈ అడవులను మీ ధ్వంసం చేస్తే వారి బతుకులే ధ్వంసం కావా', 'సేద్యం పట్ల వారికి ఆసక్తి లేదు. వారు హోమ గుండాలు ఎందుకు వెలిగించుకోవాలి? తన జీవిత విధానాన్ని ఎందుకు మార్చుకోవాలి', 'జంతువులను వేటాడి నట్టు తోటి మానవులను వేటాడి, వారి నివాస స్థానాల్లో తిష్ట వేయడమే మీ నాగరికత' 'భక్తుల స్వభావాన్ని బట్టి దేవతల స్వభావాన్ని నిర్ణయిస్తే మీ దేవతలే క్షుద్ర దేవతలేమో' … ఇలా ఋషులను వివిధ రకాలైన వాస్తవాలనే ప్రశ్నలను సంధిస్తుంది. రెండవ అంకంలో రామునితో కూడా ఇదే ధోరణిలో మాట్లాడు తుంది. రాక్షస వధలో తాను 'అర్షధర్మం' పాటిస్తున్నాను' అని రాముడు అంటే సీత వారు 'ఆత్మరక్షణ' కోసం పోరాటం చేస్తున్నారంటుంది. తల్లిదండ్రులకు 'మునీంద్రువ వలే' జీవిస్తామని ఇచ్చిన రాముని మాటను ఎత్తి చూపుతూ 'మునీంద్రులు అస్త్రశస్త్రాలను ధరిస్తారా? నిరాయుధులను చంపి వేస్తారా' అని గుర్తు చేస్తుంది. ముని వలే జీవించలేనప్పుడు ముని వేషం ఎందుకని ప్రశ్నిస్తుంది. చిత్రకూటంలో ఆశ్రమం నిర్మించుకొని చెప్పుకొన్న ప్రేమ బాసలను గుర్తు చేస్తుంది. ఎందుకీ 'బలిజాతర'ని మెత్తగా నిందిస్తుంది. ఒక సామాన్య స్త్రీ వలనే భర్త పాదాలను తాకి, పట్టుకొని ప్రార్థిస్తుంది. 'అమాయకులైన ఆటవికులైన వీరిని ఋషుల మాటలు విని వధించడం ఆపమని' కోరుతుంది. ఆమె వ్యధలో న్యాయముంది. స్త్రీగా సాటి స్త్రీలకు మాంగల్య భిక్ష పెట్టమట్టుంది. అందుకు రాముడు 'నేటి పురుషుడు వలే అవసరమైతే నేను నిన్ను విడుస్తాను. లక్ష్మణుడిని విడుస్తాను. నా ప్రాణాలైనా విడుస్తాను. కాని ఋషులకిచ్చిన మాటను తప్పను' అంటాడు. అందుకు సీత…. వంశ గౌరవం కోసం చెబుతూ… 'ఎప్పుడో ఒకప్పుడు నట్టడివిలో నన్ను దిక్కులేని దాన్నిగా మీరు దిగ విడుస్తారంటుంది. ఆ తరువాతి పరిణామాల్లో 'సీతజోస్యం' నిజమవుతుంది.

'సీతజోస్యం' రచనలో నార్ల వారు ఓ అద్భుత స్త్రీమూర్తిగా సీతను చిత్రిస్తారు. విశ్లేషణాత్మకమైన, విభిన్నమైన, ఆలోచనాత్మక, తాత్విక భావనలు కలిగిన దయార్ద్రత సీత దృక్పథం చిత్రణలో నార్ల వారి రచనా శిల్పచాతుర్యం దృశ్యమానమవుతుంది. 'రచనలో రచయిత వ్యక్తిత్వం రేఖామాత్రంగానైనా కనిపించవలసిందే'నంటారు బుచ్చిబాబు. 'సీతజోస్యం'లో సీత పాత్రలో నార్ల వారు కనిపిస్తారు. 1981లో ఈ రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ■

## మహేశ్వరయ్య సాహిత్య పురస్కారం
## కవితా సంపుటాలకు ఆహ్వానం

**సా**హితీ స్రవంతి కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శిగా సేవలందించిన కవి, కథకుడు, తెలుగు ఉపాధ్యాయుడు సంకటి మహేశ్వరయ్య. ఆయన పేరిట ప్రతి సంవత్సరం స్మారక సాహిత్య పురస్కారాన్ని ఇవ్వాలని సాహితీ స్రవంతి జిల్లా కమిటీ నిర్ణయించింది. 2021 సంవత్సరానికి గాను ఈ పురస్కారం కవిత్వానికి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు కర్నూలు జిల్లాకు చెందిన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కవులు 2019 జనవరి నుంచి 2021 డిసెంబర్ 31లోపు వచ్చిన కవితా సంపుటాలను పురస్కారం పరిశీలన కొరకు పంపవచ్చు. ఒక కవి ఒక కవితా సంపుటిని మాత్రమే పంపాలి. కవితా సంపుటాలను మార్చి 31లోపు పంపాలి. మరిన్ని వివరాలకు 98497 53298 నెంబర్‌కు సంప్రదించవచ్చు.

**– కెంగార మోహన్**



**చింతకింది శంకర్ (ముంబై నివాసి) రచించిన 'నానీ స్వగతాలు' పుస్తకాని జనవరి 16న ప్రముఖ కవి డా. ఎన్ గోపి హైదరాబాదులోని తన ఇంటి గ్రంథాలయం 'వేమన విజ్ఞాన మందిరం'లో ఆవిష్కరించారు. ఈ చిత్రంలో కుడికాల వంశీధర్, రాపోలు సీతారామరాజు, కవి శంకర్ ఉన్నారు.**



**ఫిబ్రవరి 18న మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో చలపాక ప్రకాష్ 'కరోనా నానీలు' ఆంగ్ల అనువాదం 'కరోనా కెలమిటీ' పుస్తకాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చలపాక ప్రకాష్, సోమేపల్లి వేంకట సుబ్బయ్య, శర్మ సిహెచ్, పి.రాజశేఖర్, వశిష్ట పాల్గొన్నారు.**



## విజేత

**- చొక్కర తాతారావు**
**63011 92215**

**ఆ**రాటం తప్పేం కాదు
అర్రులు చాచటమూ తప్పు కాదు
ఎత్తయినా పల్లమైనా
మొదటి అడుగుతోనే ప్రారంభం
లక్ష్యం చేరుకోవాలంటే
తపనే ముఖ్యం
ఎగరాలనే కోరిక ఉండొచ్చు
రెక్కల బలం చూసుకోవాలి
ఎగరగలమా లేదా నిర్ణయించుకోవాలి
పట్టుదల ఉండాలి
అప్పుడే శిఖరం చేరుకుంటావు
ఏ నిర్ణయమైనా నీలో పెరగాలి
నీతో పాటే ఎదగాలి
నిర్ణయాలు మార్చుకుంటే
లక్ష్యం చేరుకోలేవు
ఆకాశం అందుకోవాలని
ఆశించడం తప్పు కాదు
నేల మీద గెలిచినప్పుడే
అది సాధ్యం!

ఆకాశంలోనైనా నేలమీదైనా
లక్ష్యమే ముందుకు నడిపిస్తుంది
మనిషి ఆశలన్నీ ఆశయం కోసమే
ఆశల వెనకున్న విజయం కోసమే
అనుకోవడమే మనిషి పని
ఆలోచనే సగం విజయం
ఏ లక్ష్యమైనా నీలోనే పెరగాలి
నీతోనే మొదలవ్వాలి
అప్పుడు నువ్వే విజేతవు!



# చింతామణిపై నిషేధం సంస్కరణోద్యమాలకు అవమానం

**- వి.సుమతి**

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం చింతామణి నాటక ప్రదర్శనపై నిషేధం విధించింది. ఈ నాటకంలో సుబ్బిశెట్టి పాత్రధారి ఆంగికం, ఆహార్యం ఆర్యవైశ్య కులాన్ని కించపరిచేలా ఉన్నాయని, వారి మనోభావాలు దెబ్బతిన్నాయని ఈ నిషేధాన్ని (అదే కులానికి చెందిన) మంత్రి వర్యులు సెలవిచ్చారు గాని, నిషేధానికి గల కారణాలు విపులంగా ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది.

మనదేశంలో స్వాతంత్రోద్యమంతో పాటుగా అనేక సంస్కరణోద్యమాలు సాగాయి. బాల్యవివాహాలు, వితంతువుల దయనీయ స్థితిగతులు, మద్యపానం, వేశ్యావృత్తి వల్ల సంసారాల్లో చోటుచేసుకుంటున్న ఆర్థిక, సామాజిక సమస్యలు, నిరక్షరాస్యత వంటి వాటిపై అనేక ఉద్యమాలు సాగాయి. కందుకూరి వీరేశలింగం పంతులు వితంతు వివాహాలపై సాగించిన ప్రచారంతో తన కుటుంబం వెలికి గురైనా వెనుకంజ వేయలేదు. సాంప్రదాయ కుటుంబాల్లోని తల్లులు కూడా తమ చిన్నారి కుమార్తెలను పునర్వివాహం కోసం వీరేశలింగం గారి వద్దకు పంపించారు. ఈ విషయాల్లో వీరేశలింగం గారి భార్య రాజ్యలక్ష్మమ్మ చేసిన కృషి చాలా గొప్పది. ఇంట్లోకి సహాయకుల నెవరినీ అనుమతించని పరిస్థితిలో ఆమె స్వయంగా ఇంటికి కావాల్సిన నీళ్ళను మోస్తూ .. తమ వద్ద ఆశ్రయం పొందిన బాల్య వితంతులను ఏమాత్రం విసుక్కోకుండా సాకేవారు.

కన్యాశుల్కం నాటకంలో గురజాడ ఆనాడు జరుగుతున్న బాల్య వివాహాలను, బాలికల పట్ల చూపుతున్న నిర్దాక్షిణ్య వైఖరిని ఎండగట్టాడు. ఈ నాటకం నిడివి ఎక్కువ కావడంతో ప్రదర్శనలకు పరిమితులు ఏర్పడ్డాయి. పానుగంటి లక్ష్మి నరసింహారావు రాసిన కంఠాభరణం నాటకం విద్యావంతుల ఉపయోగపడింది కానీ, పదిమందిని ఆకర్షించలేకపోయింది.

వీరేశలింగం గారు 1919లో, అప్పారావు గారు 1915లో మరణించారు. 1920లో కాళ్ళకూరి నారాయణరావు గారు చింతామణి నాటకాన్ని రచించారు. ఆయన స్వయంగా ఆదర్శజీవి, సంస్కారవాది. తన సోదరికి వితంతు వివాహం జరిపినందున కుల బహిష్కారానికి గురయ్యారు. అయినా ఆయన భయపడలేదు. కాకినాడలో అప్పటికి సంస్కరణోద్యమాలు బలంగా సాగుతున్నాయి. ఆ సమయంలో వేశ్యా కుటుంబానికి చెందిన యువతిని వివాహమాడారు ఆయన.

ఆయన రచించిన చింతామణి నాటకంలో వేశ్యావృత్తిపట్ల మక్కువలేని చింతామణిని తల్లి బలవంతం చేసిన తీరు, విటుల పట్ల ఆమె కనబరిచిన ధనలాలస ప్రేక్షకులకు నవ్వు తెప్పించడమేగాక జుగుప్స కలుగ జేస్తాయి. వర్తక కుటుంబానికి చెందిన సుబ్బిశెట్టి వేశ్యలకలవాటు పడతాడు. అతడి తండ్రి కూడా ఈ బాపతే. విద్యావతి, భక్తి తత్పరత గల చింతామణి మంచి నర్తకి కూడా. ఆమె వద్దకు వచ్చే భవాని శంకరుడనే బ్రాహ్మణ గృహస్తు తన ఆస్తులన్నింటినీ వేశ్యకప్పగించి, తన మిత్రుడు బిళ్వమంగళుడిని కూడా అక్కడికి తీసుకువెళ్లాడు. బిళ్వమంగళుడు సద్గుణుడు. భార్యతో సామరస్యంగా వుంటూ పుస్తక పఠనంతో కాలక్షేపం చేస్తుంటాడు. మిత్రుడైన భవానీ శంకరుడు చింతామణి ఇచ్చిన ఒక శ్లోకానికి అర్థం నాకు తెలియడం లేదు. నీకేమైనా తెలుసా అని అడిగితే బిళ్వమంగళుడు ఆ శ్లోకపు అర్థం విడమర్చి చెప్పగలుగుతాడు. అప్పటినుంచి ఆయనకు చింతామణితో పరిచయం దినదినాభివృద్ధి చెంది గృహచ్ఛిద్రానికి, ఆస్తి వినాశనానికి దారితీస్తుంది. ఆ రకంగా సుబ్బిశెట్టి, భవానీ శంకరుడు, బిళ్వమంగళుడు ముగ్గురు తమ ఆస్తుల్ని వేశ్య వాటికకు కైంకర్యం చేస్తారు. బిళ్వ మంగళుడు తన తండ్రి అవసాన దశలో ఉన్న విషయం తెలిసినా ఇంటికి వెళ్లడానికి నిరాకరిస్తాడు. చివరకు చింతామణి జోక్యం చేసుకుని బలవంతంగా పంపుతుంది. అతడు ఇంట్లో ఉన్నపుడే తండ్రి మరణిస్తాడు. అప్పుడు జోరున వర్షం మొదలై పిడుగు శబ్దాలు వినిపిస్తాయి. బిళ్వ మంగళుడు రివ్వున లేచి చింతామణికి పిడుగు శబ్దమంటే భయమని, తాను వెంటనే వెళ్లాలని బయల్దేరతాడు. భార్య రాధ ఎంత వారించినా నిలువడు. వారి ఇంటి నుంచి

చింతామణి ఇంటికి వెళ్లాలంటే ఒక ఏరు దాటాలి. ఆ సమయంలో నావ లేకపోవడంతో ఏటిలో ఈదుకుంటూ వెళతాడు. వాగులో కొట్టుకుపోతున్న ఒక శవాన్ని ఆసరాగా చేసుకుంటాడు. చింతామణి ఇంటి గేటు మూసి ఉండటంతో గోడ మీద వేలాడుతున్న ఒక తాడును ఆసరాగా తీసుకుని లోపలికి వెళతాడు. బిల్వమంగళుడి ఒంటిమీద రక్తపు మరకలు చూసి చింతామణి గేటు బయటికి వచ్చి చూస్తే గోడమీద ఉన్నది తాడు కాదు, పాము. ఆ పాము రక్తమే అతని ఒంటికి అంటుకున్నది. ఇద్దరూ కలిసి ఏటి ఒడ్డుకు వస్తారు. బిల్వమంగళుడు తాను ఇంతకముందు ఆసరాగా చేసుకొని వచ్చిన శవాన్ని చూసి నిర్ఘాంతపోతాడు. అది అతని భార్య రాధ శవం. ఆ సమయంలో నావ లేదని తెలుసుకున్న రాధ భర్తను వెతుక్కుంటూ వచ్చి వాగులో మునిగిపోయి మరణిస్తుంది. విషయం తెలిసి బిల్వమంగళుడు తీవ్రంగా దుఃఖిస్తాడు. ఈ సంఘటన తరువాత చింతామణి విరక్తితో భక్తిమార్గంలో కృష్ణుని భజనలకు అంకితమవుతుంది. బిళ్వమంగళుడు కూడా ఆమె మార్గంలోనే ప్రయాణం చేయడంతో కథ ముగుస్తుంది.

ఇప్పుడు నిషేధం ఎందుకంటే .. సుబ్బిశెట్టి పాత్రను చూపిస్తున్న తీరు తమ గౌరవానికి భంగం కలిగిస్తుందని, కాబట్టి దీనిని నిషేధించాల్సిందిగా ఆర్యవైశ్యులు ఆ కులానికి చెందిన మంత్రి ద్వారా ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చారట. సమస్య సంస్కరణోద్యమాల నుంచి సంకుచితమైన ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగజారింది. కులాల వారీగా వ్యక్తులను ప్రసన్నం చేసుకోవటానికి నాటకంపై నిషేధం విధించారు.

చింతామణి నాటకం యొక్క ప్రథమ ప్రదర్శకులు బందరు రామమోహన నాటక సంఘం వారు. దీని 4వ కూర్పులో రచయిత ఇలా పేర్కొన్నారు : ఇప్పటికే సంఘం వల్ల 456 ప్రదర్శనలు నా లెక్కకు వచ్చినవి. వర్తకులు కొందరి వ్యాప్తి చూసి, కడుపు కక్కుర్తిగాండ్రకు గంజినీళ్ళకిచ్చి, మా చింతామణి పోలికలతో మాయ చింతామణులను గోకించి, పట్టపగటి దొంగతనముగ బజారుల ద్రిప్పుచున్నారు. ఇప్పటికీ విధముగా మా చింతామణికి నాలుగు పిల్ల చింతామణులు పుట్టినవి. మసిపూసి మారేడును నేరేడన్నను, సన్నము – ముదుకులు సంతలో తేలక మానవు. కాని ఈ మజిలీ మోసమెరుగని వారిదియేయనుకొని తరువాత తెల్లబోవుట తటస్థించుచు వున్నది.' అని వాపోయారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధానికి ముందు నాటకాన్ని చదివి, సంబంధిత సంఘాలతోనూ, వ్యక్తులతోనూ చర్చించిందా? అసలు నాటకం ప్రతిని చదివి దాని గురించి అవగాహనకు వచ్చిందా? అంటే సమాధానం దొరకదు. కేవలం కులం సమస్య వల్లనే ఈ నిషేధం అంటే ఆమోదయోగ్యంగా లేదు. మన స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖపాత్ర నిర్వహించిన గాంధీ మహాత్ముడు పుట్టింది ఆర్యవైశ్య కులంలోనే. కొల్లాయి గట్టితేనేమీ మా గాంధి కోమటై పుట్టితేనేమి అని పాటలు పాడారు. దానర్థం ఆయన కులాన్ని కించపరచడం కాదు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం 56 రోజులు నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్య కుటుంబంలోనే జన్మించారు. ఆంధ్ర రాష్ట్ర సాధకుడుగా ఆయన పేరుగాంచాడు. కుల ప్రస్తావన ఎప్పుడూ రానేలేదు. నేను కాకినాడలో చదువుకుంటున్నప్పుడు కళావంతుల కుటుంబానికి చెందిన ఇద్దరు యువతులు మాతో కలిసి చదివారు. వారి ఇంట్లో పుట్టిన ఏడుగురు ఆడపిల్లలను వారు పట్టభద్రులుగా చదివించి వివాహాలు చేశారు. ఆనాటి సంస్కరణోద్యమాల ఫలితమది.

చింతామణి నాటకంలో చొరబడిన వికృతహాస్యం, అశ్లీలత రాష్ట్రమంతటా వ్యాపించలేదు. అసలు ఇప్పుడు ఏ నాటక ప్రదర్శనలకూ అనువైన పరిస్థితుల్లేవు, థియేటర్లు లేవు, కళాకారులకు ప్రోత్సాహం లేదు. విద్యావంతులు చౌకబారు హాస్యానికి చోటు ఇవ్వరు. పండుగలు, తిరునాళ్ల సమయంలో– పల్లెటూర్లలో జరిగే నాటకాల్లోనే విపరీత హాస్యం, అసభ్య సంభాషణలు ఉంటున్నాయి. అవి కూడా టీవీల్లో వచ్చే కొన్ని ప్రోగ్రాముల కంటే ఎక్కువేమీ కావు. ప్రభుత్వ ప్రోత్సాహం కరువైనా ప్రజల్లో ఆదరణ వల్ల అన్ని నాటకాల్లోకి చింతామణి నాటకమే ఇప్పుడు అప్పుడప్పుడైనా ప్రదర్శనలకు నోచుకుంటున్నది. పల్లెటూర్లలో జనం ఈలలు, చప్పట్లే నాటకాలకు బలమూ, ప్రోత్సాహమూనూ. అందువల్ల ఈ విషయంపై సంబంధిత వ్యక్తులతో చర్చించి సమస్యను తొలగించుకోవచ్చు. ఈ మాత్రం దానికి మొత్తం నాటకాన్ని నిషేధించడం అవివేకమవుతుంది.

ప్రత్యేకంగా సుబ్బిశెట్టిని కించపరిచారేమోగాని కులాన్ని నాటకంలో ఎక్కడా ప్రస్తావించలేదు. ప్రముఖ గాయకుడు గోరటి వెంకన్న తన 'సంత' అనే పాటలో ప్రతిరోజు గల్లా పెట్టి దగ్గర కూచుని వచ్చి పోయే అమ్మాయిలను చూసి నోరెళ్ళబెట్టి చూసే సుబ్బయ్య శెట్టి సంతరోజున బేరం పోతుందని అందమైన అమ్మాయిలు ముందునుంచి పోతున్నా కన్నెత్తి కూడా చూడడు అంటారు. దాని ఉద్దేశం సుబ్బయ్య శెట్టి వ్యాపారం పట్ల మక్కువను ఎత్తిచూపడమే గాని అతని కులాన్ని హేళన చెయ్యడం కాదు. సమస్య కోర్టు పరిధిలో ఉంది కాబట్టి ఈ విషయంపై ఇంతకంటే ఎక్కువ చర్చించడం భావ్యం కాదు. కళాకారుల జీవితాన్ని దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం సమంజసమవుతుంది. ■

జ్ఞాపకం



# ఆయనే ఒక కథాక్షేత్రం ...

- సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి

**సిం**గమనేని నారాయణ గారు తెలుగు అక్షరమంత నిండైన మనిషి. ఎప్పుడూ తెల్లటి దుస్తులతో, తెల్లటి నవ్వుతో, తెల్లటి వ్యక్తిత్వంతో లోపలా బయటా ఒకేలా కనిపించే అరుదైన మనిషి. ఆయన రచనల్లో ఏమి చెబుతున్నాడో జీవితంలో కూడా అదే ఆచరించిన నిఖార్సైన మనీషి. భౌతికంగా ఆయన మన నుంచి దూరమై ఏడాది గడుస్తోన్న సందర్భంగా నాలుగు మాటలు రాయాలనుకొన్నాను.

ఏడాది కాలంగా ఆయన్ను గురించి రాయడానికి పూనుకున్నపుడంతా కలం వణికేది. ఒక్క వాక్యం కూడా పొందికగా కుదిరేది కాదు. ఆయన లేడనే విషయాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేని బేలతనం. ముప్పయేళ్లుగా ఆయనతో స్నేహం – తను గురువుగా, నేను శిష్యునిగా. ఎన్నో సాహిత్య సమా వేశాల్లో ఆయనతో కలిసి పాల్గనడం, ఆయన వెంట తిరగడం, ప్రశ్నలుగా మారి ఆయనను గుచ్చుతూ ఉండటం, మార్క్సిస్టు దృష్టికోణం నుంచి నాకు అర్థమయ్యేలా సరళమైన సమాధానా లుగా మారి నన్నాయన సంతృప్తి పరచడం – ఆ దృశ్యాలన్నీ కళ్ళమీంచి తొలగి పోవడం లేదు.

రెండు రోజులకు ఒకసారైనా ఫోన్‌లో మాట్లాడుకునే వాళ్ళం. ఏ విషయమైనా – అది రాజకీయం కావచ్చు, రైతు సమస్యలు కావచ్చు, దేశకాల పరిస్థితులు ఏవైనా సరే సాహిత్య రూపంలోకి తెచ్చి చర్చించేవాడు. ఆయా సమస్యలు గతంలో కథలుగానో, కవితలుగానో, నవలలుగానో ఎక్కడెక్కడ కనిపించాయో వివరంగా విశ్లేషించేవాడు. అవే సమస్యల్ని ఇప్పుడు సాహిత్య రూపంలోకి తెస్తే ఎలా ఉండాలో సూచించే వాడు. ఏ రచయిత ఎక్కడ తప్పటడుగులు వేసే వాడో, ఎక్కడ బాణంలా దూసుకెళ్లి సమస్యను గురిజూసే వాడో స్పష్టంగా చెప్పేవాడు. అసంఖ్యాకమైన కథల్ని, నవలల్ని రచయితల పేర్లతో సహా గుర్తుపెట్టుకుని విశ్లేషించే అపారమైన జ్ఞాపకశక్తి ఆయనకుండేది.

సింగమనేని గారు గొప్ప ఉపన్యాసకులు. ఒక్కొక్క పదాన్ని జాగ్రత్తగా మునివేళ్ళతో పట్టుకుని పక్క పక్కన కూర్చినట్లుగా ఉంటుంది – ఆయన మాట్లాడుతూ వుంటే. ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే – ఏ ఉపన్యాసకుడైనా ఊత పదాలనో, వ్యర్థపదాలనో ఫ్లో కోసం ఉపయోగిస్తూ ఉంటాడు. కానీ సింగమనేని ఉపన్యాసాల్లో ఊతపదాలు ఉండవు. వ్యర్థపదాలు ఉండవు. నేను చాలా ఉపన్యాసాల్ని రికార్డు చేసికొని యథాతథంగా రాసి చూశాను. కొన్నింటిని ఆయనకు పంపాను కూడా. తర్వాత అవి పత్రికల్లో వ్యాసాలుగా కూడా వచ్చాయి. పదాల్ని ఒత్తి పలికినా, వాక్యాల్లో ఆవేశాన్ని నింపినా అది ఆయన రాత లాగే ఉండేది. రాతకూ మాటకూ, కథాగమనానికీ జీవితానికీ, ఆయన చర్చించిన సాహిత్యాంశాలకూ జీవితంలో ఆచరణకూ తేడా లేకుండా బతికిన మనిషి సింగమనేని. ప్రపంచాన్ని గాఢంగా ప్రేమించిన వ్యక్తి. ఎప్పుడూ మనుషుల మధ్య ఉండాలనుకొనే మనిషి. స్పందించే కథ కనిపించినా, కవిత కనిపించినా వెంటనే రచయితకు ఫోన్ చేసి అభినందించేవాడు. ఆ రచయిత ఎక్కడైనా కనిపిస్తే అతను రాసిన కథను గుర్తుజేసే వాడు.

జీవితకాలం సొంత ఇల్లు లేకుండా బతికిన మనిషి ఆయన. ఉపాధ్యాయులకు ప్రభుత్వం వారు ఇచ్చే ఇంటి స్థలాన్ని కూడా తీసుకోకుండా జీవించిన నిబద్ధత కలిగిన వ్యక్తి. తన వాటాగా

వచ్చిన పల్లెల్లోని వ్యవసాయ పొలాన్ని తమ్ముళ్లకు వదిలేసి వచ్చిన మార్క్సిస్టు జీవి. 'దున్నేవాడికే భూముండాల. నాకేల?' అని నవ్వుతూ చెప్పేవాడు. అవినీతి, అబద్ధం, ఆరోపణ ఎరుగని ఉత్తముడు. ఎవ్వరినీ మాటమాత్రమైనా నొప్పించని వాడు. ప్రతి మనిషినీ దగ్గరకు తీసికొని ఆప్యాయంగా పలుకరించే వాడు. మనిషితనాన్ని పంచేవాడు.

ఆయన నవ్వు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో ఆయన మాట అంత స్పష్టంగా ఉంటుంది. ఆయన నడక అంత ఆత్మీయంగా ఉంటుంది. కొత్త రచయితల్ని దగ్గరికి తీసుకుని భుజం తట్టి ప్రోత్సహించి, రచన చేయడంలోని మెలకువల్ని ఒక్కొక్క పొరే విడదీసి ఆకళింపు చేసే విధానం నాలాంటి అనుభవించిన వాళ్లకే తెలుస్తుంది. నేను కేవలం ఆయన మాటలు వినేందుకే సాహిత్య సమావేశాలకు వెళ్లేవాన్ని. సభలో మాట్లాడే మాటలకన్నా పక్క పక్కన కూర్చుని నా సందేహాలను తీర్చుకునేందుకు ఎక్కువ ఆసక్తి చూపేవాన్ని. ఆయన కథల్ని చదువుతూ ఆయన వెంట తిరుగుతూ వుంటే – రెండూ వేరువేరుగా అనిపించేవి కావు నాకు. ఆయన్నుంచి ఆయన సాహిత్యాన్ని వేరు చేసి చూడ లేక పోయేవాన్ని. ఆ కథలన్నీ కుప్పబోస్తే నిలువెత్తు ఆయనే. అందులోని పాత్రలన్నీ ఆయనే.

సింగమనేని గారి పక్కన కూర్చుని ఆయన్ను వింటూ ఉంటే – ఆయన రాసిందానికంటే రచయితల్ని ప్రేరేపించిందే ఎక్కువనిస్తుంది. ఆయన ముందు చెవి ఒగ్గితే జూదం, అడుసు లాంటి కథలు పదుల సంఖ్యలో వినొచ్చు. కరువు పొలాల్లోని రైతుల, రైతుకూలీల ఆర్తి, ఆవేదనలతో కూడిన దృశ్యాలెన్నో మనం చూడొచ్చు. ఆయన తను రాసిందానికంటే సహ రచయితల కోసం మిగిల్చిందే ఎక్కువ. ఆయనతో నాలుగు మాటలు మాట్లాడితే ఒక కథకు ప్లాన్ చేసుకోవచ్చు. ఒకరోజు గడిపితే ఒక నవలకు వస్తువు సిద్ధం చేసుకోవచ్చు. భూమి దు:ఖాన్ని గురించి ఆయన మాట్లాడని రోజు లేదు. ఆయన మునివేళ్లను అంటుకొని మట్టి పొత్తిళ్ళ ఆవేదన నిరంతరం రాలుతూ ఉంటుంది. ఆయన పెదాల మీద కరువు నేలల రోదనలు వేడి గాలుల అలలై కదలుతుంటాయి. ఆయన చూపుల నిండా ఎండిన పైర్ల బాధావీచికలు అల్లల్లాడుతుంటాయి. ఆయన నిలువెత్తు రాయలసీమ కథ. నాగలి పట్టి దున్నిన కరువు నేలల పచ్చి గాయాల బాధ.

ఆయన కథ రాసే విధానం అత్యంత సహజంగా ఉంటుంది. ఆయన శైలి నిరాడంబరం. ఆయన వచనం నిరలంకారం. ఆయన కథంతా చదివితే – రాయలసీమ మెట్టనేలల మీద నడిచినంత సహజంగా ఉంటుంది. ఆయన వాక్యం ఇక్కడి రైతు నడకలా ఉంటుంది. నేలను దున్నుకొంటూ పోతోన్న నాగలిలా ఉంటుంది. ఆయన కథలు చదివిన ప్రతి పాఠకుడికీ ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

ఆయన కథల నిండా రైతు వెతలు కనిపిస్తాయి. ఇక్కడి మట్టి పొత్తిళ్ల వేదనలు వినిపిస్తాయి. సీమ మట్టి మనుషుల బతుకులకు ప్రతినిధులు అవి. వాళ్ల ఆశలూ, ఆందోళనలూ, ఆవేశాలూ ప్రతిధ్వనించే గొంతుకలు. ఇతర ప్రాంతాల వాళ్ళు ఇక్కడి మనుషుల మీదా నేలమీదా నీళ్ళమీదా సంస్కృతుల మీదా ఏర్పరుచుకున్న అపోహలను తొలగిస్తూ ఈ గడ్డమీద తొంబైశాతం జనాభా ఎలా బతుకుతున్నారో తెలిపే సజీవ చిత్రాలు ఆయన కథలు.

జీవితమే సాహిత్యంగా జీవించిన గొప్ప రచయిత సింగమనేని. కరువు మీద కరువు ఏడు కరువులచ్చినా జీవేచ్ఛను కోల్పోక, మరో తొలకరి కోసం ఓపిగ్గా ఎదురు చూసే రైతాంగం ఉన్న నేల సీమప్రాంతం. అలాంటి వ్యవసాయం నిలువునా అప్పుల్లో మునిగిపోయి ఆత్మహత్యల బారిన పడుతుండటం, రోజురోజుకు రైతులు పిట్టల్లా రాలిపోతూ ఉండటం చూసి మొదట నమ్మలేక, తర్వాత ఆ దౌర్భాగ్యం వెనకున్న కారణాలు అర్థమై, తోటి రచయితలతో కలిసి రైతులకు ధైర్యం కలిగించేందుకూ, ఆత్మహత్యల్నించి తప్పించేందుకూ పల్లెలకు పయనం కట్టిన మనిషి సింగమనేని. కరువులకు కారణం వర్షం కురవటం పోవడం కాదనీ, నీళ్లు అందక పోవడమేననీ, నదులనించి కాలువలు తీసి కరువు ప్రాంతాన్ని నీళ్ళతో తడిపి రైతుల్ని కాపాడాలనీ ఉద్యమాలు చేస్తూ ప్రభుత్వాలకు అనేకానేక విన్నపాలు అందించారు. కథలు మాత్రమే రాయటం కాదు, కథల వెంట ఆయా ప్రాంతాలకు వెళ్లి బాధాసర్పదష్టుల వెన్నుతట్టి, కథలో చెప్పిన పరిష్కారాలు నిజజీవితంలో కూడా ఆచరణలోకి తేవడానికి ప్రయత్నించిన మనిషి ఆయన. సింగమనేని భౌతికంగా దూరమై ఏడాది గడుస్తున్నా ఆయన గుర్తుకు రాని రోజంటూ లేదు. కథ చదివినపుడంతా దాన్ని గురించి ఎదుట నిలబడి చర్చిస్తున్నట్లే ఉంటుంది. వాక్యాలు రాస్తున్నప్పుడంతా పేజీల ముందు వేలెత్తి హెచ్చరిస్తున్నట్లే ఉంటుంది. రాత్రిపూట కథో, నవలో చదువుతూ రచయిత దృష్టికోణం అస్పష్టంగా అనిపించినపుడు, ఆ విషయాన్ని గురించి సార్‌తో చర్చిస్తే సరిపోతుంది గదా అనిపిస్తుంది. ఆయన లేని విషయం అర్థమై గుండెలు పిండేసినట్లుంటుంది. సాహిత్యపరంగా గానీ, సమాజపరంగా గానీ ఏ సందేహం వచ్చినా ఇప్పటికీ ఆయనకు నివేదించి నివృత్తి చేసుకోవాలనిపిస్తుంది.

ఆయన లేకపోవటం ఇప్పుడే కాదు నాకెప్పుడూ లోటే! ■

**:: ఫిబ్రవరి 25 : సింగమనేని నారాయణ మొదటి వర్థంతి ::**

# డైరీ

## కొడవటిగంటి సతీమణి మృతి

ప్రఖ్యాత రచయిత, విమర్శకుడు, చందమామ రూపశిల్పి కొడవటిగంటి కుటుంబరావు సతీమణి వరూధిని (93) ఫిబ్రవరి 10వ తేదీన మరణించారు. వరూధిని కుమారుడు శాస్త్రవేత్త, రచయిత రోహిణీ ప్రసాద్ 2012లో మరణించారు. కుమార్తె ప్రముఖ అనువాదకురాలు శాంతసుందరి గత ఏడాది కన్నుమూశారు. అల్లుడు గణేశ్వరరావు ప్రొఫెసర్, రచయిత కూడా. సాహితీ మిత్రులకు సుపరిచితమైన కుటుంబం వారిది. వరూధిని ప్రసిద్ధ రచయిత చలం తమ్ముడి కుమార్తె. వరూధిని తల్లి కొమ్మూరి పద్మావతి కూడా సీనియర్ నట, రచయిత్రి కాగా, తండ్రి కొమ్మూరి వెంకట్రామయ్య, విస్తారంగా వెలువడిన కొకు రచనలన్నిటినీ భద్రపరచడంలో వరూధిని పాత్ర చాలా గొప్పది. కూతురు ఇంట్లో వుండిన వరూధిని ఆమె మరణానంతరం వృద్ధాశ్రమంలో చేరారు. అక్కడే వుంటూ అనారోగ్యంతో మృతి చెందిన వరూధినికి హైదరాబాదులో అంత్యక్రియలు జరిగాయి. పలువురు సాహితీ మిత్రులు, పాత్రికేయులు ఆమెకు నివాళులర్పించారు.

సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి కొడవటిగంటి అల్లుడు గణేశ్వరరావును కలసి పరామర్శించారు. సంస్థ తరపున ఆమె మృతికి సంతాపం తెలిపారు. వారు 2002 ప్రాంతంలో హైదరాబాదు వచ్చినప్పటి నుంచి సాహితీ స్రవంతితో, ప్రస్థానంతో సన్నిహితంగా ఉన్నారు. కొడవటిగంటి శతజయంతి సభలు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగినప్పుడే వరూధినితో సహా వారు హైదరాబాదు వచ్చిన సంగతి ఈ సందర్భంగా గణేశ్వరరావు గుర్తు చేసుకున్నారు.




## దృశ్యాంతరం ఆవిష్కరణ

మార్క్సిస్టు కోణంలో రాసే రచన ఏదైనా సామాజిక ప్రయోజన కారి అవుతుందని ప్రముఖకవి జి.వెంకట కృష్ణ అన్నారు. ఇటీవల కర్నూలు లలిత కళాసమితి ఆధ్వర్యంలో రచయిత నాగేశ్వరాచారి రాసిన దృశ్యాంతరం పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సభకు ఇక్బాల్ అధ్యక్షత వహించారు. ఈ గ్రంథంలో 8 నవలలను, 6 కవిత్వ సంపుటాలను, 6 కథా సంపుటాలను, 4 తెలంగాణ సంపుటాలను పరిచయం చేశారని వెంకటకృష్ణ అన్నారు. మార్క్సిస్టు భావజాలమే సమ సమాజ నిర్మాణానికి పునాదిరాళ్ళన్న సందేశాన్ని, సంకేతాన్ని ఈ గ్రంథం చెబుతుం దన్నారు. రచయిత పాణి మాట్లాడుతూ సాహిత్య అనుభవాన్ని సామాజిక చైతన్యంగా వచ్చిన రచనగా అభివర్ణించారు. సభలో జంధ్యాల రఘుబాబు, మారుతి పౌరోహితం, ఇనాయతుల్లా, టి.వెంకటేష్,అజీజ్, సాహితీ స్రవంతి నాయకులు విజయులు తనగల, కవితా వెంకటేశ్వర్లు, పులిచేరి మహేష్; డిటీఎఫ్ నాయకులు గట్టు తిమ్మప్ప, రత్నం ఏసేపు తదితరులు పాల్గొన్నారు.


**FORM IV**

(Rule 8)

UNDER PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867
STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS
ABOUT MONTHLY -SHAITYA PRASTHANAM

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : Hyderabad |
| 2. | Periodicity of its Publication | : Monthly |
| 3. | Printer's Name | : V. Krishnaiah |
| | 1 (a) Whether a citizen of India | : YES |
| | (b) If a foreigner, the country of origin | : - |
| | Address | : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 4. | Publisher's Name | : V. Krishnaiah |
| | 1 (a) Whether a citizen of India | : YES |
| | (b) If a foreigner, the country of origin | : - |
| | Address | : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 5. | Editor's Name | : T. RAVI |
| | Nationality | : INDIAN |
| | 1(a) Whether a citizen of India | : YES |
| | (b) If a foreigner, the country of origin | : - |
| | Address | : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 6. | Name and addresses of owner | : V. Krishnaiah |
| | 1(a) Whether a citizen of India | : YES |
| | (b) If a foreigner, the country of origin | : - |
| | Address | : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |

**I, V. KRISHNAIAH, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

Sd/
V. KRISHNAIAH
Publisher

Date: 01.03.2022

# మునిమాణిక్యం నరసింహారావు

జననం : 15.03.1898 మరణం : 03.02.1973



అప్పులు చేయడం-తీర్చడం, దాంపత్యోపనిషత్, గృహప్రవేశం, హాస్య కుసుమావళి, కాంతం కథలు వంటి రచనలు ప్రాచుర్యం పొందాయి. తెలుగునాట మధ్య తరగతి జీవితాలను తన రచనలలో చిత్రించారు. భార్యాభర్తల అనుబంధాలను ఆహ్లాదంగా, హాస్యభరితంగా రాశారు.


SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 3 ▪ SANCHIKA - 6 ▪ KRISHNA ▪ February - March 2022
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 10.03.2022


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు

## సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం

సమగ్ర సాహిత్యం రచనలు







రూ. 100/-



రూ. 200/-



రూ. 110/-



రూ. 30/-



రూ. 70/-



రూ. 120/-



రూ. 40/-



రూ. 40/-



రూ. 25/-



రూ. 45/-

20% ప్రత్యేక డిస్కౌంట్‌తో...

Prajasakti Printers & Publishers.P(Ltd)
SBI A/c : 35712952033
IFSC Code : SBIN0001008
Governorpet Branch, Vijayawada

గూగుల్ పే, ఫోన్‌పే నం : 9490099258

ప్రజాశక్తి బుక్‌హౌస్
9490099057

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కార్నూలు, అనంతపురం